ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698


తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం 04.12.2025 | సంపుటి : 12 సంచిక : 135 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



# పెద్దధన్వాడకు ఇథనాల్ పీడపోయినట్టే..!?




**ప్రజాగ్రహానికి తలొగ్గిన గాయత్రీ రెన్యూవబుల్ లిమిటెడ్ యాజమాన్యం**

**నెల్లూరు జిల్లాకు తరలిపోయిన కాలుష్య కంపెనీ**

**ప్రజల ఐక్యపోరాటాలతో సాధ్యమైన విజయమిది..**

### అనుకున్నదే అయ్యింది..!

ప్రాణం పోయినా ఫ్యాక్టరీని అడ్డుకుంటామని భీష్మించిన ప్రజలు గెలిచారు. కలిసికట్టుగా ఉద్యమించిన వారి పంథా నిలిచింది. కాలుష్య భూతంపై కన్నెర్రజేసిన చిన్నాపెద్దా తుదికంటా తమ ఊరి కోసం పోరాడిన దరిమిలా ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఎట్టకేలకు తోకముడిచింది. రైతులు, గ్రామస్తులపై ఎన్ని కేసులు పెట్టినా, భయభ్రాంతులకు గురిచేసినా ఫలితం లేకపోవడంతో చివరకు తట్టాబుట్టా సర్దుకోక తప్పలేదు. పండుగా పబ్బాలను కూడా లెక్కచేయకుండా ఒక్కతాటిపై నిలిచిన పెద్దధన్వాడ.. విషపూరిత ఇథనాల్ ఫ్యాక్టరీని తరిమికొట్టింది. యావత్ తెలంగాణ రాష్ట్రానికి, పల్లెలకు పోరాట దిక్సూచినని ఘనంగా చాటింది.

- మొదట్నుంచీ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నడుం బిగించిన పెద్దధన్వాడ ఆబాల గోపాలం
- నేడు సంబరాలు జరుపుకోనున్న గ్రామస్తులు
- ఇంకా రద్దుకాని పరిశ్రమ లైసెన్సు
- మరో ఐదేళ్ల పాటు పొంచిఉన్న ప్రమాదం


ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పెద్దధన్వాడ గ్రామస్తుల నిరసనలు(ఫైల్)

హైదరాబాద్, నవంబర్ 3 (జనంసాక్షి) : పది నెలల పాటు ప్రజలంతా ఐక్యంగా పోరాడటంతో గాయత్రి రెన్యూవబుల్ ఫ్యూయల్స్ అండ్ అలైడ్ ఇండ స్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని పెద్దధన్వాడలో వెనక్కి వెళ్లక తప్పలేదు. ప్రస్తుతం ఆ కంపెనీ శ్రీ పొట్టి శ్రీరా ములు నెల్లూరు జిల్లాకు తరలిపోయినట్టుగా తెలు స్తోంది. ఈ మేరకు తాజాగా విడుదలైన ఓ ప్రకట నలో ప్లాట్ నంబర్లు 564-1ఏ, 564-1బి, 564-1డి, 564-1ఈ, ఇఫ్కో కిసాన్ సెజ్, రాచర్లపాడు గ్రామం, రేగడిచెలిక గ్రామ పంచాయతీ, కోడవ లూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో డిసెం బర్ 30న మధ్యాహ్నం 1 గంటలకు ప్రజా భిప్రాయ సేకరణకు వెళ్లను న్నట్టు తెలిసింది. 200 కిలోలీటర్లు ప్రతి రోజు (200కేఎల్ పీడీ) సామర్థ్యంతో ధాన్యా ల ఆధారిత ఎథనాల్ ప్లాంట్ ప్రాజెక్టుకు ఏర్పాట్లు చేయను న్నట్టు సదరు ప్రకటనలో వెల్లడైంది. ఈ విషయం బయటకు రావడంతో ఫ్యాక్టరీ తరలిపోయిన ట్టుగానే పలువురు భావిస్తున్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్ అనేది వ్యవ సాయ, ఆహార పరిశ్ర మలకు ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన ప్రాంతం. కృష్ణపట్నం ఓడరేవు, ఎన్ హెచ్-16 సమీపంలో ఉండటం వల్ల రవాణా సౌకర్యం బాగుంటుం దని ఫ్యాక్టరీ యాజమాన్యం అటుగా వెళ్లిపోయి నట్టుగా సమాచారం. పైగా పెద్దధన్వాడలో ఫ్యాక్టరీ పనులు ఇసుమంతైనా ముం దుకు సాగకపోవడంతో యాజమాన్యం విరమించుకోక తప్పలేదు. మిగతా 2లో..



### జనంసాక్షి కీలక భూమిక

కాలుష్య పరిశ్రమ ఏదో రాబోతుందని పసిగట్టిన 'జనంసాక్షి' 2024 అక్టోబర్ నెలలో 'పచ్చని పల్లెలపై ఇథనాల్ విషం' శీర్షికన ఓ సంచలన కథనాన్ని వెలుగులోకి తెచ్చింది. దీంతో ప్రజలందరూ అప్రమత్తమై ఇథనాల్ వల్ల కలిగే నష్టాలను తెలుసుకుని చైతన్యవంతమయ్యారు. అక్కడినుంచి ఫ్యాక్టరీ పనులను ఏ కోశానా ముందుకు వెళ్లనివ్వలేదు. ప్రతినిత్యం 'జనంసాక్షి' కూడా ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పతాక శీర్షికన వార్తలు ప్రచురించింది. ఫ్యాక్టరీ యాజ మాన్యం కదలికలను, ఈ విషయంలో రాజకీయ పరిస్థితులను ఎప్పటికప్పుడు కుండబద్దలు కొట్టింది. ప్రజల ఉద్యమానికి ఊతంగా, పల్లెలకు ప్రచారవాహిణిగా కథనాలను వెలువరించింది. రాష్ట్రంలో కాలుష్య పరిశ్రమలు రాబోతున్న ప్రాంతాలను సైతం అప్రమత్తమయ్యేలా ఎప్పటికప్పుడు తన గొంతు వినిపించింది. అందుకే 'మమ్మల్ని జనంసాక్షియే ముందుండి నడిపించింది' అని ఆయా గ్రామాల ప్రజలు చెబుతుండటం 'జనంసాక్షి'కీ ఓ గర్వకారణం..!

# త్వరలో కొలువుల జాతర


### మరో 40వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం

- హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేసేది లేదు
- తెలంగాణ ఉద్యమ జ్వాలలకు కరీంనగర్ కేంద్రం
- బీఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఏమయ్యిందో చూశాం
- రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం
- సమర్థులనే సర్పంచ్‌లుగా ఎన్నుకోండి
- హుస్నాబాద్ బహిరంగసభలో సిఎం రేవంత్ రెడ్డి

హుస్నాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. తమ ప్రభుత్వంలో ఇప్పటికే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల పాలన పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 262.68 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఇచ్చిన హామీ మేరకు త్వరలో మరో 40వేల ఉద్యోగాల భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శ్రీకాంతాచారి స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60వేల ఉద్యోగాలు ఇచ్చాం. ప్రజాపాలన రెండున్నరేళ్లు పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం అన్నారు. పనిచేసే వాడిని, మంచోడిని గ్రామ సర్పంచ్ గా ఎన్నుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వీలైనంత వరకు సర్పంచ్ లను ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. పొంకనాలు కొట్టే వాడిని సర్పంచ్ గా ఎన్నుకోవద్దని చెప్పారు. ఎద్యుకేషన్,ఇరిగేషన్ పై మా ప్రభుత్వం దృష్టి పెట్టింది. నెహ్రూ స్ఫూర్తితోనే మేం ముందుకెళ్తున్నాం. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యింది. ఆనాడు ఎస్ఆర్ఎస్పీని నెహ్రూ కడితే ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఆనాడు కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులే దేశానికి మిగతా 2లో..


సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ హుస్నాబాద్ నుంచే బహుజన దండు కట్టారు. తెలంగాణ ఉద్యమం ఈ ప్రాంతం నుంచి ఉవ్వెత్తున ఎగసిపడింది. కరీంనగర్‌లో ఇచ్చిన మాట నిలబెట్టుకు నేందుకే సోనియమ్మ తెలంగాణ ఇచ్చారు. రాష్ట్రంలో డిసెంబర్ 3కు ఒక ప్రత్యేకత ఉంది. ఇప్పటికే 60 వేల ఉద్యోగాలు ఇ చ్చాం. త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తాం. రెండున్నరేళ్ల పాలన పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు పూర్తి చేస్తాం. దేశంలో అత్యధికంగా వరిని పడించేది మన రాష్ట్రంలోనే. వ్యవసాయం అంటే దండగ కాదు పండుగ అని చేసి చూపించింది మన ప్రభుత్వమే. రాష్ట్రంలో రైతులపై రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు పెట్టాం. రాష్ట్రంలో వందలాది బస్సులకు ఆడబిడ్డలు యజమానులు అయ్యారు." - సీఎం, రేవంత్ రెడ్డి

## స్థానిక సంస్థల ఎన్నికల తర్వాతే భూదార్ కార్డులు



**తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం**

**భూ భారతిని సమగ్రంగా తయారు చేశాం**

**ప్రజలు మెచ్చే విధంగా చట్టం : మంత్రి పొంగులేటి**

హైదరాబాద్(జనంసాక్షి):భూదార్‌కార్డులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూ భారతిలో నియమ నిబంధనలు కఠినతరం చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి చిన్న విషయానికి కోర్టుకు వెళ్లకుండా భూ భారతిని సమగ్రంగా తయారు చేశామన్నారు. 9 లక్షల ఫిర్యాదుల్లో న్యాయపరమైనవి పరిష్కరించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిలోని ఉన్న అనేక సీక్రెట్ లాకర్లు ఓపెన్ చేశామని తెలిపారు. భూభారతిలో చెప్పిన విధంగా భూధార్ కార్డులు సిద్ధం చేశామని, స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత వాటిని పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడి ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. భూదార్ కార్డులు సిద్ధం చేశామని.. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత అందజేస్తామని చెప్పుకొచ్చారు. రెండో విడతలో 373 నక్షలేని గ్రామాల్లో సర్వే చేస్తామని..ఎన్నికల తర్వాత భూదార్ కార్డులు అందజేస్తామని తెలిపారు. రెండేళ్ల ప్రజా పాలనలో కేసీఆర్ హయాంలో తీసుకువచ్చిన ధరణిని బంగాళాఖాతంలో వేశామని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణిలో ఉన్న అనేక సీక్రెట్ లాకర్లు ఓపెన్ చేశామన్నారు. భూభారతిలో చెప్పిన విధంగా భూధార్ కార్డులు సిద్ధంగా మిగతా 2లో..


## 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు జీహెచ్ఎంసీలో విలీనం




- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జీహెచ్ఎంసీ విస్తరణ ప్రక్రియ పూర్తి
- నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్(జనంసాక్షి):జీహెచ్ఎంసీ విస్తరణ ప్రక్రియ పూర్తి అయింది. జీహెచ్ఎంసీ విస్తరణపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు జీహెచ్ఎంసీలో విలీనం చేసినట్లు ఉత్తర్వులు ఇచ్చింది. నిన్నటి నుంచి అమల్లోకి వచ్చినట్లు నోటిఫికేషన్ జారీ చేసింది. విలీనమైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రికార్డుల స్వాధీనానికి ఉత్తర్వులు జారీ చేసింది. రికార్డులు స్వాధీనం చేసుకునే బాధ్యత డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లకు అప్పగించింది.

## పూర్తిస్థాయి డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాతే విచారణ



**పంచాయతీ ఎన్నికల పిటిషన్లపై సింగిల్ జడ్జి ఉత్తర్వులు**

న్యూఢిల్లీ(జనంసాక్షి):పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై పూర్తి స్థాయి దస్త్రాలను సమర్పించాలని సీజే ధర్మాసనం పిటీషనర్ల న్యాయవాదులను ఆదేశించింది. ఆ తర్వాతే విచారణ చేపడతామని పేర్కొంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు సర్పంచ్ పదవుల్లో రిజర్వేషన్‌లు కేటాయించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన ఆరు పిటీషన్లు దాఖలయ్యాయి. వాటిపై జస్టిస్ టి. మాధవీదేవి మంగళవారం విచారణ చేపట్టారు. అనంతరం ఈ పిటిషన్లను డివిజన్ బెంచ్ ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ జనాభా తక్కువ ఉన్నచోట, లేని చోట కూడా ఆయా కులాల వాళ్లకు రిజర్వేషన్లు కేటాయించారని, మరికొన్ని చోట్ల పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా లేనప్పటికీ మిగతా 2లో..

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు రండి



- ప్రధాని మోడీని కలిసి ఆహ్వానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రాజ్‌నాథ్ సహా పలువురు కేంద్రమంత్రులకూ..
- తెలంగాణలో పలు అభివృద్ధి పనులకు సహకరించాలని ప్రధానికి విజ్ఞప్తి
- ఉపముఖ్యమంత్రి భట్టితో కలసి ఆహ్వానించిన ముఖ్యమంత్రి
- పార్టీలో అంతర్గతంగా మాట్లాడితే ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం

2లో..

## కొత్తగూడెం రైల్వేస్టేషన్ సమీపంలో నాటుబాంబుల కలకలం

- వీధి కుక్క కొరకడంతో పేలుడు..శునకం మృతి
- చెత్తకుప్పలో మరో 4 నాటుబాంబులు గుర్తింపు

భద్రాద్రికొత్తగూడెం(జనంసాక్షి):కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లో బాంబు పేలుడు కలకలం సృష్టించింది. గురువారం ఉదయం ఆగంతకుడు స్థానిక రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్ ఫారంపై నల్ల సంచి ఉంచి వెళ్లిపోయాడు. అందులో ఏముందో ఎవరు పట్టించుకోలేదు. ఆ సంచిని వీధి కుక్క రైల్వే ట్రాక్‌పైకి నోటితో లాక్కెళ్లింది. ఆ సంచిలో ఉల్లిగడ్డ ఆకారంలో మిగతా 2లో..

## కోకాపేటలో కోట్ల వర్షం

- మూడో విడత భూముల వేలం..
- హెచ్ఎండీఏకు రూ.వెయ్యి కోట్ల ఆదాయం



హైదరాబాద్(జనంసాక్షి):కోకాపేట నియోపొలిస్ భూములకు మూడో విడత వేలం ప్రక్రియ ముగిసింది. ఇవాళ ప్లాట్ నెంబర్ 19, 20లోని 8.04 ఎకరాలకు అధికారులు ఈ-వేలం నిర్వహించారు. ప్లాట్ నెంబర్ 19లో ఎకరానికి రూ. 131 కోట్లు, ప్లాట్ నెంబర్ 20లో ఎకరం రూ. 118 కోట్ల ధర పలికింది. మిగతా 2లో..

## బహుజనులకు బహిరంగంగానే మోదీ ద్రోహం



- పార్లమెంట్‌లో చర్చ, ప్రజల అభిప్రాయం లేకుండానే కులగణన చేపట్టేందుకు కేంద్రం సన్నాహాలు
- రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని బహుజనులను బహిరంగంగానే ద్రోహం చేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఒక నిర్దిష్ట ఫ్రేమ్‌వర్క్, ఒక నిర్దిష్ట కాలపరిమితి ప్రణాళిక, ఒక పార్లమెంట్‌లో చర్చ, ప్రజల అభిప్రాయం లేకుండానే కులగణన చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారని విమర్శించారు. "జనగణనపై పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని మిగతా 9లో..

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

**ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు, ఇద్దరు జవాన్లు మృతి**

బీజాపూర్(జనంసాక్షి):ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు, ఇద్దరు జవాన్లు మృతి చెందారు. ఘటనాస్థలి నుంచి మావోయిస్టుల మృతదేహాలతోపాటు.. భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

# స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత భూదార్ కార్డులు

ఉన్నాయన్నారు. భూభారతి చట్టంతో రైతులందరికీ మేలు జరుగుతుందన్నారు. ధరణిని బీఆర్ఎస్ సర్కార్ విదేశీ సంస్థకు అప్పగించిందని చెప్పారు. కాంగ్రెస్ పవర్లోకి వచ్చాక భూ భారతిని కేంద్ర సంస్థకు అప్పగించామన్నారు. భయంకరమైన ధరణి వెబ్ సైట్ ను బంగాళాఖాతంలో పడేశామన్నారు. స్థానిక ఎన్నికల తర్వాత నక్షల్లేని గ్రామాల్లో సర్వేలు చేసి భూధార్ కార్డులిస్తామని తెలిపారు. ధరణి వెబ్ సైట్ తో బీఆర్ఎస్ రెవెన్యూ వ్యవస్థను కుప్పకూల్చిందన్నారు.ప్రజలు మెచ్చే భూ భారతి చట్టాన్నితమ ప్రభుత్వంలో తీసుకువచ్చామని పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద నక్షలేని 5గ్రామాల్లో భూ సర్వే పూర్తి చేశామని వివరించారు. ఇవాళ(బుధవారం) తెలంగాణ సచివాలయంలో మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు. 6వేల మంది వీఆర్ఏలను నియమించామని తెలిపారు. 490మంది సర్వేయర్లకు లైసెన్స్‌లు ఇచ్చామని చెప్పుకొచ్చారు. ఒక్కో రెవెన్యూ గ్రామానికి సర్వేయర్లను అలాట్ చేశామని తెలిపారు. రోవర్స్ కొనుగోలు చేసి సర్వేయర్లకు అప్పగిస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా కుప్ప కూల్చారని..తమ ప్రభుత్వం సరిచేస్తున్నామని వివరించారు. 59 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను అధునాతనంగా నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# మూగ బాలుడిపై కుక్కల దాడి మెరుగైన వైద్యం అందించాలి

### అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్,డిసెంబర్3(జనంసాక్షి):హయత్‌నగర్‌లో మూగ బాలుడు ప్రేమ్ చంద్‌పై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనపై ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలోని అధికారులతో ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బాలుడి పరిస్థితిపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల దాడిలో గాయపడిన బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని వారిని అదేశించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అతడికి అవసరమైన తక్షణ సాయం అందించాలని సూచించారు. స్వయంగా బాలుడిని పరామర్శించటంతో పాటు, ఆ కుటుంబాన్ని కూడా కలిసి.. వారి బాగోగులు పరిశీలించి, ప్రభుత్వ పరంగా వారిని ఆదుకోవాలని కమిషనర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో జరిగిన సంఘటనలు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని. . తక్షణం వీధి కుక్కల దాడుల కట్టడికి చర్యలు చేపట్టాలని ఆయన అదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.హయత్‌నగర్ షిర్డీ నగర్‌లో బి తిరుపతి, చంద్రకళ దంపతులు నివసిస్తున్నారు. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా తిరపతి పని చేస్తున్నాడు. అతడి భార్య చంద్రకళ కూలీ పని చేస్తుంది. వీరికి ప్రేమ్‌చంద్ (8) కుమారుడు ఉన్నాడు. అతడికి మాటల రావు. మంగళవారం ఉదయం ప్రేమ్ చంద్.. తన ఇంటి సమీపంలోని కిరాణ దుకాణానికి వెళ్తున్నాడు. కుక్కల గుంపు అతడిపై మూకుమ్మడిగా దాడి చేశాయి. శీతాకాలం కావడంతో అతడు స్వెటర్ ధరించాడు. స్వెటర్‌ను నోటితో కరిచి అతడిని కొంత దూరం లాక్కెళ్లాయి. ప్రేమ్ చంద్ మూగవాడు కావడంతో కేకలు వేయలేక నిస్సహాయంగా ఉండిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి.. రాళ్లు విసిరి కుక్కలను తరిమికొట్టారు. ఈ ఘటనలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి.. 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. వాహనంలో అతడిని ఫీవర్ ఆసుపత్రికి తరలించారు. బాలుడికి మెరుగైన వైద్య చికిత్స కోసం నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. బాలుడి చెవకి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆ బాలుడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు అతడి తల్లిదండ్రులు వెల్లడించారు. ఈ సంఘటనపై పత్రికలో వార్త కథనాలు వెలువడడంతో సీఎం రేవంత్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

# కేంద్రం నిర్ణయంతో 'ఆరావళి' అంతమే

### పర్వతాల భౌగోళిక స్వరూపాన్ని మార్చేలా తీసుకుంటున్న చర్యలు డెత్ వారెంటే.:సోనియాగాంధీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. ఆరావళి పర్వతాల భౌగోళిక స్వరూపాన్ని మార్చేలా తీసుకుంటున్న చర్యలు డెత్ వారెంటేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. వంద మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చంటూ ఆరావళి పర్వతాల విషయంలో కేంద్ర పర్యాటక శాఖ కొత్త మార్పులు తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలోనే సోనియాగాంధీ ఓ జాతీయమీడియా సంస్థకు రాసిన కథనంలో ఆందోళన వ్యక్తంచేశారు. ఆ కథనంలోని కొన్ని లైన్స్‌ను కాంగ్రెస్ షేర్ చేసింది. "గుజరాత్, రాజస్థాన్, హరియాణాల్లో విస్తరించి ఉన్న ఈ పర్వతాలది దేశ చరిత్ర, భౌగోళిక స్వరూపంలో కీలక పాత్ర. అక్రమ మైనింగ్ వల్ల ఇప్పటికే వాటి సహజ సంపద తరిగిపోతుండగా.. మోదీ ప్రభుత్వం వాటికి డెత్ వారెంట్ ఇచ్చింది 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించింది. ఇది మైనర్లు, మాఫియాకు బహిరంగ ఆహ్వానం. ప్రభుత్వ విధానాల్లో పర్యావరణంపై నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం. ఇది వన్యప్రాణుల రక్షణ చట్టాన్ని (1972) ఉల్లంఘించడమే అవుతుంది. వెంటనే ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలి" అని సోనియా డిమాండ్ చేశారు.కేంద్రం తీసుకువచ్చిన మార్పులను అంగీకరించిన సుప్రీంకోర్టు.. అక్రమ మైనింగ్‌ను నిరోధించేందుకు తీసుకోవలసిన చర్యలపై చేసిన సిఫారసుల్ని పరిశీలించేందుకు ఓకే చెప్పింది. సుస్థిర మైనింగ్ కోసం నిర్వహణ ప్లాన్‌ను సిద్ధం చేయాలని పర్యావరణ మంత్రిత్వశాఖను సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ ప్లాన్ ఖరారయ్యే వరకు మైనింగ్ కోసం కొత్తగా లీజులు ఇవ్వకూడదని ఆదేశాల్లో పేర్కొంది. కాగా.. ప్రపంచంలోనే పురాతనమైన పర్వతశ్రేణుల్లో ఆరావళి ఒకటి వాటిలో మితిమీరిన మానవ కార్యకలాపాలు, వనరుల దోపిడీ కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దానివల్ల పలు రాష్ట్రాలతో పాటు రాజధాని దిల్లీ ప్రాంతం సైతం భవిష్యత్తులో తీవ్ర వాతావరణ దుష్పరిణామాలతో తల్లడిల్లే ప్రమాదం పొంచి ఉందని ఎప్పటినుంచో ఆందోళనలు వినిపిస్తున్నాయి.

# కొత్తగూడెం రైల్వేస్టేషన్ సమీపంలో నాటుబాంబుల కలకలం

ఉన్న బాంబును కుక్క కొరింది. దీంతో భారీ శబ్దంతో బాంబు పేలుడు సంభవించింది. కుక్క అక్కడికక్కడే మృతి చెందింది. ఈ బాంబు పేలుడుతో రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులు పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో.. కొత్తగూడెం 3వ పట్టణ పోలీసులు రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంకా ఏమైనా బాంబులు ఉన్నాయా అంటూ పోలీస్ జాగిలాలతో రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. రైల్వే స్టేషన్‌లో ఆగంతకుడు ఎటువైపు నుంచి వచ్చాడు. ఎటువెళ్లాడనే కోణంలో పోలీసులు పరిశీలిస్తున్నారు.

## క్షేత్రస్థాయి పరిశీలన లేకుండానే హిల్ట్ పాలసీ:కిషన్‌రెడ్డి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే తెలంగాణ ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని తీసుకొచ్చిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డివిమర్శించారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవాడలో పనిచేస్తున్న వారితో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు సహకారం అందించకుండా పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూరుస్తోందని విమర్శించారు. పారిశ్రామికవేత్తలకు ఒక విధానం.. రైతులకు ఒక విధానమా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూర్చేలా అవినీతి జీవోను తెచ్చారన్నారు.

# పెద్దధన్వాడకు ఇథనాల్ 'పీడ'పోయినట్టే..!?




## అస్సలు తగ్గని ప్రజలు

గతేడాది అక్టోబర్ నెల నుంచి మొదలైన ప్రజల ఉద్యమం ఈయేడు జూన్ వరకు వివిధ రూపాల్లో కొనసాగింది. జూన్ 4న ప్రజాగ్రహం పెల్లుబుకడం, ఫ్యాక్టరీ యాజ మాన్యం ప్రైవేటు సైన్యంతో గ్రామస్తులపై దాడికి దిగడం, ప్రతిగా రైతులు సామాగ్రిని ధ్వంసం చేసి తగలబెట్టడం, ఆపై కేసులెదుర్కొని జైలుకు వెళ్లడం వంటి పరిణామాలు రాష్ట్రవ్యా ప్తంగా సంచలనం సృష్టించిన విషయం విదితమే. అంత కుముందు వాల్ పోస్టర్లు, వినూత్నమైన పద్ధతుల్లో తమ నిరసనలు తెలిపారు. ఊరూరా ఇథనాల్ ఫ్యాక్టరీ ప్రభా వాలపై చదువుకున్న యు వకులు విస్తృత అవగా హనా కార్యక్రమాలు చేప ట్టారు. చుట్టుపక్కల పల్లె లను సైతం చైతన్యపరిచారు. ఒక్క గ్రామంలో మొదలైన ఉద్యమం క్రమం గా 14 పల్లెలను తాకడంతో నిత్యం వందలా ది మంది నిరసనలకు దిగారు. ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులను నిలదీశారు. పలు సంద ర్భాల్లో అధికారులనూ అడ్డుకున్నారు. ఈ మొత్తం ఉద్యమంలో ఎక్కడా చిన్న ఏమరపాటకు తావివ్వలేదు. చిన్న చప్పుడైనా ప్రజలు పెద్దగా స్పందించారు. పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు సైతం తమ గోడును వినిపించారు. ఈ నేపథ్యంలో పలువురు ప్రజలను, రైతులను మభ్యపెట్టినా కూడా పోరాటంలో మాత్రం వెనుకడుగు వేయలేదు. ఎప్పటికప్పుడు ప్రజలంద రితో కలిసికట్టుగా చర్చలు జరిపి నిర్ణయాలు తీసుకున్నారు. జైలు పాలైనవారికి మద్దతుగా ఊరిలో పండుగలు కూడా నిర్వహించ లేదంటే పెద్దధన్వాడ పట్టుదల ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.







### రాజకీయ కుట్రలను తిప్పికొట్టి..

పెద్ద ధన్వాడలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే ప్రాంతం తుంగభద్ర నదీ తీరంలో ఉంటుంది. మొత్తం 30 ఎకరాల విస్తీర్ణంలో రూ. 200 కోట్ల పెట్టుబడి ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మించాలనుకున్నారు. కానీ పరిశ్రమ గురిం చి పూర్తిగా వివరించకుండా, సూచనలు చేయకుండా గాయత్రి రెన్యూవబుల్ ఫ్యూయల్స్ అండ్ అలైడ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పలుమార్లు పనులకు పూనుకుంది. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా, నాయకులకు తెలియజేసినా తమ మొర పట్టించుకోవడం లేదని ప్రజాగ్రహం పెల్లు బికింది. జిల్లా అధికారులు సైతం వివిధ సందర్భాల్లో రైతులను సముదాయిం చినా.. ప్రజల పట్ల ఫ్యాక్టరీ యాజమాన్యం కవ్వింపు చర్యలను మాత్రం పట్టించుకోలేదు. అనుమ తులు, వాటి పత్రాలు చూపాలని ఆదేశించినా ఆ ప్రక్రియ జరగలేదు. ప్రజా భిప్రాయ సేకరణ జరగనే లేదు.

దీంతో పెద్దధన్వాడ లోని కొందరు ఐక్యమై ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఫ్యాక్టరీ వస్తే ఇక్కడ బతకడమే కష్టమైపోతుం దని, పంటలు సహా మూగజీవాలన్నీ నాశమవుతాయని ఆందోళనబాట పట్టారు. విద్యార్థి యువజన సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు సైతం వారికి మద్దతు తెలిపాయి. అయినప్పటికీ ఇథనాల్ వ్యతిరేక పోరాటానికి రాజకీయ రంగు పులుముకోకుండా పోరాట కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు పక్కా వ్యూహంతో ముందుకు కదిలారు. చివరిదాకా పోరాడి ఫ్యాక్టరీని తరిమికొట్టారు.

# పూర్తి స్థాయి డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాతే విచారణ

రిజర్వేషన్ కేటాయించారని న్యాయమూర్తి పేర్కొన్నారు. అయితే వాటిని సవరించి తాజా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వాదనలు వినిపిస్తూ 2011 జనాభా లెక్కల ప్రకారం మాత్రమే పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ ఎస్టీ, ఎస్సీలకు రిజర్వేషన్‌లు కల్పించిందన్నారు. పిటిషన్‌దార్లు కోరినట్లు పంచాయతీలను ఇతరులకు రిజర్వు చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేస్తే అవి రోస్టర్? ప్రకారం కేటాయించిన రిజర్వేషన్లపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో పాటు విస్తృత పరిణామాలకు దారి తీస్తుందని చెప్పారు. అందువల్ల పంచాయతీల ఎన్నికలపై డివిజన్? బెంచ్? తగిన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని న్యాయమూర్తి చెప్పారు. పిటిషన్లను డివిజన్ బెంచ్ ముందుంచాలంటూ రిజిస్ట్రీని ఆదేశించారు. ఈ నేపథ్యంలో పిటిషన్లను విచారించాల్సిందిగా రిజిస్ట్రి ఇవాళ హైకోర్టు ప్రారంభంలోనే కోరారు. పరిశీలించిన హైకోర్టు చీఫ్ జస్టిస్ పూర్తి స్థాయి డాక్యుమెంట్లు పరిశీలించిన తర్వాతే విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. ఈ మేరకు డాక్యుమెంట్లు అందించాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను సీజే ధర్మాసనం ఈనెల 29కి వాయిదా వేసింది.

# కోకాపేటలో కోట్ల వర్షం

ఇవాళ 8.04 ఎకరాలకు హెచ్‌ఎండీఏకు రూ. వెయ్యి కోట్ల మేర ఆదాయం సమకూరింది. మొత్తం 3 విడతల్లో ఆరు ప్లాట్లలోని 27 ఎకరాలకు రూ.3,708 కోట్ల ఆదాయం లభించింది. ఈసారి మొత్తం 44 ఎకరాల భూమిని నాలుగు విడతల్లో హెచ్‌ఎండీఏ వేలం వస్తోంది. కోకాపేట గోల్డెన్ మైల్‌లోని 2 ఎకరాలు, మూసాపేటలోని 15 ఎకరాలకు డిసెంబర్ 5న ఈ-వేలం వేయనుంది.

# బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలి

### అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే ప్రధాన ఉద్దేశం :మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పశ్చిమబెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. దాని నిర్వహణపై బెంగాల్‌కు చెందిన భాజపా ఎంపీలకు ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచనలు చేశారు. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రధాని సన్నిహితవర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అలాగే 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని ఎంపీలకు మోదీ సూచించారు.

### 'సర్' నిర్వహణకు ఈసీ కారణాలు సాకులే

ఇదిలాఉంటే.. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. ఈసీ 'భాజపా కమిషన్'గా మారిందని, దిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుంటోందని ఆరోపణలు చేస్తున్నారు. ఎన్ని కేంద్ర సంస్థలను రాష్ట్రంలోకి తీసుకువచ్చినా.. ఎంత ఖర్చుపెట్టినా తనను రాజకీయపరంగా ఓడించలేరని గతంలో విరుచుకుపడ్డారు. "మీరు నన్ను లక్ష్యంగా చేసుకుని బెంగాల్‌లో రాజకీయంగా దెబ్బకొట్టాలని చూస్తే... దేశవ్యాప్తంగా మీ పార్టీ పునాదులను కదిలిస్తా. గాయపడిన పులి మరింత ప్రమాదకరమైనది" అని భాజపాపై ధ్వజమెత్తారు.



# త్వరలో కొలువుల జాతర

సేవలు అందిస్తున్నాయి. రూ.2 లక్షల రుణామాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం మాదే. వ్యవసాయం దండగ కాదు..పండగ చేసి నిరూపించాం. లక్షా4 వేల కోట్లు రైతుల కోసం మా ప్రభుత్వం ఖర్చు చేసింది. మహిళలకు ఫ్రీ బస్సులే కాదు..బస్సు ఓనర్లను చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లను ఆడబిడ్డలకు అప్పగించాం. అడిగిన ప్రతీ పేద ఇంటికి రేషన్ కార్డు ఇచ్చాం. ఆనాడు దొడ్డు బియ్యం ఇస్తే పశువులకు దాణ పెట్టేవాళ్లు. మా ప్రభుత్వం వచ్చాక సన్నబియ్యం ఇస్తున్నాం. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లునిర్మిస్తున్నాం. హుస్నాబాద్ లో దేవుళ్లేమైనా పాలించారా?. హుస్నాబాద్లో గౌరెల్లి రిజర్వాయర్ ఎందుకు పూర్తి కాలేదు. పదేండ్లు హుస్నాబాద్ నిర్లక్ష్యానికి గురైంది. గౌరెల్లి రిజర్వాయర్లు పూర్తి చేసే భాధ్యత నాది. ఆనాడు సిద్దిపేట,సిరిసిల్ల ,గజ్వేల్ నియోజకవర్గాలే అభివృద్ధి అయ్యాయి. ఐటీఐ కాలేజీలన్నింటిని ఏటీసీలుగా మార్చాం. ఏటీసీలో చేరే ప్రతి విద్యార్థికి నెలనెలా రూ.2వేలు ఇస్తున్నాం. అని రేవంత్ అన్నారు.సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ హుస్నాబాద్ నుంచే.. బహుజనులు దండు కట్టి ఉద్యమించారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం ఇక్కడి నుంచే ఉవ్వెత్తున ఎగసిపడిందని గుర్తుచేశారు. 2004లో కరీంనగర్ గడ్డ నుంచే తెలంగాణ ఇస్తానని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. 2014లో స్వరాష్ట్ర ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని వ్యాఖ్యానించారు. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తున్నామని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో నిధులు ఎక్కువగా ఇచ్చారని.. మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. హుస్నాబాద్‌కు పదేళ్లు నిధులెందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు ఎన్ని నిధులైనా ఇచ్చి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో లాగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయబోనని చెప్పుకొచ్చారు. గత పదేళ్లలో ఎవ్వరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా అలసత్వం ప్రదర్శించారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్ఆర్ఎస్పీ ఎలా ఉందో?.. బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలి. దేశంలో అత్యధికంగా వరిని పండించేది మన రాష్ట్రంలోనే. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అని చేసి చూపించింది మన ప్రభుత్వమే. రాష్ట్రంలో రైతుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు పెట్టాం. రాష్ట్రంలో వందలాది బస్సులకు ఆడబిడ్డలు యజమానులు అయ్యారు. 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. రూ.22,500 కోట్లు పేదల ఇళ్ల కోసం ఖర్చు చేస్తున్నాం. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యాయి. కానీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరెల్లి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. గత పాలకుల మాదిరిగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చెయ్యం. త్వరలో గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం అని సీఎం ప్రకటించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో రూ. 262.78 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 44.12 కోట్లతో హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 45.15 కోట్లతో హుస్నాబాద్‌లో ౦ఃఱ ఏర్పాటుతో పాటు రూ. 20 కోట్లతో హుస్నాబాద్ మునిసిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే, రూ. 8.60 కోట్లతో ఖిం యూనిట్ ఆఫీస్ కు శంకుస్థాపన చేశారు. ఇక, రూ. 86 కోట్లతో హుస్నాబాద్ అర్బన్- కొత్తపల్లి ప్యాకేజీ-1లో భాగంగా 4 లైన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. రూ. 58.91 కోట్లతో హుస్నాబాద్- అక్కన్నపేట నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, శ్రీధర్‌బాబు తదితరులు సభలో పాల్గొన్నారు..

# తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు రండి







**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశ రాజధాని దిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలసి ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'కు ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రధాని మోదీకి సీఎం విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-బెంగళూరు-చెన్నై బుల్లెట్ రైలు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ విస్తరణకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని అభ్యర్థించారు. పలువురు కేంద్ర మంత్రులతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను కలిసిన సీఎం సమ్మిట్‌కు ఆహ్వానించారు. కాగా, మంగళవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను సీఎం రేవంత్‌రెడ్డి కలిసి గ్లోబల్ సమిట్‌కు రావాలని కోరారు. తరవాత సిఎం రేవంత్ మీడియాతో చిట్‌చాట్‌లో ..తెలంగాణలో పదేళ్లు తన నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హిందూ సమాజంలాంటిదే కాంగ్రెస్ అని డీసీసీ అధ్యక్షులకు చెప్పానని సిఎం వివరించారు. పార్టీ నేతగా ఎలా పనిచేయాలనేది వివరించే క్రమంలో చెప్పానన్నారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడంతో భాజపా దీన్ని వివాదం చేస్తోందని మండిపడ్డారు. పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన వ్యాఖ్యలను ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. ఉత్తర భారతంలోనూ తనను పాపులర్ చేస్తున్నందుకు సంతోషమని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన విషయాల్లో ముందు వెనక కట్ చేసి కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు తెలంగాణలో తన నేతృత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. హిందూ దేవుళ్లు, హిందూ సమాజం లాంటిదే కాంగ్రెస్ అని కొత్తగా ఎన్నికైన తమ పార్టీ జిల్లా అధ్యక్షులకు చెప్పినట్లు వివరించారు. సమావేశంలో పార్టీ నాయకుడిగా ఎలా పనిచేయాలో తాను చెప్పినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కోల్పోవడంతో ఈ విషయాన్ని పెద్దదిగా చేసి వివాదాస్పదం చేస్తోందని ధ్వజమెత్తారు. హిందూ దేవుళ్లు మూడు కోట్ల మంది ఉన్నారని? పలు సారూప్యతలు కలిగిన దేవుళ్లు ఉన్నారని తాను చెప్పానని అన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ కూడా హిందూ సమాజం లాంటిదేనని అని పోలుస్తూ తాను వ్యాఖ్యానించానని స్పష్టత ఇచ్చారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పలు కీలక అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారంపిసిసి సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో సీఎం మాట్లాడిన మాటలను కొంతమంది సోషల్ మీడియాలో వక్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని ప్రధాని మోదీని కోరాను.. మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్ రాష్ట్ర అభివృద్ధికి నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ సహకరించారని తెలిపాం.. అలాగే, రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ప్రధాని మోదీకి పలు వినతులు చేశాం.. ఆర్ఆర్ఆర్ సౌత్ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని ప్రధాన మంత్రిని కోరామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఇక, డిసెంబర్ 8, 9న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అశ్విని వైష్ణవ్, మనోహర్ లాల్ ఖట్టర్, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆహ్వానించారు. అలాగే, భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి, ఆదాయ వృద్ధి లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ గురించి వివరించిన ఆహ్వాన పత్రికను వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు.

### పార్టీలో అంతర్గతంగా మాట్లాడితే ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారు:సీఎం రేవంత్

:తెలంగాణలో పదేళ్లు తన నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. దిల్లీలో ప్రధానితోపాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసిన అనంతరం ఆయన మాట్లాడారు. హిందూ సమాజంలాంటిదే కాంగ్రెస్ అని డీసీసీ అధ్యక్షులకు చెప్పానని వివరించారు. పార్టీ నేతగా ఎలా పనిచేయాలనేది వివరించే క్రమంలో చెప్పానన్నారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడంతో భాజపా దీన్ని వివాదం చేస్తోందని మండిపడ్డారు.

# ఆదిలాబాద్‌ను ఆదుకోండి సీఎంగారు!

- పర్యావరణ పర్యాటకంగా అయ్యేదెప్పుడు?
- పులులకు పుట్టినిల్లు, టేకు వనాలకు నిలయం
- అటవీ వన్యప్రాణి సంపద పుష్కలం, అభివృద్ధి శూన్యం
- ఏకో టూరిజంగా మారిస్తే ప్రభుత్వానికి ఆదాయం




**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి)** : ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అంటేనే అడవులకు పెట్టింది పేరు. పులులకు పుట్టినిల్లు, టేకు వనాలకు నిలయం. అటవీ సంపదతో పాటు వన్యప్రాణుల సంపద పుష్కలంగా ఉండి ఎన్నో పక్షి జాతులకు ఆవాసంగా ఉన్న జిల్లా. ఇంతటి ప్రకృతి సంపద కలిగి ఉన్న జిల్లా అందాలు పర్యావరణ పర్యాటకం కు నోచుకోలేక పోవడం గమనార్హం, ఇప్పుడు జిల్లా అడవి చూస్తుంటే గుండె తరుక్క పోతుంది. కొంత మంది ప్రకృతి పేరు చెప్పి యదేచ్ఛగా జల్సాలకు, మందు విందులకు అదే విధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ అడవిని పిక్ నిక్ స్పాట్ గా వాడుకుంటున్నారు. నిత్యం ఏదో ఒక చోట తాగిన కల్లు సీసాలు చెత్తా చెదారాన్ని అక్కడే పడేసి పోతుండటంతో అడవిలో పచ్చని చెట్ల మధ్య ఎక్కడ చూసినా వ్యర్థ పదార్థాలతో నిండిపోయి అడవి తల్లి కలాహీనంగా మారుతుంది. వన్యప్రాణులు పులులు ఉండాల్సిన చోట జన సంచారం తిరుగుతోంది. జిల్లాలో ఇంతమంచి అటవీ సంపద పర్యావరణం ఉన్న ఎందుకు పనికి రాకుండా పోతోందని అదే అభివృద్ధి చేస్తే ఇంకా ఎంత బాగుంటోందోనని ప్రకృతి ప్రేమికులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పక్కనే ఉన్న మహారాష్ట్ర లోని తాడోబా, తిపేశ్వర్ అడవులు మన జిల్లాకంటే పెద్దవేమీ కావు. కానీ అక్కడి అటవీ వన్యప్రాణి సంపదను అక్కడి ప్రభుత్వాలు అటవీ శాఖ అధికారులతో కలిసి వాటిని సంరక్షిస్తూ రావడం వల్ల ఆ అడవుల్లో పులులు, వన్య ప్రాణులకు ఆవాస ప్రాంతంగా మారి పోయాయి. క్రమంగా టైగర్ రిజర్వ్ ప్రాంతంగా అభివృద్ధి చెంది ఇప్పుడు కేవలం పులులతోనే ఆ ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల ఆదాయం తెచ్చి పెడుతున్నాయి. అంతే కాదు అక్కడున్న వారికి ఉపాదితో పాటు ఆ ప్రాంతంలో వ్యాపారం పుంజుకుంటూ వస్తుంది. ఇదంతా అటవీ సంపదను కాపాడడంతోనే సాధ్యం అయ్యింది. తడోబా, తిప్పేశ్వర్ అడవులకంటే మన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవులు చాలా విస్తరించి ఉన్నాయి. పెద్ద మొత్తంలో టేకు చెట్లు దెబ్బ తినడం కారణంగా పులులు అదృశ్యం ఐపోవడం జరిగింది. కానీ మళ్ళీ ఇప్పుడు పులులు తిరిగి మళ్ళీ జిల్లా వస్తున్నాయి. కానీ వస్తున్న పులులకు ఇక్కడి ప్రభుత్వం ఎటువంటి సంరక్షణ చర్యలు తీసుకోక పోవడంతో వస్తున్న పులులు తిరిగి వెళ్ళి పోతున్నాయి. అదే ప్రభుత్వం, అటవీ శాఖ రెండు కలిసి పులి ఇక్కడే నివాసం ఉండేట్టు రక్షణ చర్యలు చేపడితే జిల్లాకు తిరిగి పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉంది. మనకంటే విస్తీర్ణంలో చిన్నగా ఉన్న తాడోబా, తిప్పేష్వర్ అడవులతో అక్కడి ప్రభుత్వానికి వందల కోట్ల ఆదాయం ఆ ప్రభుత్వానికి వస్తుంటే ఇంత గొప్పగా పర్యావరణ పర్యాటకం ఉన్న మన జిల్లాకు ఎందుకు ఆ ఆదాయం రాకూడదు. ఈ పర్యావరణాన్ని ఏకో టూరిజంగా ఉపయోగించుకుని అభివృద్ధి చెయ్యొచ్చు. కానీ ఆది నుంచి గత ప్రభుత్వాలు జిల్లాపై శీత కన్ను వేస్తూ వస్తున్నాయి. పర్యావరణ పర్యాటకంకు సంబంధించి అన్ని వనరులు ఉన్నా కూడ మన ప్రభుత్వాలు అభివృద్ధి చేయలేక పోతున్నాయి. ఫలితంగా అటవీ అందాలు జల్సాలకు, విందూ వినోదాలకు నిలయంగా మారిపోతున్నాయి. మహారాష్ట్ర అడవుల మాదిరిగానే మనకు అటవీ సంపద ఉంది కాబట్టి తగిన చర్యలు చేపడితె పర్యాటకంగా అభివృద్ధి చెయ్యొచ్చు .కానీ వచ్చిన పులులను ఇతర వన్య ప్రాణులకు తగిన రక్షణ కల్పిస్తూ అటవీ సంపదను సంరక్షించే విదంగా చర్యలు చేపడితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యావరణ పర్యాటకంగా మారి ప్రభుత్వానికి మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మధ్య కాలంలో నల్లమల అటవీ ప్రాంతాన్ని పర్యావరణ పర్యాటకంగా మార్చి అక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాను కూడ ఆ తరహాలో అభివృద్ధి చేయాలని ప్రకృతి ప్రేమికులు, జిల్లా ప్రజలు ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

# ఢిల్లీ మున్సిపల్ ఉప ఎన్నికల్లో బిజెపి సత్తా

- 12 స్థానాల్లో 7 గెలుపు..ఆప్‌కు 3 సీట్లు
- కాంగ్రెస్, ఫార్వర్డ్ బ్లాక్‌కు చెరో సీటు



**న్యూఢిల్లీ, డిసెంబరు3 (జనంసాక్షి)** : ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ పైచేయి సాధించింది. 12 స్థానాల్లో 7 స్థానాలు గెలుచుకుంది. ఫిబ్రవరి అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన గెలుపును పదిలం చేసుకుంది. దశాబ్దానికి పైగా అధికారంలో కొనసాగి పది నెలల క్రితం అధికారాన్ని కోల్పోయిన ఆమ్ ఆద్మీ పార్టీ 3 సీట్లు గెలుచుకుని రెండో స్థానానికి పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ ఒక సీటును దక్కించుకోగా, మరో సీటును ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ గెలుచుకుంది. ఎంసీడీ ఉప ఎన్నికల్లో బీజేపీ ఏడు సీట్లు దక్కించుకున్నప్పటికీ మొత్తం 12 సీట్లలో ఇంతకుముందు 9 సీట్లు బీజేపీవే. ఇప్పుడు కోల్పోయిన రెండు సీట్లలో ఒక సీటు కాంగ్రెస్, మరొకటి ఏఐఎఫ్‌బీ చేజిక్కించుకున్నాయి. 2022లో జరిగిన పూర్తిస్థాయి ఎన్నికల్లో ఆప్ గెలుచుకున్న చాందినీచౌక్‌ను ఇప్పుడు బీజేపీకి చెందిన సుమన్ గుప్తా గెలుచుకోవడం ఆ పార్టీకి సానుకూల పరిణామం. 2022లో గెలుచుకున్న నరైన వార్డును తిరిగి ఆప్ నిలబెట్టుకుంది. బీజేపీ రెండు సీట్లు కోల్పోయినప్పటికీ ఎంసీడీలో ఆ పార్టీ ఆధిపత్యానికి ఢోకా లేదనే చెప్పాలి. మొత్తం 250 సీట్లలో బీజేపీకి ప్రస్తుతం 122 సీట్లు ఉండగా, ఆప్ 102 స్థానాలు కలిగి ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం తర్వాత ఎంసీడీ ఉప ఎన్నికలు రావడంతో ముఖ్యమంత్రి రేఖాగుప్తాకు ఇది పరీక్షగా అందరూ భావించారు. అయితే ఆమె సునాయాసంగా పరీక్షలో నెగ్గారు. ఆప్ ఢిల్లీ యూనిట్ బాధ్యతలు తీసుకున్న సౌరభ్ భరద్వాజ్‌కు కూడా ఇది తొలి ఎన్నికలే అయినప్పటికీ ఆయన కూడా ఎలాంటి సీటు కోల్పోకుండా ఎన్నికలను గ్టటెక్కించారని చెప్పవచ్చు. గ్రేటర్ కైలాశ్, షాలిమార్ బాగ్ బి, అశోక్ విహార్, చాందినీ చౌక్, చాందినీ మహల్, డిచావున్ కలాన్, నరైన, సంగమ్ విహార్ ఏ, దక్షిణ్ పురి, ముండ్కా, వినోద్ నగర్, ద్వారకా బి వార్డుల్లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. వార్డు కౌన్సిలర్లు అసెంబ్లీకి ఎన్నిక కావడంతో 11 వార్డులకు ఖాళీలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్ పార్టీ సంగమ్ విహార్-ఏలో మాత్రమే గెలిచింది. ఆ పార్టీ అభ్యర్థి సురేష్ చౌదరికి 12,766 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థికి 3,628 ఓట్లు వచ్చాయి. చాందినీ మహల్ వార్డును ఏఐఎఫ్‌బీ అభ్యర్థి మహమ్మద్ ఇమ్రాన్ గెలుచుకున్నారు. దక్షిణపురి,ముండ్కా, నరైనా వార్డులను ఆప్ గెలుచుకుంది. తక్కిన ఏడు వార్డుల్లోనే బీజేపీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు.

# మత సామరస్యంతోనే దేశ భవిష్యత్తు సాధ్యం



**పెనుగొండ (జనంసాక్షి)** : పెనుగొండ దర్గాలోని హజ్రత్ బాబా ఫక్రుద్దీన్ రహమతుల్లా అలైహి వారి ఉరుసు కార్యక్రమంలో నేషనల్ ఇంటిగ్రేషన్ కార్యక్రమం తాజ్ బాబా సాహెబ్ వారి ఆధ్వర్యంలో జాబిలి చాంద్ బాషా అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని రాష్ట్రాల నుండి తెలుగు, ఉర్దూ, తమిళ కవులు రచయితలు ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మత సామరస్యం పరమత సహనం సోదర భావం వసుధైక కుటుంబ నిర్మాణం జాతీయ సమైక్యత దేశ సుస్థిరత దేశ అభివృద్ధి దేశభక్తి అంశాలపై ప్రసంగాలు కవితలు వినిపించారు. అనంతరం తాజ్ బాబా సాహెబ్ భవిష్యత్తు లో జరిగే మత సామరస్యం కార్యక్రమాలపై మరియు సూఫీ సత్పురుషుల జాతీయ వేదిక పై కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సామాజిక సేవకుడుఅఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ జాతీయ అధ్యక్షుడు కల్లూరు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ను తాజ్ బాబా ప్రముఖులు మత సామరస్య పురస్కారం తో సన్మానించారు. కార్యక్రమం చివరలో ఐకమత్యానికి నిదర్శనంగా అన్నిమతాల పెద్దలు సామాజిక సేవకులు కవులు రచయితలు సామాజిక సేవకులు చేతులెత్తి హిందూ ముస్లిం ల ఐక్యత వర్ధిల్లాలి మత సామరస్యం వర్ధిల్లాలి అని సంఘీభావం తెలిపారు. తాజ్ బాబా సాహెబ్ వారి ఆధ్వర్యంలో ప్రముఖులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలోతెనాలి పీఠాధిపతి నిజామ్ సాహెబ్, ఉల్లాల్ దర్గా పీఠాదిపతి, సిక్కు గురువు జస్ జోత్ సింగ్, క్రైస్తవ సేవకులు జాన్ ప్రియ నాథ్, కవిముద్ద రంగప్ప, కవి జూటూరి తులసీ దాస్, మహమూడ్ షాహీద్, మహబూబ్ ఖాన్, అతావుల్లా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# పెరిక కుల సంక్షమానికి కృషి

- జిల్లాకు ఒక ఆత్మగౌరవ భవనం కట్టిస్తాం
- పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి ముత్తయ్య
- ములుగు జిల్లా పెరిక కుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా పల్నాటి నాగేశ్వరరావు, సాయిని శ్రీనివాస్



**ములుగు (జనంసాక్షి)** : సకల సామాజిక రంగాల్లో పెరిక కుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలని తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి ముత్తయ్య విజ్ఞప్తి చేశారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో బుధవారం జరిగిన పెరిక కుల ములుగు జిల్లా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెరిక కుల ఐక్యతతోనే హక్కులు సాధించవచ్చని, ప్రభుత్వ సహకారంతో తెలంగాణలో ప్రతి జిల్లా కేంద్రంలో పెరిక కుల ఆత్మగౌరవ భవనాలను నిర్మించడమే లక్ష్యంగా రాష్ట్ర సంఘం పనిచేస్తుందని అన్నారు. వ్యవసాయ రంగం పునాదిగా జీవనం కొనసాగిస్తున్న పెరిక కులస్తులు ఇటీవలి కాలంలో రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో రాణిస్తున్నారని, పెరిక కులస్తులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం కోసం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతామని అన్నారు. ఈ సదస్సులో పాల్గొన రాష్ట్ర అధికార ప్రతినిధి సాయిని నరేందర్ మాట్లాడుతూ రానున్న కాలమంతా బి.సి శఖమని, పెరిక కులస్తులు సామాజిక చైతన్యంతో రాజకీయ వాటా సాధించాలని, సకల అభివృద్ధికి రాజకీయాలు పునాదని అలాంటి రాజకీయాల్లో, సామాజిక ఉద్యమాల్లో పెరిక కులస్థుల అభివృద్ధికి పాటుపడుతామని అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 80 ఏండ్లు కావస్తున్నప్పటికీ బి.సి లు మౌళిక రంగాల్లో వెనకబడ్డారని, రాజకీయాల్లో వాటా దక్కడం లేదని, చట్ట సభల్లో సమాన వాటా లేదని అన్నారు. జనాభా దామాషా ప్రకారం బి.సి రిజర్వేషన్ల కోసం జరిగే పోరులో పెరిక కులస్తులు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పెరిక కుల అసోసియేట్ అధ్యక్షులు ఆక రాధాకృష్ణ, రాష్ట్ర ముఖ్య సలహాదారు చింతం లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి రంగారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అప్పని సతీష్, నాయకులు పూజారి సమ్మయ్య, చిలకమారి పుల్లయ్య, దంతెనపల్లి నరేందర్, చిలకమారి రాజయ్య, సాయిని మహేశ్వర్, చిలకమారి సతీష్, దంతెనపల్లి భద్రయ్య, ఎర్రంగారి సురేశ్, ముత్తినేని ఆదినారాయణ, ఆకుల శ్రీనివాస్, ఆకిరెడ్డి లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### పెరిక కుల ములుగు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పల్నాటి నాగేశ్వరరావు, సాయిని శ్రీనివాస్ లు ఎన్నిక

ములుగు జిల్లా పెరిక కుల సంఘం అధ్యక్షులుగా వెంకటాపురం మండల కేంద్రానికి చెందిన పల్నాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సాయిని శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా ధర్మపురి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా పూజారి సురేందర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన జిల్లా నాయకులకు రాష్ట్ర నాయకులు సంగని మల్లేశ్వర్, లక్కర్సు ప్రభాకర్ వర్మ, ధనేకుల కృష్ణ, కోట మల్లికార్జున్, కర్రే సురేందర్, చిదెం మోహన్ రావు, దిడ్డి మోహన్ రావు, సంగని హరికిషన్, గంప నాగరాజు, శ్రీధర్ల జగదీశ్వర్, నట్టే మోహన్ రావు, కానుగంటి శ్రీనివాస్, అంకత మల్లికార్జున్ రావు, బియ్యాని శివకుమార్ బోడకుంటి సుధాకర్ లు అభినందనలు తెలిపారు.

# సభా హక్కుల ఉల్లంఘన ఇస్తే గట్టిగా జవాబిస్తా

- కుక్క వ్యవహారంపై రేణుకా చౌదరి ఘాటు స్పందన



**న్యూఢిల్లీ, డిసెంబరు3 (జనంసాక్షి)** : కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ ఎంపీ రేణుకా చౌదరి తన కారులో ఒక కుక్కను తీసుకుని పార్లమెంటు ఆవరణలోకి రావడం ఇటీవల సంచలనమైంది. ఎంపీలకు కల్పించిన హక్కులకు ఇది విరుద్ధమని బీజేపీ దీనిపై మండిపడగా, ఆమెపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టనున్నారనే ప్రచారం జరిగింది. దీనిపై పార్లమెంటు వెలుపల ఆమెను మీడియా బుధవారంనాడు ప్రశ్నించినప్పుడు ఆమె 'బౌ బౌ' అంటూ రియాక్షన్ ఇచ్చారు. 'ఇంతకంటే ఏమి చెప్పాలి? తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు చూద్దాం. సమస్య ఏముంది? అది వచ్చినప్పుడు గట్టి సమాధానమిస్తాను' అని చెప్పారు. పార్లమెంటు సమావేశాల రేణుకా చౌదరి కారులో ఒక శునకాన్ని తీసుకుని పార్లమెంటు ఆవరణలోకి వచ్చారు. వెంటనే భద్రతా సిబ్బంది ఆ కుక్కను వెనక్కి పంపేశారు. తాను రోడ్డుపై వస్తున్నప్పుడు రెండు వాహనాలు ఢీకొని మధ్యలో కుక్కపిల్ల కనిపించిందని, అది గాయపడి ఉంటుందని భావించి కారులో తీసుకువచ్చానని, ఇక్కడకు వచ్చిన వెంటనే ఆ కుక్కను తన ఇంటికి పంపించేశానని చెప్పారు. ఇందులో సమస్య ఏముందని ప్రశ్నించారు. రేణుకా చౌదరి చర్యను బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ తప్పుపట్టడంతో ఆమె తిరిగి స్పందించారు. కాలుష్యంతో జనం చనిపోతున్నారు. దానిపై ఎవరికీ ఎలాంటి బాధ లేదు. బీఎల్‌ఓలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వాళ్ల కుటుంబాలు అతలాకుతల మవుతున్నాయి. అయినా వాళ్లకు ఎలాంటి పట్టింపూ లేదు. కార్మిక చట్టాలు రుద్దుతున్నారు. సంచార్ సాథీ యాప్ బలవంతంగా మనపై రుద్దుతున్నారు. కానీ రేణుకా చౌదరి కుక్క అందరికీ ఆందోళనకరమైన విషయంగా కనిపిస్తోంది. ఇంతకంటే ఏమి చెప్పాలి? మూగజీవాలను నేను ప్రేమిస్తూనే ఉంటాను' అని అన్నారు. పార్లమెంటు ఆవరణలోకి కుక్కలు రాకూడదనే నిషేధం ఏదీ లేదని, అటల్ బిహారీ వాజ్‌పేయి కూడా ఒకసారి ఎద్దులబండిపై వచ్చారని గుర్తుచేశారు.

# రబీ యూరియా కోసం రైతుల క్యూ

**వరంగల్, డిసెంబర్3 (జనంసాక్షి)** : మళ్లీ చూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. రబీకి ఎక్కడ దక్కదో అన్న ఆందోళనతో క్యూ కట్టారు. రబీ సీజన్లోనూ యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. నల్లబెల్లిలోని పీఏసీ సొసైటీ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో బుధవారం వేకువజామునే రైతులు బారులు తీరారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రైవేట్ ఎరువుల దుకాణాలతో కుమ్మక్కై ఎరువులు అమ్ముతున్నారని రైతులు ఆరోపించారు. కృత్రిమ ఎరువు కొరత సృష్టిస్తున్నారని వారు ఆక్షేపించారు. ఇలా అమ్ముతుండటంతో ప్రైవేట్ దుకాణాలలో కొనుగోలు చేయలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# పోలీసు వలయంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రం

- సీఎం పర్యటనకు మూడంచెల భద్రత
- 700 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు
- ఎస్పీ అఖిల్ మహజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి)** : సిఎం జిల్లా పర్యటన సందర్భంగా గురువారం పట్టణం పోలీసు వలయంలో ఉండనుంది. ఇందుకు సంబంధించి ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసులకు పలు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా పోలీస్ సిబ్బందితో పోలీసు సిబ్బందితో కలిసి బుదవారం జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సమావేశం నిర్వహించారు. స్థానిక ఎస్టియు భవన్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లా కేంద్రంలో మూడంచల భద్రతను ఏర్పాటు చేయడం జరిగిందని. 700 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతమైన వాతావరణంలో సమావేశాన్ని పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది ప్రతి ఒక్కరు ఎవరికి కేటాయించిన విధులలో వారు సక్రమంగా నిర్వహిస్తూ, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బందోబస్తు మొత్తాన్ని 9 సెక్టార్లుగా విభజించి బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హెలి ప్యాడ్, కాన్వాయ్ లో బందోబస్తు, రూట్ బందోబస్తు, మీటింగ్ ప్లేస్, ఎంట్రీ పాయింట్స్, ఎగ్జిట్ పాయింట్స్, పార్కింగ్, ట్రాఫిక్, బాంబు స్క్వాడ్ బృందాలు అన్నింటితో 700 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా పార్కింగ్ విషయంలో టూవీలర్ పార్కింగ్ రామ్ లీలా మైదానం, స్థానిక సైన్స్ డిగ్రీ కళాశాల, ఆటోలు కార్ల పార్కింగ్ ప్రదేశం డైట్ కళాశాల మైదానం. భారీ వాహనాలకు బస్సులకు తిరుమల పెట్రోల్ బంక్ ఎదురు నుండి మావల పోలీస్ స్టేషన్ మీదుగా స్థానిక తెలంగాణ ట్రైబల్ రెసిడెన్షియల్ బాయ్స్ కళాశాల వద్ద పార్కింగ్ చేయాలని తెలిపారు. గురువారం పట్టణంలో ట్రాఫిక్ డైవర్షన్స్ ఉండనున్నట్లు అంకోలి, తంతోలి గ్రామ ప్రజలు కె ఆర్ కె కాలనీ మావల పోలీస్ స్టేషన్ మీదుగా పట్టణంలోనికి చేరుకోవాలని సూచించారు.

# రైస్ మిల్లర్లు ధాన్యంలో తరుగు తీయొద్దు

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



హనుమకొండ ప్రతినిధి డిసెంబర్ 3 (జనం సాక్షి) :రైతులు విక్రయించిన ధాన్యంలో తరుగు తీయకుండా రైస్ మిల్లర్లు ధాన్యాన్ని దింపుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో కస్టమ్ మిల్లింగ్ రైస్, ధాన్యం కొనుగోలు అంశాలు, జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించినప్పుడు రైస్ మిల్లర్లు ధాన్యపు బస్తాలలో ఎక్కువగా తరుగు తీస్తున్నారని, తరుగు తీస్తుండడంతో నష్టపోతున్నామని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన అంశంపై పౌరసరఫరాలు శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ధాన్యం కేటాయించిన ప్రకారం మిల్లర్లు నిర్దేశిత సీఎంఆర్ లక్ష్యం చేరుకున్నారా అని, ఏ మిల్లుకు ఎంత ధాన్యం కేటాయించారు అనే వివరాలు తెలుసా అని మిల్లర్లను కలెక్టర్ అడిగారు. మిల్లులకు కేటాయింపు ప్రక్రియ ఎలా చేస్తున్నారు అని అధికారులను అడిగి తెలుసుకున్నాను. రైతులు విక్రయించిన ధాన్యంలో ఎందుకు తరుగు తీస్తున్నారని మిల్లర్లను అడిగారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రైతులు విక్రయించిన ధాన్యంలో ఎక్కువ తరుగును తీస్తున్నారనే విషయాన్ని తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. తరుగు లేకుండా ధాన్యపు బస్తాలను రైస్ మిల్లర్లు తమ మిల్లుల వద్ద దింపుకోవాలన్నారు. తరుగుతో రైతులను మిల్లర్లు ఇబ్బంది పెట్టొద్దన్నారు. సన్న, దొడ్డు రకాలు అనే వ్యత్యాసం లేకుండా ధాన్యాన్ని మిల్లర్లు దింపుకోవాలన్నారు. 2024- 25 నిర్దేశిత సీఎంఆర్ లక్ష్యాన్ని మిల్లర్లు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎండి. వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కాదు.. డ్రీమ్స్ సాధించు



ఈ రోజుల్లో విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వాడకం పెరుగుతున్నది, ఇది ఒక ఆందోళనకరమైన విషయం. శారీరక-మానసిక ఆరోగ్యాన్ని, విద్యా ప్రగతిని, భవిష్యత్తును ప్రమాదంలో పెట్టే ఈ అలవాటు ఎందుకు కలుగుతుంది? దానికి సమాజం ఎలా స్పందించాలి? అన్న వాటికి సమగ్రంగా చూస్తే ఇటీవలి కాలంలో విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతున్నది. చదువులో ఒత్తిడి, స్నేహితుల ప్రభావం, కొత్త అనుభవాలపై ఆసక్తి వంటి కారణాలు వారిని ఈ దారిలోకి నెడుతున్నాయి. ఈ పరిస్థితి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. శారీరక-మానసిక ఆరోగ్యాన్ని, విద్యా ప్రగతిని, భవిష్యత్తును ప్రమాదంలో పెట్టే ఈ అలవాటు ఎందుకు కలుగుతుంది? దానికి సమాజం ఎలా స్పందించాలి?

అన్న వాటికి సమగ్రంగా చూస్తే విద్యార్థుల్లో మాదకద్రవ్యాల ఆకర్షణ పెరుగుతున్నది ఈ కాలంలో ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారింది. కౌమారదశలో కొత్త అనుభవాలు ప్రయత్నించాలని ఉండే జిజ్ఞాస, స్నేహితుల ఒత్తిడి, కుటుంబంలో అనుకూల వాతావరణం లోపించడం, చదువుతో వచ్చే ఒత్తిడులు, అలాగే సినిమాలు-సోషల్ మీడియాలో మాదకద్రవ్యాలను ఆకర్షణీయంగా చూపించడం వంటి కారణాలు విద్యార్థులను ఈ ప్రమాదకర అలవాట్ల వైపు మళ్లిస్తాయి. చిన్న తప్పు నిర్ణయం వారి ఆరోగ్యం, స్వభావం, చదువు, భవిష్యత్తు అన్నింటినీ ప్రభావితం చేసే స్థితికి చేరవేయగలదు.

మాదకద్రవ్యాల వాడకం వల్ల శారీరకంగా గుండె, ఊపిరితిత్తులు, కాలేయం వంటి అవయవాలు దెబ్బతినడమే కాకుండా, మానసికంగా డిప్రెషన్, ఆందోళన, ఆత్మవిశ్వాస లోపం వంటి సమస్యలు వచ్చేస్తాయి. చదువులో వెనుకబాటు, క్రమశిక్షణ లోపం, కుటుంబంతో గొడవ వంటి ప్రతికూల పరిణామాలు వారి జీవన ప్రమాణాన్ని దెబ్బతీస్తాయి. ఒకసారి అలవాటు పడితే దాని నుండి బయటపడటం కష్టతరమై, దీర్ఘకాలిక వ్యసనం, తీవ్ర ఆరోగ్య సమస్యలు, కొన్ని సందర్భాలలో మరణ ప్రమాదం కూడా ఎదురయ్యే అవకాశం ఉంది.

మాదకద్రవ్యాల ఆకర్షణకు ప్రధాన కారణాలు:

1. **సినిమాలు, సోషల్ మీడియా ప్రభావం** మాదకద్రవ్యాలను ఆకర్షణీయంగా చూపించడం వల్ల విద్యార్థుల్లో తప్పు సందేశం చేరుతుంది.
2. **స్నేహితుల ఒత్తిడి :** మాదకద్రవ్యాలు వాడే స్నేహితుల ప్రోత్సాహం లేదా ఒత్తిడి వల్ల చాలామంది విద్యార్థులు మొదటిసారి వాటిని ఉపయోగిస్తారు.
3. **పాఠశాల/కళాశాల ఒత్తిడులు** విద్యలో పోటీ, మార్కుల ఆందోళన, భవిష్యత్తుపై భయంఇవి ఆందోళనను తగ్గించుకోవడానికి విద్యార్థులను తప్పు మార్గాల వైపు నెడుతాయి.
4. **సులభంగా అందుబాటులో ఉండటం** నిషేధిత పదార్థాలు కొన్ని ప్రాంతాల్లో సులభంగా లభించగలగడం కూడా ఒక కారణం.
5. **జిజ్ఞాస లేదా కొత్త అనుభవాల పట్ల ఆసక్తి** కౌమారదశలో కొత్తవి ప్రయత్నించే ఉత్సుకత ఎక్కువ. ఒకసారి ప్రయత్నిస్తే అలవాటుగా మారే ప్రమాదం ఉంది.
6. **కుటుంబంలో సమస్యలు** కుటుంబ కలహాలు, ప్రేమాభావం, దృష్టిపెడని తల్లిదండ్రులు, లేదా మద్యం/మాదకద్రవ్యాలు వాడే పెద్దలను చూడటం కూడా ప్రభావితం చేస్తుంది.

ఇప్పటి తరానికి అవకాశాలు అమితంగా పెరిగాయి. టెక్నాలజీ, విజ్ఞానం, విద్యప్రతి దారినీ ప్రపంచం యువతకు తెరవుతోంది. అయితే ఇదే సమయంలో వారిని తప్పు దారిలోకి నడిపించే ప్రమాదకర శక్తి కూడా పెరుగుతోందిఅదే మాదకద్రవ్యాల ఆకర్షణ. విద్యార్థుల జీవితంలో అత్యంత విలువైన సమయం చదువుకునే ఏళ్లు. ఈ సమయంలో డ్రగ్స్ వైపు చిన్న అడుగు కూడా వారి భవిష్యత్తుకు పెద్ద నష్టం. అందుకే ప్రతి యువకుడు, ప్రతి విద్యార్థి, ప్రతి తల్లిదండ్రి గుర్తుంచుకోవాల్సిన గొప్ప సందేశం"డ్రగ్స్ కాదు - డ్రీమ్స్ సాధించు!"



### డ్రగ్స్ ఎందుకు ప్రమాదకరం?

మాదకద్రవ్యాలు మొదట్లో "తాత్కాలిక ఆనందం" ఇస్తాయనే భ్రమను కలిగిస్తాయి. కాని ఆ ఆనందం కేవలం కొన్ని నిమిషాల వ్యవధి కలిగిన మాయ. ఆ మాయలో మనసు చిక్కుకుంటే ఆపడం చాలా కష్టం. శరీరంలోని ప్రధాన అవయవాలుగుండె, కాలేయం, ఊపిరితిత్తులుదెబ్బతింటాయి. మానసికంగా ఆందోళన, డిప్రెషన్, కోపం, స్థిమితం కోల్పోవడం మొదలవుతాయి.

కొన్నిసార్లు చదవడం మీద ఆసక్తి లేకపోవడం, ఒత్తిడిని తట్టుకోలేకపోవడం, కొన్ని సందర్భాల్లో సరదాగా ప్రయత్నించడంఇలాంటివి డ్రగ్స్ వైపు దారి తీస్తాయి. కానీ అవి అందించే ఆనందం కేవలం క్షణికం మాత్రమేబీ నష్టం మాత్రం జీవితాంతం ఉండేలా చేస్తాయి.

ఎందుకు "డ్రీమ్స్ సాధించు"?

కలలు మనిషిని ముందుకు నడిపించే ముఖ్యమైన శక్తి. కలలు జీవితం పట్ల దిశానిర్దేశం చేస్తాయి. ఒక విద్యార్థి కలలతో ముందుకు సాగితే: అతను కష్టపడతాడు, లక్ష్యాలపై దృష్టి పెడతాడు, తన ప్రతిభను అభివృద్ధి చేసుకుంటాడు, జీవితం పట్ల సానుకూల దృక్పథం పెంపొందించుకుంటాడు.

డ్రగ్స్ మనల్ని చీకటిలోకి నెడతాయిబీ కలలు మాత్రం వెలుగువైపు నడిపిస్తాయి.

డ్రగ్స్ మన విశ్వాసాన్ని పీల్చేస్తాయిబీ కలలు మాత్రం మనకు బలం ఇస్తాయి.

డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేస్తాయిబీ కలలు జీవితాన్ని నిర్మిస్తాయి. అందుకే డ్రగ్స్ కాదు - డ్రీమ్స్ సాధించు!

### పరిష్కార మార్గాలు

1. యువత ఏం చేయాలి? తమపై నమ్మకం పెంపొందించుకోవాలి - కష్టం వచ్చినప్పుడు అది శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలి. సానుకూల స్నేహితులను ఎంచుకోవాలి - చెడు అలవాట్లను ప్రోత్సహించే వారిని దూరం పెట్టాలి. అభిరుచులు పెంపొందించుకోవాలి - క్రీడలు, సంగీతం, చిత్రలేఖనం, నృత్యం, పుస్తకాలుఇవి మనసును శుభ్రంగా ఉంచుతాయి. సహాయం కోరడంలో వెనకడుగు వేయకూడదు - తల్లిదండ్రులు, గురువులు, కౌన్సెలర్లు, all are ready to help. ఒత్తిడిని తగ్గించే ఆరోగ్యకరమైన మార్గాలు నేర్చుకోవాలి - ధ్యానం, యోగా, వ్యాయామం వంటి అలవాట్లు మానసిక బలం ఇస్తాయి.
2. తల్లిదండ్రుల స్థాయిలో పిల్లలతో ప్రతిరోజూ మాట్లాడటం, వారి సమస్యలు వినడం, ప్రేమ, సహనం, మార్గదర్శనం ఇవ్వడం, పిల్లల స్నేహితులు, కార్యకలాపాలు గురించి అవగాహన కలిగి ఉండటం, ఆరోగ్యకరమైన కుటుంబ వాతావరణాన్ని నిర్మించడం
3. పాఠశాల/కళాశాల స్థాయిలో, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు,వ్యక్తిగత, విద్యాసంబంధిత కౌన్సెలింగ్, విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గమనించి తక్షణ చర్యలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సానుకూల మార్గదర్శనం
4. విద్యార్థుల స్థాయిలో స్వీయ అవగాహన: మాదకద్రవ్యాలు శాశ్వత సమస్యలకు తాత్కాలిక తప్పుదారి మాత్రమే అని గ్రహించడం,్సానుకూల స్నేహిత వాతావరణం: చెడు అలవాట్లకు ప్రోత్సాహం ఇచ్చే స్నేహితులను దూరం పెట్టడం, వ్యక్తిగత లక్ష్యాలు: చదువు, క్రీడలు, కళలు వంటి శ్రద్ధ పెంచే పనుల్లో పాల్గొనడం.
5. సమాజం/ప్రభుత్వం స్థాయిలో నిషేధిత పదార్థాల విక్రయంపై కఠిన చర్యలు, రిహాబిలిటేషన్ కేంద్రాలు, హెల్ప్లైన్లు, మీడియా ద్వారా అవగాహన, స్థానిక సంఘాల సహకారంతో పర్యవేక్షణ
6. కఠిన చట్టాలు: డ్రగ్స్ సరఫరా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ సమస్యను ఒక వ్యక్తి సమస్యగా కాకుండా, కుటుంబం-విద్యాసంస్థ-సమాజం అందరూ కలిసి ఎదుర్కొనాల్సిన సామూహిక బాధ్యతగా చూడాలి. సమష్టిగా చైతన్యం పెంచినప్పుడే విద్యార్థులను మాదకద్రవ్యాల ప్రమాదం నుండి దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించగలుగుతాం.

కాబట్టి పుస్తకాలు పట్టుకో.. డ్రగ్స్ పడేయ్! మనసు బలంగా ఉంచుడ్రగ్స్ను దూరంగా నెట్టు. మాదకద్రవ్యాలరహిత సమాజమే నిజమైన అభివృద్ధి. డ్రగ్స్ వదు.. నీ కలలను నమ్ము.. కష్టపడు.. డ్రీమ్స్ సాధించు!సమాజం మరియు ప్రభుత్వం కూడా ఇలాంటి ప్రమాదకర పదార్థాల విక్రయాన్ని అరికట్టడంలో, రిహాబిలిటేషన్ కేంద్రాల ఏర్పాటులో, హెల్ప్లైన్ సేవలు అందించడంలో కీలక పాత్ర పోషించాలి. మీడియా ద్వారా దుష్ప్రభావాలపై జనజాగరణ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో అవగాహన పెరుగుతుంది.

కాబట్టి, మాదకద్రవ్యాల సమస్య ఒకరి సమస్య కాదు it is a collective responsibility. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ, మాదకద్రవ్య నివారణ సంస్థలు, లేదా NDDTC / AIIMS లాంటి సంస్థలు,సమాజం అందరూ కలిసి కృషి చేస్తేనే ఈ సమస్యను అధిగమించగలుగుతాం. అవగాహన, ప్రేమ, మార్గదర్శనం, బాధ్యతఈ నాలుగు విద్యార్థులను మాదకద్రవ్యాల ముప్పు నుండి రక్షించగల ముఖ్యమైన సాధనాలు. సమష్టిగా చైతన్యం పెంచినప్పుడే విద్యార్థులను మాదకద్రవ్యాల ప్రమాదం నుండి దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందించగలుగుతాం.



డాక్టర్ కోమల్ల ఇంద్రసేనారెడ్డి,
లైబ్రేరియన్
కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్,
వరంగల్. 9849375829

# 'సంచార సాథీ'

## రక్షణా వాగ్దానమా? లేక గూఢచార ఆయుధమా?

భారతదేశంలో డిజిటల్ యుగంలో ప్రజల జీవితాలు మొబైల్ ఫోన్లతో ముడిపడి ఉన్నాయి. ప్రతి సందేశం, ప్రతి కాల్, ప్రతి లొకేషన్... ఇవన్నీ, మన స్వేచ్ఛా జీవితాలలో భాగం. కానీ, మోదీ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఒక ఆదేశం ఈ స్వేచ్ఛను ఆపదకు గురిచేస్తోంది. "సంచార సాథీ" అనే యాప్ను అన్ని స్మార్ట్ఫోన్లలో బలవంతంగా ప్రీ-ఇన్స్టాల్ చేయాలని కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ సెల్ ఫోన్ మ్యానిఫ్యాక్చరింగ్, ఎస్సెంబ్లింగ్, కంపెనీలను, యూనిట్స్ను ఆదేశించింది. ఇది ఫోన్ దొంగతనాలు, స్కామ్లు నిరోధించడానికి ఉపయోగపడుతుందని ప్రభుత్వం చెబుతోంది. అయినప్పటికీ, ఈ వాదానికి వ్యతిరేక (సాంకేతిక నిపుణులు) వాదులు చెప్పేది ఏమిటంటే, ప్రైవసీ యాక్టివిస్టులు దీన్ని 'స్నూపింగ్ యాప్'గా, పెగాసస్ 2.0గా బ్రాండ్ అని పిలుస్తున్నారు. ఇది రక్షణా వాగ్దానమా లేక ప్రజలను పర్యవేక్షించే గూఢాచార (స్పై) ఆయుధమా? ఈ వివాదం మన డిజిటల్ హక్కులపై లోతైన ప్రశ్నలను లేవనెత్తుతోంది.

"సంచార సాథీ" యాప్ 2023 మేలో డిపార్ట్మెంట్ ఆఫ్ టెలికామ్యూనికేషన్స్ (డాట్) చేత ప్రవేశపెట్టబడింది. ఇది ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్లాట్ఫామ్గా, మొబైల్ యూజర్లకు ఫోన్ గుర్తింపు (ఐ.ఎమ్.ఈ.ఐ.వెరిఫికేషన్), కోల్పోయిన డివైస్లు ట్రాకింగ్, అనధికార సిమ్లు బ్లాక్ చేయడం వంటి సౌకర్యాలు అందిస్తుంది. ప్రభుత్వం ప్రకారం, 2023 నుంచి 6 లక్షలకు పైగా కోల్పోయిన ఫోన్లు పునరుద్ధరించబడ్డాయి, ఒక్క క్షణానికి ఒక ఫోన్ ట్రేస్ అవుతోంది. 57 లక్షల సిమ్లు బ్లాక్ చేయబడ్డాయి,17 వేల దొంగ ఫోన్లు అడ్డుకున్నాయి. ఇది 'డిజిటల్ భారత్' విజన్లో భాగంగా, సైబర్ సెక్యూరిటీని బలోపేతం చేస్తుందని యూనియన్ టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెబుతున్నారు. "ఇది ఐచ్ఛికం, డిలీట్ చేయవచ్చు" అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం యాప్ 'పర్సనల్ డేటా' స్వయం చాలకంగా క్యాప్చర్ చేయదని, యూజర్ అనుమతి లేకుండా ఏమీ చేయదని వాదిస్తోంది. టెలికాం సైబర్ సెక్యూరిటీ రూల్స్ 2024 కింద జారీ చేసిన ఈ ఆదేశం, 90 రోజుల్లో అమలు చేయాలని ఆపిల్, సాంసంగ్, గూగుల్, షియోమీ వంటి కంపెనీలకు ఆదేశించింది. ఇప్పటికే మార్కెట్లో ఉన్న ఫోన్లకు సాఫ్ట్వేర్ అప్డేట్ ద్వారా ఇన్స్టాల్ చేయాలని కూడా చెప్పారు.

కానీ, ఈ 'సేఫ్టీ ప్రామిస్' వెనుక దాగి ఉన్న వాస్తవాలు భయభ్రాంతులు కలిగిస్తున్నాయి. యాప్కు కాల్స్, మెసేజెస్, స్టోరేజ్, లొకేషన్, కెమెరా యాక్సెస్ అవసరమవుతుంది. ఇది (ఐ.ఎమ్.ఈ.ఐ.) స్పూఫింగ్ను నిరోధిస్తుందని చెప్పినా, ఇది ప్రజల ఫోన్ యాక్టివిటీని పూర్తిగా మానిటర్ చేసే బ్యాక్డోర్గా మారే అవకాశం ఉందని, అపోజిషన్ నేతలు (కొందరు ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ సాంకేతిక నిపుణులు) దీన్ని 'బిగ్ బ్రదర్' వాచింగ్గా వర్ణిస్తున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే "ఇది బీజేపీ అధికారులతో ప్రజల మాట పై నిఘా పెట్టడానికి మరో ప్రయత్నం" అని, " మరో డిక్టేటర్షిప్"గా అభివర్ణించారు. ప్రియాంక గాంధీ "స్నూపింగ్ యాప్" అని, "ఫ్రాడ్ రిపోర్టింగ్ , మధ్యలో ప్రతి పౌరం ఫోన్ను చూసే వ్యక్తి గత సమాచార సేకరణ " అని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీ రేణుక చౌదరి పెగాసస్తో పోల్చి, "ఎంపీలు, ఎమ్ఎల్ఏల ఫోన్లు ట్యాప్ అవుతున్నాయి" అని ఆరోపించారు. ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ "ప్రజల ప్రైవసీని ధ్వంసం చేసే మోదీ ప్రభుత్వం మరో ప్రయత్నం" అని ట్వీట్ చేశారు. ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ "ఇది రీసెండ్ అయ్యే వరకు పోరాటం చేస్తాం" అని ప్రకటించింది.ఈ విమర్శలు ఆధార్ రహితం కాదు. 2017లో సుప్రీం కోర్టు ప్రైవసీని ఆర్టికల్ 21 కింద ఫండమె ంటల్ రైట్గా గుర్తించింది. కానీ, మోదీ ప్రభుత్వం అప్పటి నుంచి ప్రైవసీకి వ్యతిరేకంగా నిలబడింది. "పెగాసస్ స్కాండల్" లో ప్రభుత్వం "జవాబుదారీతనం చూపలేదు". ఇప్పుడు సంచార సాథి, 73 కోట్ల స్మార్ట్ఫోన్లలో బలవంతంగా రావడం, ఇది మాస్ సర్వెయిలెన్స్ టూల్గా మారే అవకాశం ఉంది. యాప్ 'రెడీలీ విజిబుల్'గా ఉండాలి, 'డిసేబుల్' చేయకూడదని ఆదేశం, ఇది యూజర్ ఎంపికను బలహీనప రుస్తుంది. ఆపిల్, సాంసంగ్ వంటి కంపెనీలు ఇంకా కంప్లై చేయడానికి మానసికంగా తమ సంసిద్ధత ను చూపలేదు. ఆపిల్ "ప్రైవసీ రిస్కులు" అని చెప్పి, మధ్య మార్గంలో ప్రజలు నిత్య జీవితంపై 27ౌ7 నిఘాను ఉంచాలని చూస్తోంది. ఇది ఆర్థిక బలవంతం పై కంపెనీలు భారత మార్కెట్ను కోల్పోవడానికి తోడ్పడతాయి.

ప్రభుత్వం వాదనలు ఆకర్షణీయంగా ఉన్నా, వాటిలో లోపాలు ఉన్నాయి. (ఐఎమ్.ఈ.ఐ.) మిస్యూస్ నిరోధం అవసరమే, కానీ... దానికి మొత్తం పాపులేషన్ను స్కాన్ చేయాలా? యూరప్లో (జీడీపీఆర్) వంటి చట్టాలు ప్రైవసీని ప్రాధాన్యత ఇస్తాయి, ఇక్కడ మాత్రం 'సేఫ్టీ' పేరుతో సర్వైలెన్స్ జస్టిఫై చేస్తున్నారు. ఈ యాప్ డేటా ఎక్కడ స్టోర్ అవుతుంది? ఎవరు యాక్సెస్ చేస్తారు? పార్లమెంట్లో చర్చ లేకుండా రహస్యంగా జారీ చేయడం డెమాక్రసీకి విరుద్ధం అని విపక్షాలు విమర్శలు , హెచ్చరికలు చేస్తున్నాయి. వ్యతిరేకులు చెప్పేది సరైనదేఇది డిసెంట్ను ట్రాక్ చేయడానికి ఉపయోగపడుతుంది. మీడియా రిపోర్టుల ప్రకారం, ఇది 'పర్మనెంట్ సర్వెయిలెన్స్ బ్యాక్డోర్'గా మారవచ్చు. ఫైనాన్షియల్ టైమ్స్ రిపోర్ట్ ప్రకారం, మోదీ ప్రభుత్వం ఇప్పటికే 'లాఫుల్ ఇంటర్సెప్షన్' సిస్టమ్ల ద్వారా స్నూపింగ్ చేస్తోంది.ఈ వివాదం మన డిజిటల్ భవిష్యత్తును ప్రశ్నిస్తోంది. సర్వైలెన్స్ రాజ్యంలో ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడలేరు, రాజకీయాలు చేయలేరు. ప్రభుత్వం 'సేవా తీర్థ్' పేరుతో పీఎంఓను మార్చుకుంటుండగా, ప్రజల హక్కులు కోల్పోతున్నాయి. ఈ విషయంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలి, పార్లమెంటరీ చర్చ జరిగి, ట్రాన్స్పరెంట్ పాలసీ రూపొందించాలి. యాప్ ఐచ్ఛికంగా ఉంచి, స్ట్రాంగ్ డేటా ప్రొటెక్షన్ లాస్ తీసుకురావాలి. లేకపోతే, డిజిటల్ భారత్ 'డిస్టోపియన్ భారత్'గా మారిపోతుంది. ప్రజలు మొబైల్లను ఆఫ్ చేసి, ప్రైవసీకై పోరాడాలి. ఇది కేవలం యాప్ వివాదం మాత్రమే కాదు. మన స్వేచ్ఛా , స్వాతంత్ర్యల పై చట్ట రిత్యా యుద్ధం చేయటమే.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# టాలీవుడ్ ఇకనైనా పరివర్తన చెందాలి!



భారతీయ సమాజంలో సినీ పరిశ్రమకి ఉండే ఆదరణ భక్తి అమోఘమైనది అందులో మరి ముఖ్యంగా తెలుగు చిత్ర పరిశ్రమలో ఉండే హీరోలకి గౌరవం అభిమానం అపూర్వమైనది, ఇంకా చెప్పాలంటే సీనియర్ ఎన్టీ. రామారావు చేసిన రాముడు, కృష్ణుడు పాత్రలే నిజమైన దేవుళ్ళుగా తెలుగు అభిమానులు భావిస్తారు. అంటే తెలుగు రాష్ట్రాల అభిమానులు, సామాన్య ప్రజలు సినిమా పరిశ్రమ వారికి మరీ ముఖ్యంగా హీరోలకి ఎనలేని ప్రాధాన్యత ఇస్తారు. ఒకానొక సందర్భంలో హీరోల కోసం అభిమానులు ఆత్మ బలిదానాలు కూడా చేసుకున్న సందర్భాలు చాలా ఉన్నాయి. మరి సినిమా హీరోల కోసం కదు పేదరికంలో ఉంటూ కుటుంబాలను సైతం లెక్కచేయకుండా ఆత్మ బలిదానాలు చేసుకుంటున్న అభిమానుల కోసం తెలుగు చిత్ర పరిశ్రమ హీరోలు వాళ్ళ అభిమానుల కోసం సామాజిక గౌరవం దక్కేలా విప్లవాత్మక కార్యక్రమాలు ఏమైనా చేస్తారంటే అవి కూడా ఉండవు.ఇకపోతే సినిమా పరిశ్రమ సామాజిక ప్రయోజనాలకి ముడి పెడుతూ ఇంకా చరిత్రలోకి లోతుగా వెళితే తెలంగాణ సమాజంలో, భారతీయ సమాజంలో జనాభా పరంగా సింహభాగం ఉండి కదు పేదరికంలో మధ్యతరగతి జీవితాలని గడుపుతున్నది ఎవరంటే 90% అణగారిన వర్గాలే, అంటే వీళ్లకు మాత్రమే వీపరితమైన మోజు తెలుగు చిత్ర పరిశ్రమపై, నటినటులపై ఉంటది. ఆర్థికంగా బలంగా ఉండి ఉన్నత ఉద్యోగాలు చేసే అగ్రవర్ణాలు ఏ చిత్ర పరిశ్రమపై మీతిమీరిన అభిమానం పెంచుకోరు, సినిమా నటీనటుల కోసం ఏ అగ్రవర్ణ వ్యక్తులు బలిదానాలు చేసుకోరు, వాళ్ల నిత్య జీవితంలో కొన్ని నెలలకి ఒకసారి సమయం ఉంటే థియేటర్లోకి వెళ్లి కుటుంబాలతో సినిమాని వీక్షిస్తారు, లేకుంటే ఇంట్లోనే కుటుంబాలతో ఓటిటి లో సినిమాలను చూస్తారు. కానీ మధ్యతరగతి పేద కుటుంబాల వ్యక్తులు, అభిమానులు మాత్రం ఇంట్లో తినడానికి తిండి లేకపోయినా, మౌలిక సదుపాయాలు సైతం కల్పించలేని ప్రభుత్వాలని ప్రశ్నిస్తూ సామాజిక పోరాటాలు చేయడానికి చైతన్యం సమయం ఉండదు. కానీ తెలుగు చిత్ర పరిశ్రమ నుండి అగ్ర హీరోలకు సంబంధించి ఏ సినిమా వచ్చిన మొదటి రోజే థియేటర్లకు వెళ్లి సినిమాలు చూసి ఆనందపడే వారు సినిమా దర్శక నిర్మాతలకి కోట్ల ఆదాయం వచ్చేలా సినిమాలని ఆదరించేది మాత్రం అణగారిన వర్గాల పేద అభిమానులు మాత్రమే ఉండడం గమనర్హం. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో రాష్ట్రం వచ్చిన మరు క్షణమే తెలంగాణ ప్రభుత్వంలో లక్ష నాగాళ్లు పెట్టి, రామోజీ ఫిలిం సిటీ భూములను దున్ని బడుగు బలహీన వర్గాలకు పంపిణీ చేస్తామని నాడు కెసిఆర్ చెప్పడం జరిగింది. కానీ పది ఏండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ రామోజీ ఫిలిం సిటీ లో ఒక్క ఎకరం భూ పంపిణీ కూడా పేద వర్గాలకు పంచలే. బయటికి రాని చారిత్రక సత్యం ఏంటంటే నాడు ఎన్టీ. రామారావు ప్రభుత్వం హయంలో ఒకే సామాజిక వర్గమైన రామోజీరావు అతి తక్కువ ధరలకే రామోజీ ఫిలిం సిటీ లోని 2500 ఎకరాల భూమిని విక్రయించారని ఆరోపణలు ఉండటం గమనార్హం. అంటే పాలక వర్గాలైన కమ్మ,రెడ్డి, వెలమ, కాపు, బ్రాహ్మణ, వైశ్య సినీ, వ్యాపార, రాజకీయ వ్యక్తుల మధ్య ఉండే స్వార్థపు సామాజిక వర్గ బంధాలు ఎలా ఉంటాయో నిరూపణ అవుతుంది.

తెలుగు చిత్ర పరిశ్రమల ఉండే దౌర్భాగ్యం ఏంటంటే హీరోలు దర్శక నిర్మాతలు సీనియర్ ఆర్టిస్టులు మొత్తం అగ్ర కులానికి చెందిన కమ్మ, రెడ్డి, వెలమ,కాపు, బ్రాహ్మణ, వైశ్య వ్యక్తులు కాగా జూనియర్ ఆర్టిస్టులుగా కమెడియన్స్ గా టెక్నీషియన్స్ గా పని చేసేది అణగారిన వర్గాల వ్యక్తులు. తెలుగు చిత్ర పరిశ్రమలో హీరోలుగా దర్శక నిర్మాతలుగా సీనియర్ ఆర్టిస్టులుగా పని చేసిన కమ్మ,రెడ్డి,వెలమ, కాపు వ్యక్తులే సినిమా పరిశ్రమని అడ్డుపెట్టుకొని అగ్ర నాయకులుగా ఎదిగి తద్వారా రాజకీయాల్లో, వ్యాపారాల్లో తమ అధిపత్యాన్ని చూయించి కోటీశ్వరులు ఎదిగారు. కానీ అదే చలన చిత్ర పరిశ్రమ ద్వారా అగ్ర నాయకులను చేసి వ్యాపార రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేలా గుర్తింపు గౌరవాన్ని ఇచ్చిన అభిమానుల కోసం సామాజిక, వ్యక్తిగత బాధ్యతగా సంఘంలో సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక విప్లవాత్మక పరివర్తన తీసుకొచ్చేలా అణగారిన వర్గాల అభిమానుల కోసం చేసిన ఒక మంచి కార్యక్రమం లేకపోవడం దురదృష్టకరం. ఒకపక్క హాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో అన్ని విభాగాల్లో నల్ల వ్యక్తులకి మెజార్టీగా దాదాపు 40% వాటా ఇవ్వడం గమనార్హం. అలాగే తమిళనాడు కోలీవుడ్ ఇండస్ట్రీలో దాదాపు అణగారిన వర్గాల నుండే అగ్ర హీరోలుగా, దర్శక నిర్మాతలు ఉండడం గమనర్హం. అంతే కాదు కోలీవుడ్ చిత్ర పరిశ్రమకు చెందిన అగ్ర దర్శకులు ఐన పా. రాంజిత్, వెట్రిమరన్, మరి సిల్వరాజ్ తమ సామాజిక,వ్యక్తిగత బాధ్యతగా సంఘంలో సామాజిక అసమానతలు పోయేలా సమ సమాజ స్థాపన జరిగేలా సినిమా పరిశ్రమని ఒక సాధనంగా చేసుకొని, తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని గర్వంగా చెప్పుకుంటున్నారు. అదే దిశగా సమాజంలో సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరివర్తన తీసుకువచ్చే సినిమాలనే తీస్తాము కానీ అభిమానుల మితిమీరిన అభిమానన్ని సాకుగా చేసుకొని కోట్లు సంపాదించడం కోసం కోలీవుడ్ ఇండస్ట్రీలో స్వార్థపు వ్యక్తులుగా తమ జీవితాన్ని కొనసాగించలేమని అనేక మంది దర్శక,నిర్మాతలు ఆచరణాత్మకంగా పనిచేస్తున్నారు. కానీ తెలుగు చిత్ర పరిశ్రమలో మాత్రం ఏ ఒక్క అగ్ర హీరోలు దర్శక నిర్మాతలు సంఘంలో సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరివర్తన వచ్చేలా మా వంతుగా కృషి కృషి చేస్తాం, అందుకు సినిమాని సాధనంగా వాడుకుంటామని ఎవరు చెప్పకపోవడం అలా ఆచరణీయంగా పనిచేయకపోవడం తెలుగు ప్రజల దౌర్భాగ్యం. తెలుగు చిత్ర పరిశ్రమ లోని అగ్ర హీరో దర్శక, నిర్మాతలు ఎవరు కూడా సామాజిక సేవ చేయడం లేదు, లక్షల కోట్లు సంపాదించడానికి సినిమాని ఒక సాధనంగా ఉపయోగించుకున్నట్లుగా నిరూపణ అవుతున్నది..! వందల, వేల కోట్లు పెట్టి భారీ సినిమాలు తీసే అగ్ర హీరో, దర్శక నిర్మాతలు సినిమా విడుదల సమయంలో టికెట్లు ధరలు పెంచుకుంటామని వివిధ సినీ వ్యాపార ప్రోత్సాహకాలు ఇవ్వమని ప్రభుత్వాలని అడుగుతారు కానీ అదే సామాజిక, వ్యక్తిగత బాధ్యతగా సంఘంలో పరివర్తన తీసుకొచ్చి గొప్ప సినిమాలు తీయకుండా, సమాజం చెడు మార్గంలో పోయేలా అనేక పనికిరాని, అజ్ఞాన, అశాస్త్రీయ సినిమాలు ప్రేక్షకులపై రుద్దడం అంటే అనాగరికం, అనైతిక చర్యకి నిదర్శనం కదా..!

కానీ ఇక్కడ చారిత్రక సత్యం ఏంటంటే ఎవరు ఏ రంగంలో ఎంతటి నైపుణ్యం కలిగిన వ్యక్తులు అయినప్పటికీ అందరూ కూడా సంఘంలో సభ్యులే, ప్రతి భారతీయ పౌరుడు కూడా ప్రపంచంలోనే ఏ దేశానికి లేని విశ్వానికే ఆదర్శమైన డా. అంబేద్కర్ భారత రాజ్యాంగానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కృతజ్ఞుడై తమ విధి విధానాలని పాటించవలసి ఉంటుంది. అదే ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో ఏ వ్యక్తి ఏ రంగంలో ఎంతటి స్థానంలో ఉన్న తమ దేశ రాజ్యాంగానికి కట్టుబడి ఉంటూ, సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తులుగా ప్రవర్తిస్తారు. కానీ భారతదేశ చలన చిత్ర పరిశ్రమలో మరీ ముఖ్యంగా తెలుగు చిత్ర పరిశ్రమలో ఉండే అగ్ర హీరోలకి దర్శక నిర్మాతలకి సామాజిక బాధ్యత, సామాజిక ధర్మం, భారత రాజ్యాంగంలోని నియమ నిబంధనలు వర్తించవా..? ఎందుకు వీళ్ళకి 140 కోట్ల మంది ప్రజలను నడిపించే భారత రాజ్యాంగంలోని గొప్ప విలువలని సినిమాల ద్వారా ప్రజలకు తెలిసిలా సంఘంలో పరివర్తన వచ్చేలా సినిమాలు తీయాలని ఆలోచన సామాజిక బాధ్యతగా ఎందుకు రాదు..! అంటే భారతీయ పౌరులుగా ఉంటూ తెలుగు రాష్ట్రాల్లో లక్షలల్లో అభిమానం కలిగిన అగ్ర హీరో దర్శక నిర్మాతలుగా ఉంటారు. కానీ భారత రాజ్యాంగమే భారతీయ సమాజంలో 2000 సంవత్సరాల పైగా ఉన్న సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక అసమానతలని రూపుమాపి, సంఘంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నదని, సినిమా మాధ్యమాల ద్వారా తెలుగు అగ్ర హీరోలు దర్శక నిర్మాతలు ఎందుకు తెలియచెప్పడం లేదు..? వీళ్ళు రాజ్యాంగానికి విధేయులై పనిచేయడం లేదు, సామాజిక బాధ్యత లేని వ్యక్తులుగా ఉంటున్నారని నిరూపణ అవుతున్నట్టుగా వివిధ రంగాల్లోని మేధావులు, విద్యావంతులు, సామాన్య ప్రజలు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం.

తాజాగా తెలుగు చిత్ర పరిశ్రమకి సంబంధించిన సినిమాలని ఇమ్మడి రవి అనే వ్యక్తి ఐ బొమ్మ, బప్పం వెబ్సైట్ల ద్వారా తెలుగు చిత్ర పరిశ్రమలో మరియు వివిధ భారతీయ చిత్ర పరిశ్రమలో వచ్చే సినిమాలను ప్రేక్షకులకి పైరసీ ద్వారా ఉచితంగా చూయించి, తెలంగాణ పోలీస్ డిపార్ట్మెంట్ కి దొరికిపోయాడు. ఇమ్మడి రవి చేసింది చట్టరిత్య నేరం అయినప్పటికీ అతడు సినిమాని డెమోక్రటైజ్ చేసి, అధిక రేటు పెట్టి సినిమాలు చూడలేని ప్రతి సామాన్యుడు సినిమా చూసేలా చేశాడు. అలాగే తెలుగు చిత్ర పరిశ్రమని ఆదరించే కోట్ల మంది అభిమానులు తమ హీరోల కంటే ఇమ్మడి రవినే ఇప్పుడు నిజమైన హీరోగా ఆదరిస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ హీరో దర్శక నిర్మాతలు సీనియర్ ఆర్టిస్టులు అంతా అగ్ర కులాలైన రెడ్డి, వెలమ కమ్మ,కాపు, బ్రాహ్మణ, వైశ్యా వ్యక్తులే సినిమా థియేటర్లు కూడా వీళ్ళవే కావడం గమనార్హం. మల్టీప్లెక్స్ థియేటర్లలో ఒక మధ్యతరగతి కుటుంబం తమ ఫ్యామిలీతో సినిమా చూడడానికి ఆర్థికంగా పెనుబారం ఉంటది. సినిమా టికెట్లకు ఎక్కువ రేటు ఉండగా, థియేటర్లలో సామాజిక బాధ్యతగా ప్రేక్షకులకి ఫ్రీ వాటర్ కూడా పంపిణీ చేయారు.అనేక సింగల్ స్క్రీన్ థియేటర్లలో ప్రేక్షకులకి మౌలిక సదుపాయాలు కూడా సంతృప్తికరంగా ఉండవు.బయట మార్కెట్లో ఉండే ధరలకు రెట్టింపుగా థియేటర్లలో మంచి నీళ్ళకి ఇతర స్నాక్స్ కి అత్యధిక రేటు ఉండడం ఈ చర్యలకు విసుగెత్తిన తెలుగు ప్రేక్షకులు వీటిని ఖండిస్తూ ఇమ్మడి రవి చేసింది మంచి పని అని ప్రజా కోర్టులో ప్రేక్షకులు ఐ బొమ్మ రవిని దేవుడిగా, నిజమైన హీరోగా కీర్తిస్తూ తెలంగాణ పోలీస్ చర్యని తప్పు పడుతున్నారు.అంటే తప్పుడు మార్గం ద్వారా ఇమ్మడి రవి చేసిన సినిమా పైరసీ తప్పే కావచ్చు, కానీ తమ ఫోన్లలో డేటా ఉంటే చాలు తక్కువ ఖర్చుతో ప్రతి సామాన్యుడు సినిమా చూసేలా ఐ బొమ్మ రవి చేశారని, ఇదే తెలుగు చిత్ర పరిశ్రమ అందరూ హీరోల అభిమానులు ఒప్పుకుంటున్నారు. కాబట్టి ఇక్కడ ఏమి గ్రహించాలంటే చట్టానికి అతీతంగా ఇమ్మడి రవి చేసిన సినిమా పైరసీకి చట్టరీత్యా శిక్షించినప్పటికీ, తెలుగు చిత్ర పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు వచ్చి సినిమాని డెమోక్రటైజ్ చేచేసి తెలుగు చిత్ర పరిశ్రమలో ఉన్న, సామాజిక అంతరాలని బ్రేక్ చేస్తూ అణగారిన వర్గాలని కామెడీ ఆర్టిస్టులుగా టెక్నీషియన్స్ గా దినసరి కూలీలుగా మాత్రమే వాడకుండా, ఇన్నాళ్లుగా తెలుగు చిత్ర పరిశ్రమని ఆదరిస్తున్న కోట్ల మంది అణగారిన వర్గాల వ్యక్తులని కూడా అగ్ర హీరోలుగా దర్శక నిర్మాతలుగా సీనియర్ ఆర్టిస్టులుగా ఎదిగేలా తెలుగు చిత్ర పరిశ్రమ పరివర్తన చెందాలి. అదేవిధంగా సినిమా మాధ్యమం ద్వారా సమాజంలో విప్లవాత్మక సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక మార్పు తీసుకొచ్చే దిశగా ఇకపై తెలుగు చిత్ర పరిశ్రమ పనిచేయాలని, అదే నేడు తెలుగు చిత్ర పరిశ్రమలో ఉన్న అగ్ర హీరోల, దర్శక, నిర్మాత లపై ఉన్న తక్షణ కర్తవ్యం మరియు సామాజిక వ్యక్తిగత బాధ్యత అని గ్రహించాలి. అదేవిధంగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాలు కూడా పరివర్తన చెందాలి, ఎందుకంటే ఎన్నో ఏళ్లుగా సమాజంలో ఉన్న సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక అసమానతలని చూయిస్తూ వాటిని బ్రేక్ చేస్తూ, సంఘంలో గొప్ప పరివర్తన వచ్చేలా కోలీవుడ్ చిత్ర పరిశ్రమ నుండి జై భీమ్ అనే గొప్ప చిత్రం వచ్చి ఘనమైన ప్రేక్షక ఆదరణ పొందితే ఆ సినిమాకి, అందులో నటించిన నటీనటులకి జాతీయ స్థాయిలో ఎలాంటి గుర్తింపు గౌరవం ఇవ్వకపోగా, అదే తెలుగు చిత్ర పరిశ్రమ నుండి వచ్చిన చట్టానికి వ్యతిరేకమైన ఎర్ర చందనం స్మగ్లింగ్ పై పుష్ప సినిమా వస్తే దానిని జాతీయ ఉత్తమ చిత్రంగా కేంద్ర ప్రభుత్వం గుర్తించడం అందులో హీరోగా నటించిన అల్లు అర్జున్ కి జాతీయ ఉత్తమ నటుడిగా గౌరవం, కీర్తి ఇవ్వడం అంటే ఏంటి..? ప్రభుత్వాలే చట్టానికి, భారత రాజ్యాంగంలోని నియమ నిబంధనలకి వ్యతిరేకమైన సినిమాలు తీసేలా ప్రోత్సహిస్తున్నట్లే కదా..! అంటే ప్రభుత్వాలు కూడా సమాజంలో గొప్ప మార్పులు వస్తూ సమ సమాజ స్థాపన కోసం ప్రభుత్వాలు కూడా పనిచేయడం లేదని మేధావులు, విద్యావంతులు, సినిమా అభిమానులు విచక్షణ జ్ఞానంతో సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తులుగా గ్రహిస్తారు కదా. కాబట్టి ఇకనైనా తెలుగు చిత్ర పరిశ్రమ నటీనటులు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాలు తమ విధివిధానల్లో విప్లవాత్మక పరివర్తన తీసుకురావాలి అప్పుడు మాత్రమే సినిమా మాధ్యమాల ద్వారా సమాజంలో గొప్పనైన మార్పును చూడగలము.



బి పుల్లెంల గణేష్
(ధర్మ సమాజ్ పార్టీ
స్టడీ, రీసెర్చ్ టీం రాష్ట్ర ఇంచార్జ్)
9553041549

# లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్

- తాండూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు
- డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం 16 వేల 500 డిమాండ్
- లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబరుకి సమాచారం ఇవ్వాలి
- రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్



**తాండూరు, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** తాండూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ గా పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ లంచావతారం ఎత్తారు. డబ్బులిస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని. ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్ల ద్వారా వసూళ్లకు పాల్పడ్డాడు. రిజిస్ట్రార్, ఇద్దరు డాక్యుమెంట్ రైటర్లను అరెస్టు బాధితుని ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు దాడులు చేసి లంచం తీసుకుంటున్న ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్, డాక్యుమెంట్ రైటర్లను అరెస్టు చేశారు. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాలిల ప్రకారం తాండూరు ప్రాంతానికి చెందిన ఓ రియల్ ఏస్టేట్ వ్యాపారి తనకు చెందిన భూమిని 11 డాక్యుమెంట్లుగా చేసి కుటుంబ సభ్యులతో పాటు విక్రయదారులకు రిజిస్ట్రేషన్ చేయాలని తాండూరు సబ్ కార్యాలయంలో సంప్రదించారు. ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ గా పనిచేస్తున్న సాయికుమార్ (జూనియర్ అసిస్టెంట్) డాక్యుమెంట్లు సరిగ్గాలేవని వంకలు పెడుతూ నిరాకరించారు. కార్యాలయం ముందు ఉన్న ఓ ఆఫీసులు ప్రైవేటు డాక్యుమెంట్ రైటర్గా పనిచేస్తున్న అశోక్, అసిస్టెంట్ డాక్యుమెంట్ రైటర్ సాయిలు సదరు వ్యాపారి రిజిస్ట్రేషన్లు చేయించేందుకు ఒప్పందం చేసుకున్నారు. ముందుగా ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేయాలంటే రూ. 2వేలు చొప్పున ఇవ్వాలని ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ కోరారని డాక్యుమెంట్ రైటర్లు సదరు వ్యాపారికి తెలిపారు. మరోసారి మాట్లాడగా ఒక్కో డాక్యుమెంట్ కు రూ. 1500ల చొప్పున రూ. 16500లు ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. అంత డబ్బులు ఇవ్వడం ఇష్టంలేని వ్యాపారి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో ఏసీబీ రంగారెడ్డి రేంజ్ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో బృందం దాడులు చేశారు. అప్పటికే ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయి 4 డాక్యుమెంట్ లను రిజిస్టర్ చేశారు. మిగతా వాటిని చేయాలంటే రూ. 16500లు ఇవ్వాలని మరోసారి లంచం డిమాండ్ చేశారు. బుధవారం ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయి డాక్యుమెంట్ రైటర్లు అశోక్, సాయిల ద్వారా డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మూసి వేసి.. విచారణ చేపట్టారు. మరోవైపు నిందితుల ఇళ్ల వద్ద కూడా సోదాలు నిర్వహించారు. పూర్తి విచారణ జరిపి ఇంచార్జ్ సబ్ రిజిస్ట్రార్ సాయి. డాక్యుమెంట్ రైటర్లు అశోక్, సాయిలను అరెస్టు చేయడం జరిగిందని ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబరు కి సమాచారం ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ వెల్లడించారు.

# భాష్యం బ్లూమ్స్‌లో సైన్స్ ఫెయిర్



**మహేశ్వరం, డిసెంబర్ 3 (జనం సాక్షి) :** మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ పరిధిలోని భాష్యం బ్లూమ్స్ స్కూల్లో సైన్స్ ఫెయిర్‌ను ఈ నెల 8,9 తేదీలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు మహేశ్వరం ఎంఈవో కస్నా నాయక్ అన్నారు. బుధవారం భాష్యం బ్లూమ్స్ స్కూల్లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ కు సంబంధించిన ప్లానింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎంఈవో కస్నా నాయక్ మాట్లాడుతూ...సైన్స్ ఫెయిర్ ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత, వైజ్ఞానిక దృక్పథం, కొత్త ఆవిష్కరణలపై అవగాహన పెరుగుతుందన్నారు. సైన్స్ ఫెయిర్ కి 500 వరకు సైన్స్ ప్రాజెక్ట్ లు ప్రదర్శనకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ అధికారి శ్రీనివాసరావు, జయచందర్ రెడ్డి, భాష్యం బ్లూమ్స్ జనరల్ మేనేజర్ నాగేష్, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## హిందువుల మనోభావాలను గాయపరిచే ప్రసంగాలు మానుకోవాలి

- మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అనంత్ రెడ్డి



**చేవెళ్ల, డిసెంబరు 3 (జనంసాక్షి) :** హిందువుల మనోభావాలను గాయపరిచే ప్రసంగాలు మానుకోవాలని, హిందూ దేవీదేవతలను అవమానించినట్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు తీవ్ర అసంతృప్తిని రేకెత్తించాయని, అలాంటి వ్యాఖ్యలను హిందూ సమాజం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని బీజేపీ చేవెళ్ల మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అనంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం బీజేపీ, ఆధ్వర్యంలో చేవెళ్ల ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించి పోలీస్ స్టేషన్ ముందు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అత్తెల్లి అనంత్ రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్ర పగ్గాలు చేపట్టిన బాధ్యతా స్థానంలో ఉన్న వ్యక్తి ప్రజల మత మనోభావాలను దెబ్బతీయడం దౌర్భాగ్యకరమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసానికి ప్రతీకగా నిలవాల్సిన ముఖ్యమంత్రి పదవిని రేవంత్ రెడ్డి తేలికపాటుగా తీసుకున్నారని, హిందువుల మనోభావాలను గాయపరిచే ప్రసంగాలు మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణ సాంస్కృతిక గౌరవం, ఆధ్యాత్మిక విలువలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేస్తే ప్రజలు ప్రశ్నించకుండా ఉండరని స్పష్టం చేశారు. వెంటనే హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాషాయ దళం రుచి చూపించవలసి హెచ్చరించారు. అనంతరం నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంచం శ్రీనివాస్, దేవుని శర్వలింగం, జయశంకర్ గౌడ్, అల్లాడ శ్రీనివాస్ రెడ్డి, చిర శ్రీనివాస్, శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, బండారి చంద్రశేఖర్ రెడ్డి, శేరి బాల్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, మధుకర్ రెడ్డి, భార్గవ్ రెడ్డి, వడ్డే గణేష్, రాఘవేందర్, పెద్దోళ్ల దయాకర్, పాగ వెంకటేష్, ప్రకాష్, సందీప్, ధనుష్ రెడ్డి, సాయి, శివ, తెలుగు కుమార్, రఘునాథ్ రెడ్డి, రాజు, రవి, జయసింహారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై బీజేపీ నేతల తీవ్ర నిరసన



**రాజేంద్రనగర్, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ సమాజం, దేవతలను అవమానించేలా వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై భాజపా నేతలు తీవ్ర నిరసన చేపట్టారు. బుధవారం ఆరాంఘర్ చౌరస్తా వద్ద బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి వంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉండి మతాలను అవమానించేలా మాట్లాడటం అసహ్యమని పేర్కొన్నారు. హిందూ సంప్రదాయాలు, దేవతలు, ధార్మిక విలువలను దెబ్బతీసే వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజల ధార్మిక స్వేచ్ఛకు అవమానం అని డిమాండ్ చేస్తూ, ముఖ్యమంత్రి వెంటనే వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. హిందూ ధర్మరక్షణ కోసం అవసరమైతే ఉద్యమాన్ని మరింత ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మను దహనం చేయడానికి నాయకులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ నిరసనలో గోల్కొండ జిల్లా ఇన్‌ఛార్జ్ వై. శ్రీధర్, చేవెళ్ల బీజేపీ కన్వీనర్ మల్లారెడ్డి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, మైలార్ దేవ్ పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, సందీప్ ముదిరాజ్, ఎస్. వెంకటేష్ సహా రాష్ట్ర, జిల్లా నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగులు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచాలి

- సంగారెడ్డిలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం
- కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి, డిసెంబర్ 3 (జనం సాక్షి) :** దివ్యాంగులు అన్ని రంగాలలో ప్రతిభ కనబరిచి విజయాలను సాధించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్లోని ఆడిటోరియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడుతూ... దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని, అప్పుడే వారు అనుకున్నది సాధించగలుగుతారన్నారు. అన్ని రంగాలలో దివ్యాంగులు సమాజంలోని సకలాంగులకు ఎంతమాత్రం తీసిపోకుండా తమ ప్రతిభను చాటుతున్నారని పేర్కొన్నారు. దివ్యాంగులు సంతోషంగా సమాజానికి స్ఫూర్తిదాయకంగా ఉండాలని సూచించారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. జిల్లాలో దివ్యాంగుల పిల్లల కోసం ఐఆర్సి సెంటర్ ను ఏర్పాటు చేశామని, అన్ని వసతులతో తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ఎస్హెచ్ఈ ద్వారా పీడబ్ల్యుడి గ్రూప్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. దివ్యాంగులకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారం అందిస్తామని అన్నారు. అనంతరం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా క్రీడలలో ప్రథమ స్థానంలో గెలుపొందిన విజేతలకు వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతిని అందజేశారు. అంతకుముందు దివ్యాంగుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యుఓ లలిత కుమారి, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సౌజన్య, సిడిపిఓలు, దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రవీణ్, జుబేదా, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



**తాండూరు, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ఆరాచకాలకు గ్రామాల ప్రజలు భయభ్రాంతుకు గురి అవుతున్నారని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గాజీపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆనందలక్ష్మీ, సాయిలు గౌడ్, మాజీ ఎంపిటిసి తిపన్న, రసూల్, లక్ష్మయ్య, హసేన్, శంకరప్ప రియు పలువురు కార్యకర్తలకు గులాబీ కండువాకప్పి పార్టీలోకి పైలెట్ రోహిత్ రెడ్డి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ నీ వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరిన గాజీపూర్ గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఆనందలక్ష్మీ మాట్లాడుతూ పచ్చని గ్రామాల్లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చిచ్చు పెడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. మీరు మీరు కొట్లాడుకోండి గెలిచినవాడు నావాడు అనే విధంగా ఎమ్మెల్యే ప్రవర్తిస్తున్నారు. ఎన్నో ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు పార్టీలో విలువలేదన్నారు. ఈ ఎన్నికలే తాండూరు ఎమ్మెల్యే ఓటమికి మెట్లు. వచ్చే ఎన్నికల్లో రోహిత్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నపుడు చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమి లేదన్నారు. అదేవిధంగా పైలెట్ రోహిత్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో తాజా మాజీ సర్పంచ్ గేమ్యానాయక్ చేరారు. దీంతో పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కోహిర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు రమేష్, మాజీ సర్పంచ్ వీరన్న, తలారి సుశీల, ముస్తఫా, వెంకటయ్య, వీరేందర్ తదితరులు ఉన్నారు.

## గ్రామపంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- వికారాబాద్ జిల్లా ఎన్నికల పరిశీలకులు షేక్ హాష్మీన్ భాష



**తాండూరు, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని వికారాబాద్ జిల్లా ఎన్నికల పరిశీలకులు షేక్ హాష్మీన్ భాష అధికారులకు సూచించారు. బుదవారం తాండూర్ మండలంలోని గౌతాపూర్, బెల్కటూర్ క్లస్టర్ లలో నామినేషన్ల ప్రక్రియను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, హర్ష్ చౌదరి లతో కలిసి వికారాబాద్ జిల్లా ఎన్నికల పరిశీలకులు షేక్ హాష్మీన్ భాష పరిశీలించారు. గౌతాపూర్ క్లస్టర్ లో గౌతాపూర్, చెన్నగేష్ పూర్, ఎల్మెకన్న గ్రామ పంచాయతీలు, బెల్కటూర్ క్లస్టర్ లో బెల్కటూర్, చంద్రవంక, చిట్టి ఘణపూర్ గ్రామపంచాయతీలకు సంబంధించిన నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని రిటర్నింగ్ అధికారులు పరిశీలకుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా అధికారులతో రిటర్నింగ్ అధికారుల ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రంచాయతీల ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని ఆమె సూచించారు. గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుడు ఒకటే నామినేషన్ వచ్చినప్పటికీ ఏకగ్రీవం అని ప్రకటించకుండా నిబంధనలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు మెదలుకోవాలని ఆమె సూచించారు. నామినేషన్ల ప్రక్రియ పరిశీలనలో ఎంపిడిఓ విశ్వ ప్రసాద్, తహసిల్దార్ తారా సింగ్, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## తుర్కపల్లి రైల్వే గేట్ వద్ద డ్రెయినేజ్ పరిశీలన



**అల్వాల్, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** తుర్కపల్లి రైల్వే గేట్ వద్ద కొత్త రైలు పైపుల పనుల ప్రగతిని, వర్షాకాలంలో నీటి సమస్యలను పరిశీలించడానికి రైల్వే, జిహెచ్ఎంసీ, నీటి సరఫరా శాఖ అధికారులు కలిసి పర్యవేక్షించారు. వర్షాకాలంలో నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం రైలు పైపుల నుండి వీబీ సిటీ, కొంపల్లి-బోల్లారం రోడ్ ద్వారా సంజీవ్ రెడ్డి గార్డెన్స్ అవుట్‌లెట్ వరకు ప్రత్యేక కాంక్రీట్ డ్రెయినేజ్ లైన్ ఏర్పాటు ప్రతిపాదన చర్చించబడింది. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, నీటి సరఫరా శాఖ ప్రధాన నిర్వాహకుడు అశోక్ రెడ్డితో మాట్లాడి దీర్ఘకాలిక పరిష్కారం కోసం ప్రత్యేక డ్రెయినేజ్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి, లడ్డురెడ్డి, బాల్ రెడ్డి, ఆనంద్, రమేష్, సందీప్, వెంకట్, డి. స్వామి, రాజేష్, బాబులు, రామ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

- 33 లక్షల వ్యయంతో మౌలిక వసతుల అభివృద్ధికి శ్రీకారం

**అల్వాల్, డిసెంబర్ 3 (జనం సాక్షి) :** మచ్చబొల్లారం డివిజన్‌లోని హనుమాన్ టేకిడి శ్రీ సాయి నగర్ కాలనీలో 33 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ అభివృద్ధి పనులను మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఎన్నాళ్లుగా పూర్తిస్థాయి డ్రైనేజీ సౌకర్యాల కొరతతో ఇబ్బంది పడుతున్న ఈ ప్రాంతానికి ఈ పనులు ప్రారంభం కావడం ఉపశమనం కలిగించిందని స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో జలమండలి అధికారి సాంబయ్య, డోలి రమేష్, పవన్, నర్ల సురేష్, రాజు, శోభన్, సులోచన, స్వరూప, శ్రీనివాస్, గణేష్, మరో శ్రీనివాస్, రమ, మాధవి, లహరి తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తీవ్రతరం

- టియుడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి
- రంగారెడ్డి జిల్లా నుండి భారీగా తరలిన జర్నలిస్టులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ప్రభుత్వం దిగివచ్చే వరకు ఉద్యమిస్తామని టీయూడబ్ల్యుజె (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండి. సలీంపాషా, కార్యదర్శిసత్యనారాయణ అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ టియుడబ్ల్యూజే ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మహాధర్నాకు జిల్లా వ్యాప్తంగా వందలాది మంది జర్నలిస్టులు తరలి వచ్చారనీ ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండి. సలీమ్ పాషా జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ తదితరుల ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి, చేవెళ్ల, షాద్ నగర్, ఎల్బీనగర్ మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ప్రభుత్వం ఏర్పడిందని ఇంతకాలం సమయం ఇచ్చామని సమస్యలు పరిష్కరించకపోతే పోరుబాటనే ఎంచుకుంటామన్నారు జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వలని, వృత్తి కమిటీలు నియమించాలని చిన్న మధ్యతరగతి పత్రికలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### జర్నలిస్టుల నినాదాలతో దద్దరిల్లిన నగరం..

జర్నలిస్ట్ నినాదాలతో హైదరాబాద్ మహానగరం దద్దరిల్లింది. సమస్యల పరిష్కారం కోరుతూ టియుడబ్ల్యూజే ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ పిలుపుకు మంచి స్పందన వచ్చిందనీ రంగారెడ్డి జిల్లా నుండి పెద్ద ఎత్తున జర్నలిస్టులు నియోజకవర్గాల నుండి భారీ సంఖ్యలో ర్యాలీగా తరలివచ్చారనీ. జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ ర్యాలీతో మాసబ్ ట్యాంక్ లోని సమాచార కమిషనర్ కార్యాలయానికి చేరుకొని పెద్ద ఎత్తున జర్నలిస్టులు తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.



# సైబర్ నేరాల నియంత్రణకు అవగాహన సదస్సులు

- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** సైబర్ నేరాల నియంత్రణకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలను నియంత్రించడానికి, ప్రజలలో సైబర్ భద్రతపై అవగాహన పెంచడానికి జిల్లా వ్యాప్తంగా సైబర్ జాగ్రుకత దివాస్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరుతో ఆరు వారాల ప్రత్యేక కార్యచరణను రూపొందించడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు.

### 6 వారాల పాటు కార్యాచరణ...

మొదటి వారం: సైబర్ సారథి – సైబర్ హెల్ప్‌లైన్ 1930 ప్రాముఖ్యత , సైబర్ మోసానికి గురైనట్లయితే గోల్డెన్ హవర్ (మొదటి గంట లోపు, వీలైనంత తొందరగా) 1930 కు కాల్ చేసి సమాచారం అందించాలి. రెండవ వారం: స్కామ్ సే బచావ్ – డిజిటల్ అరెస్ట్, లైంగిక బ్లాక్‌మెయిల్, సైబర్ స్లేవరీ, మూడవ




వారం: పైసా పైలమ్ – బిజినెస్ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్ (స్టాక్స్ బేస్డ్, టాస్క్ బేస్డ్), లోన్ ఫ్రాడ్, గిఫ్ట్ ఫర్డ్, అడ్వర్టైజమెంట్ ఫ్రాడ్, రివార్డ్స్ పాంయిట్ ఫ్రాడ్. నాల్గవ వారం: హర్ స్కీన్ సురక్షిత్ – మొబైల్, కంప్యూటర్ భద్రత , హాకింగ్, ఫేక్ యాప్, ఎపికె లింక్, బెట్టింగ్, గేమింగ్. ఐదవ వారం: మేరా లాగ్–ఇన్ మేరా రూల్ – సురక్షిత పాస్‌వర్డ్‌లు మరియు లాగిన్ నియమాలు. ఆరవ వారం: మహిళల రక్షణ పిల్లల సంరక్షణ: డేటింగ్ యాప్, సైబర్ బుల్లింగ్, సైబర్ స్టాకింగ్, మాట్రిమోనియాల ఫ్రాడ్స్, చైల్డ్ సెక్సుయల్ ఫ్రాడ్. ఇలాంటి అంశాలతో ప్రజల ముందుకు వెళ్ళి, సైబర్ మోసాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగానే బుధవారం సంగారెడ్డి పట్టణంలోని ఇస్టా కళాశాలలో సైబర్ సారథి – సైబర్ హెల్ప్‌లైన్ 1930 గురించి అవగాహన కల్పిస్తూ, సైబర్ మోసానికి గురైనట్లయితే గోల్డెన్ హవర్ అనగా వీలైనంత తొందరగా 1930కు కాల్ చేసి సమాచారం అందించాలని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ఈ రోజుల్లో ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌ను వినిపించి కొత్త పద్ధతుల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనవసర లింక్ లను, ఎపికె ఫైల్స్ ఓపెన్ చేసి, ఇబ్బందులకు గురి కావొద్దని అన్నారు. బ్యాంక్ అధికారులం అని, పోలీస్ అధికారులం అని, డిజిటల్ అరెస్ట్ అని, ప్రభుత్వ శాఖల పేరుతో వచ్చే స్కామ్ కాల్స్‌కు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, సైబర్ మోసం అని గుర్తించిన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కి ఫిర్యాదు చేయాలన్నారు.

## మీడియా సెంటర్, ఎంసిఎంసి కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్




**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 3 (జనం సాక్షి) :** గ్రామపంచాయతీ ఎన్నికలనుపురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిట రింగ్ కమిటీ సెల్ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, వినయ్ కృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు.ఎన్నికల సందర్భంగా ఎంసిఎంసి ద్వారా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకు న్నారు. ఎంసిఎంసి కేంద్రం లోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కంట్రోల్ రూమ్ ను సందర్శించి ఎన్నికలతో ముడిపడిన అంశాలకు సంబంధించి ఫోన్ ద్వారా ఏమైనా ఫిర్యాదులు వచ్చాయా అని ఆరా తీశారు.

## కలెక్టర్ సమక్షంలో జీపీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 3 (జనం సాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగం గా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, సాధారణ పరిశీలకురాలు (ఎన్నికలు) సీతా లక్ష్మీ సమక్షంలో బుధవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు.ఈ ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు.జిల్లాలోని ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 67 గ్రామ పంచాయతీల సర్పంచ్, 572 వార్డుల స్థానాలకు, 572 పోలింగ్ స్టేషన్ లలో ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతో పాటు, ఓ.పీ.ఓల ర్యాండ మైజేషన్ జరిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్, డీపీఓ సుధాకర్ రెడ్డి, డీపీ ఆర్ ఓ రషీద్ పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**మెదక్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 3 (జనం సాక్షి) :** పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ ఐ. రాణి కుముదిని జిల్లా కలెక్టర్ లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఎన్నికల సాధారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు అందేలా రిటర్నింగ్ అధికారి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న గ్రామీణ ప్రాంతాలలో ఎటువంటి ప్రలోభాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు. నామినేషన్ల గడువు ముగిసిన తర్వాత పోటీ చేసే అభ్యర్థుల గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్ల పై ముద్రణ నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని అన్నారు. సింగిల్ నామినేషన్ వచ్చిన గ్రామాలు ఉంటే అండర్ టేకింగ్ తీసుకోవాలని, సర్పంచ్ పదవుల వేలం ప్రక్రియ ఎక్కడ జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీకి షెడ్యూలు తయారు చేయాలని, ఓటు ప్రాముఖ్యత పై అవగాహన కల్పించేందుకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. మెదక్ ఎన్నికల సాధారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో అవసరమైన వసతులు ఉన్నాయని, నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరుగుతుందని నిబంధనల ప్రకారం స్క్రూటిని ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు అవసరమైన మీద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిసెంబర్ 6న పోలింగ్ సిబ్బంది శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రిటికల్ పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరిగిందని అన్నారు. అంతర్ జిల్లాల చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన



అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సిఈఓ ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, అదనపు ఎస్పీ మహేందర్,జిల్లా రెవెన్యూ అధికారి భుజంగరావు, డిఆర్‌డిఓ శ్రీనివాస్ రావు, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించండి

- జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్



**న్యాల్‌కల్, డిసెంబర్ 3 (జనం సాక్షి) :** అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగేలా పోలీస్ యంత్రాంగం మరింతగా అప్రమత్తమై దృష్టి సారించాలని జహీరాబాద్ డిఎస్పి సైదా నాయక్ ఆదేశించారు. బుధవారం న్యాల్ కల్ లోని నామినేషన్ కేంద్రాన్ని, ముంగి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. స్థానిక సీఐ జక్కుల హనుమంతు, ఎస్సై సుజిత్ తో కలసి నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పలు సౌకర్యాలను పరిశీలించారు. మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామాలైన ముంగి, డప్పూర్, మిర్జాపూర్ (ఎన్), టేకూర్.. సమస్యాత్మక గ్రామాలైన న్యాల్ కల్, చాల్కి, బసంతపూర్, రేజింతల్, గుంజేటి, వడ్డీ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలపై మరింతగా దృష్టి సారించాలని డిఎస్పి సూచించారు. ఈ నెల బుధవారం నుండి శుక్రవారం వరకు జరిగే నామినేషన్ కేంద్రాలు, ఈ నెల17న జరిగే పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు డిఎస్పి తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న కారణంగా పోటీ చేస్తున్న అభ్యర్థులు, అధికార, విపక్ష పార్టీ శ్రేణులు, నాయకులు, ఓటర్లు స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఎన్నికల అధికారులు, పోలీస్ సిబ్బందికి పూర్తిగా సహకరించాలని, లేనియెడల ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ప్రజా విశ్వాసమే కాంగ్రెస్ బలం

- ఉదండాపూర్‌లో బీఆర్ఎస్ ఖాళీ
- 150 మంది కాంగ్రెస్‌లో చేరిక
- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి

**జడ్చర్ల, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** ప్రజా విశ్వాసమే కాంగ్రెస్ బలమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉదండాపూర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సమక్షంలో బుధవారం ఉదండాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మాజీ సర్పంచ్ వెంకటయ్య, సీనియర్ నాయకులు ఐలప్పతో పాటు సుమారు 150 మంది బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి నూతన సభ్యులను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో



వేగంగా ముందు కెళ్తోందని తెలిపారు. అంతకుముందు జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో మృతి చెందిన మాజీ సర్పంచ్ చింతకాయల పెంటయ్య, అర్జున్ పార్థివ దేహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ అకాల మరణాలు తీరని లోటు అని పేర్కొన్నారు వారి కుటుంబాలకు పలుకు అండగా తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పుష్పలత, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతులకు అనుమతులు ఇవ్వండి

- ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేత



**సదాశివపేట, డిసెంబర్ 3 (జనం సాక్షి) :** నిజాంపూర్, కొల్కూర్, మాచిరెడ్డిపల్లి, పొట్టి పల్లి గ్రామాలకు వెళ్లే బిటి రోడ్డు మరమ్మత్తు పనులకు అనుమతులు ఇవ్వాలని 5 గ్రామాల ప్రజలు బుధవారం ఎమ్మార్వోకి వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాంపూర్, కొల్కూర్, మాచిరెడ్డిపల్లి, పొట్టిపల్లి గ్రామాలకు వెళ్లే బిటి రోడ్డు పూర్తిగా చెడిపోయి గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటివరకు నాలుగు చనిపోయారని అన్నారు. రోడ్ సరిగా లేక గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 5 గ్రామల నాయకులు, గ్రామ ప్రజలు పార్టీలకు అతీతంగా నిజాంపూర్ గ్రామ సమీపంలో వెలసిన శుభ గృహ వెంచర్ ఈ యాజమాన్యంతో గ్రామస్తులు రోడ్డు బాగు చేయించాలని కోరగా, శుభ గృహ యాజమాన్యం గ్రామస్తుల విన్నపానికి సానుకూలంగా స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టగా, వెంకటాపురం గ్రామానికి చెందిన ఆరుట్ల అంబదాస్, చిరంజీవి, బాపూజీ అనే వ్యక్తులు అధికారులకు తప్పుడు సమాచారం అందించి రోడ్డు పనులు నిలిపి వేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేసుకోవడానికి అనుమతులు ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# హిందువుల మనోభావాలు దెబ్బతీస్తే ఖబడ్దార్

- నామాజీ హెచ్చరిక
- పేటలో సిఎం రేవంత్ దిష్టి బొమ్మ దహనం
- కాలుతున్న దిష్టి బొమ్మ ను తొలగించిన పోలీసులు

**నారాయణపేట జిల్లా బ్యూరో, డిసెంబర్ 3 (జనం సాక్షి) :** హిందువుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడితే ఖబర్దార్ అని బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామా జీ ఘాటుగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్ళను అవమానకర రీతిలో మాట్లాడి హిందువుల మనోభావాలు దెబ్బతియడాన్ని నిరసిస్తూ నారాయణపేట జిల్లా కేంద్రంలో బుధవారం సి ఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను బిజెపి కార్యకర్తలు దహనం చేశారు. ఈ సందర్భంగా నాగురావు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ఎంఐఎం సహవాసంతో వారి మెప్పు కోసం హిందువులను హిందూ దేవుళ్ళను అవమానిస్తున్నారని దానిని తీవ్రంగా ఖండించారు. ఏక హిందువు అయి ఉండీ ఓట్ల కోసం



అవమానిస్తే హిందూ సమాజం ఉరుకొదని ఖబర్థార్ అని హెచ్చరించారు. కాంగ్రెస్ అంటే ముస్లిం ముస్లిం అంటే కాంగ్రెస్ అన్న రేవంత్ రెడ్డి అసలు రంగు ను హిందువులు గుర్తించాలని అన్నారు. ఓట్లు వేసి గెలిపించిన హిందువులు అదే ఓటుతో సరైన బుద్ధి చెప్పాలని కోరారు. పోలీసులు అడ్డుకుని తొలగించి నీళ్ళు పోశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సత్య యాదవ్, సిద్ది వెంకట్ రాములు, నందు నామాజీ, మిర్చి వెంకటయ్య,సత్య రఘు పాల్,శ్రీనివాస్ రెడ్డి,గోపాల్ యాదవ్,వెంకటయ్య,శ్రీనివాస్, మణి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్




**రాజాపూర్, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ మహబూబ్‌నగర్ జిల్లా ఇంచార్జ్ ఐఏఎస్ కాత్యాయని దేవి రాజాపూర్ ఎం.పి.డి.ఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ మెటీరియల్ ను బుధవారం పరిశీలించారు .గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహణకు అవసరమైన పోలింగ్ సామాగ్రి పరిశీలన చేసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సూచించారు.

# మెడికల్ హాస్పిటల్ ముందు ధర్నా

- కార్మికులకు వేతనం పెంచాలి
- ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు

**గద్వాల టౌన్, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య పెంచి పని భారం తగ్గించాలని జీవో 60 ప్రకారం కార్మికులకు వేతనాలు నెలకు 26,000 ఇవ్వాలని కళాశాల వైస్ ప్రిన్సిపల్ కు వినతి పత్రం ఇచ్చారు.కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అధిక పని భారం తగ్గించాలనీ ఏఐటీయూసీ డిమాండ్ చేస్తూ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు కు విజ్ఞప్తి చేశారు. అనంతరం మెడికల్ హాస్పిటల్ ముందు కార్మికులతో కలిసి నిరసన దర్న చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి ఆంజనేయులు మాట్లాడుతూ మూడేళ్ల కాల పరిమితి దాటినందున వెంటనే పాత టెండర్లను రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్ ల్లో 320



బెడ్లకు గాను 60 మందిలోపే శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ వర్కర్లు ఉండడం దారుణమైన విషయమని పేర్కొన్నారు. హాస్పిటల్‌లో పని చేస్తున్నటువంటి వర్కర్లకి ఎలాంటి స్వేచ్ఛ లేకుండా అదనపు పని భారం పెంచి వెట్టిచాకిరికి గురి చేస్తున్నారని ఆరోపించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కమిషనర్,జిల్లా కలెక్టర్ స్పందించి వర్కర్ల సంఖ్యను పెంచాలని మూడు సంవత్సరాల కాల పరిమితి దాటినందున పాత కాంట్రాక్టును రద్దు చేసి కొత్త టెండర్లను పిలవాలని డిమాండ్ చేశారు.ఈనెల 5వ తేదీన తలపెట్టిన చలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కార్మికుల సమస్యలు పరిష్కారం కాకుంటే దశల వారి పోరాటాలకు సిద్ధమవుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు వెంకటస్వామి మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్రామారెడ్డి, ప్రధాన కార్యదర్శి పర్శ.ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శులు మతిన్ లక్ష్మణ్ అంజి కన్నా వెంకటేశ్వరి చిట్టెమ్మ జయమ్మ లక్ష్మి శానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ వర్కర్లు, పాల్గొన్నారు.

## మిల్స్‌కాలనీ పిఎస్ పరిధిలో దారుణం

- ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక వేధింపులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 03 (జనం సాక్షి) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఉరుసు లోని హరిజనవాడలో కిరాణా షాప్ నడుపతున్న వేల్పుగొండ కుమారస్వామి కుమారుడు కమల్ అలియాస్ అమ్ము అనే అతడు 8 సంవత్సరాల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం కూల్డ్రింక్ తీసుకురమ్మని మంగళవారం సాయంత్రం కిరాణా షాపుకు పంపగా కొద్దిసేపటికి వచ్చిన బాలిక ఏడుస్తూ కనిపించింది.ఏం జరిగిందని తల్లిదండ్రులు అడగగా కిరాణా షాపులో కమల్ ఒక్కడే ఉన్నాడని బాలికకు కూల్ డ్రింక్ ఇవ్వకుండా చాక్లెట్ ఆశ చూపించి బాలికను బెడ్ రూమ్ లోకి తీసుకెళ్లి ముద్దులు పెడుతూ దుస్తులు విప్పుతుండగా అదే సమయంలో కిరాణా షాప్ కు వేరే వ్యక్తి వచ్చాడని, అదే సమయంలో పాపను వదలడంతో తప్పించుకొని వచ్చిందని బాలిక తల్లిదండ్రులు వివరించారు. బాలిక ద్వారా జరిగిన సంఘటన తెలుసుకున్న తల్లిదండ్రులు మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గాంధీనగర్ సర్పంచ్‌గా కేతిరి లక్ష్మారెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



**భీమదేవరపల్లి డిసెంబర్ 03 (జనం సాక్షి) :** మండలంలోని గాంధీనగర్ గ్రామ పంచాయతీలో సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా ఖరారైంది. గ్రామ అభివృద్ధి, ఐక్యత, సామరస్యాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామ ప్రజల ఏకాభిప్రాయంతో కేతిరి లక్ష్మారెడ్డి సర్పంచ్‌గా ఎన్నుకోబడ్డారు. సర్పంచ్ బరిలో నలుగురు అభ్యర్థులు కేతిరి లక్ష్మారెడ్డి, గడ్డం వెంకన్న, తాళ్లపల్లి రవీందర్, తాళ్లపల్లి దయాకర్ నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ, గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాలతో జరిగిన చర్చల అనంతరం అభ్యర్థులైన గడ్డం వెంకన్న, తాళ్లపల్లి రవీందర్, తాళ్లపల్లి దయాకర్‌లు గ్రామాభివృద్ధి కోసమే స్వచ్ఛందంగా తమ నామినేషన్లు ఉపసంహరించు కున్నట్లు తెలిపారు. దీంతో ఎలాంటి పోటీ లేకుండానే కేతిరి లక్ష్మారెడ్డి ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కొత్త సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ, గ్రామాభివృద్ధికి ఆయన కృషి చేస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. ప్రజలు నాపై ఉంచిన విశ్వాసానికి తగ్గట్టు పారదర్శక పంచాయతీ పాలన కోసం కృషి చేస్తానని కేతిరి లక్ష్మారెడ్డి తెలిపారు.

# దివ్యాంగుల సాధికారతే లక్ష్యంగా పనిచేయాలి

- దివ్యాంగులు ఈ సమాజానికి స్ఫూర్తి ప్రదాతలు
- ప్రపంచ వేదికపై మన దేశ కీర్తిని చాటిన ఘనత దివ్యాంగులది
- వారితో ఆత్మీయంగా మెలగాల్సిన బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఉంది
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, డిసెంబర్ 03(జనంసాక్షి) :** దివ్యాంగుల సాధికారతే లక్ష్యంగా పని5చేయాలని, దివ్యాంగులు సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని, ప్రపంచ వేదికపై మన దేశ కీర్తిని చాటిన ఘనత దివ్యాంగులదని, వారితో ఆత్మీయంగా మెలగాల్సిన బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఉందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని "సామాజిక పురోగతిని ముందుకు తీసుకు వెళ్ళడానికి దివ్యాంగులను కలుపుకునే సమాజాన్ని రూపొందించడం అనే నేపథ్యం" తో ములుగు జిల్లా కేంద్రం లోని గిరిజన భవన్‌లో జిల్లా సంక్షేమ అధికారి తుల రవి అధ్యక్షతన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ దివ్యాంగుల హక్కులు, అవకాశాలు, సామాజిక బాధ్యతల పై ముఖ్య సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఈ సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని, ప్రపంచ వేదికపై మన దేశ కీర్తిని చాటిన ఘనత దివ్యాంగులది అన్నారు. వారితో ఆత్మీయంగా మెలగాల్సిన బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఉందని సూచించారు. అనంతరం దివ్యాంగుల సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో తెలియజేసిన పలు డిమాండ్లపై కలెక్టర్ స్పందించించి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. దివ్యాంగులు ఉపాధి హామీలో కూడా నిర్దేశించిన లక్ష్యం మేరకు పనిదినాలు పూర్తిచేయాలని, అలాగే దివ్యాంగులు దివ్యాంగుల స్వయం సహాయ సంఘాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల వడ్డీలేని ఋణాలు వస్తాయి. కాబట్టి వాటిని వినియోగించుకొని ఆర్థిక స్థిరత్వం సాధించాలని దివ్యాంగులకు సూచించారు. ములుగు జిల్లాలో దివ్యాంగుల విద్య, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక భద్రత రంగాల్లో వారికి సేవలు అందించేందుకు మరింత అంకితభావంతో పనిచేయడానికి కట్టుబడి ఉన్నామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జీ మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన ఆవశ్యకతను గుర్తు చేస్తుందని, అందులో భాగంగానే దివ్యాంగుల సామర్థ్యాలు, ప్రతిభను వెలికితీసే విధంగా ఇలాంటి వేదికలను ఏర్పాటుచేయడం దివ్యాంగుల పురోభివృద్ధికి దోహదపడుతుందని ఆకాంక్షించారు. మన సమాజం మరింత సమగ్రతతో, అభివృద్ధి దిశగా సాగాలంటే దివ్యాంగులను ప్రోత్సహించడం, వారి కోసం సౌకర్యాలు కల్పించడం మన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా జిల్లా సంక్షేమాధికారి తుల రవి స్వాగతోపన్యాసం చేస్తూ దివ్యాంగులు దైవంతో సమానం అని, వారు విభిన్న ప్రతిభా పాటవాలు కలిగిన వారని అన్నారు. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధులు మరియు ట్రాన్స్ జెండర్ల సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో ఇప్పటివరకు దివ్యాంగులకు అందించిన సేవలను వివరించారు. దివ్యాంగుల కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని, అర్హులైన దివ్యాంగులు వాటిని వినియోగించుకొని స్వయం సమృద్ధిని సాధించాలని కోరారు. అనంతరం దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇప్పటివరకు చేపట్టిన వివిధ కార్యక్రమాలను వివరించారు.

డిఆర్డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యాంగులు తాము ఒంటరి అన్న భావనలో ఎప్పుడూ ఉండరాదని, సమాజం కూడా వారికి తోడుగా, వారి ఎదుగుదలలో అండగా నిలవాల్సిన అవసరముందని అన్నారు. ప్రభుత్వం కూడా ఈ రోజు కార్యక్రమ ముఖ్య నేపథ్యం అయిన "సామాజిక పురోగతిని ముందుకు తీసుకు వెళ్ళడానికి దివ్యాంగులను కలుపుకునే సమాజాన్ని రూపొందించడం" అనే నినాదం స్ఫూర్తిగా డిఆర్డీఏ ద్వారా దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, తద్వారా దివ్యాంగులు ఐక్యతతో వారి సమస్యలపైన చర్చించుకునే వీలుండడంతో పాటు, ఎవరిపైనా ఆధార పడకుండా ఈ సంఘాల ద్వారా దివ్యాంగులు అంతా కలిసికట్టుగా ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. సందర్భంగా దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దబోయిన శ్రీనివాస్ సంయుక్తంగా మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మ న్యూనతతో కాకుండా ధైర్యంగా లక్ష్యం వైపు అడుగువేయాలని సూచించారు. ఒకప్పుడు సమాజంలో దివ్యాంగులు అంటే చిన్న చూపు ఉండేదని, సామాజిక అభివృద్ధి, అందరూ చదువుకోవడం తో ముఖ్యంగా దివ్యాంగుల్లో తమ హక్కులపై స్పష్టమైన అవగాహన, ఆత్మ గౌరవం పై బలమైన పట్టుదల ఏర్పడిందని అన్నారు. దివ్యాంగుల సంరక్షణ, అభివృద్ధి, సంక్షేమం కొరకు 2016వ సం.లో ప్రత్యేక చట్టాన్ని చేయడం జరిగిందని, ఈ చట్టాన్ని దివ్యాంగులు తప్పక వినియోగించుకోవాలని సూచించారు.

అలాగే దివ్యాంగుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఈ చట్టంపై క్షేత్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, బ్యాంక్ తో సంబంధం లేకుండా ప్రభుత్వం నేరుగా ఋణాలు మంజూరు చేసేలా చూడాలని, దివ్యాంగులకు ప్రత్యేక స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని. సదరం క్యాంపులో దివ్యాంగ కమిటీ సభ్యులను భాగస్వామ్యం చేయాలని వారి డిమాండ్లతో కూడిన వివిధ అంశాలను జిల్ కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళారు. అలాగే దివ్యాంగులలో ఉన్న ప్రతిభను వెలికి తీసేలా జిల్లాలో దివ్యాంగులకు క్రీడలు మరియు ఇతర స్ఫూర్తివంతమైన కార్యక్రమాలు నిర్వహించిన డిడబ్ల్యూఓ, డిఆర్డిఓలకు ధన్యవాదాలు తెలిపారు. ఆ తదుపరి దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమం, వారి ఎదుగుదల కోసం అంతా కట్టుబడి ఉంటామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. తదనంతరం గతవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాల నుండి విచ్చేసి పాల్గొని విజేతలుగా నిలిచిన దివ్యాంగ క్రీడాకారులకు అందరికీ ముఖ్య అతిథి చేతుల మీద మెడల్స్, బహుమతులు మరి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఏ, ఏపిడి లు, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పూజారి మాణిక్యం, కనకం రాజు, సంఘం సభ్యులు, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కార్యక్రమ ఇంచార్జ్ నాగేంద్ర, కొర్ర శంకర్, మహమ్మద్ మీర్జా బేగ్, ఎఫ్ఆర్ఓ గణేష్, డిసిపిఓ ఓంకార్, డిసిపియు, సిహెచ్ఎల్, సఖి విభాగాల సిబ్బంది, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ సమక్షంలో జీపీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



**ములుగు ప్రతినిధి, డిసెంబర్ 03(జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టిఎస్, సాధారణ పరిశీలకుడు (ఎన్నికలు) ప్రశాంత్ కుమార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆయిల్ ఫెడ్, హైదరాబాద్, సమక్షంలో బుదవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 146 గ్రామ పంచాయతీల సర్పంచ్, 1290 వార్డులు స్థానాలకు, 1306 పోలింగ్ స్టేషన్ లలో ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతో పాటు ఓపీఓల ర్యాండమైజేషన్ జరిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డీపీఓ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం జరుగుతుందని ప్రజల్లో భరోసా కలిగించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- మిల్స్ కాలనీ పిఎస్ లో రిసెప్షన్ ప్రాంగణం ప్రారంభం



**వరంగల్ బ్యూరో, డిసెంబర్ 03 (జనం సాక్షి) :** పోలీస్ స్టేషన్ కు వెళ్ళితే న్యాయం జరుగుతుందని ప్రజల్లో భరోసా కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ ప్రాంగణాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం ప్రారంభించారు. ఈ ఉదయం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న సీపీ పోలీస్ అధికారులు పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ శాఖకు గౌరవమర్యాదలు తీసుకవచ్చే విధంగా అధికారులు, సిబ్బంది వ్యవహరించాలని, రౌడీ షీటర్ల పట్ల మేతక ధోరణితో వ్యవహరించవద్దని. ఫిర్యాదులు వచ్చిన తక్షణమే స్పందించాలని. నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని సీపీ అధికారులు, సిబ్బందికి సూచించారు. చివర సీపీ చేతుల మీదుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డిసిపి కవిత, ఏ. ఎస్పీ శుభం ప్రకాష్, ఇన్స్ స్పెక్టర్ రమేష్ తో పాటు ఎస్. ఐ లు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## రాష్ట్రస్థాయి అండర్ 14 క్రికెట్ పోటీలకు ఎంపికైన సెయింట్ థెరిస్సా విద్యార్థి

**ఆత్మకూర్, డిసెంబర్ 03 (జనంసాక్షి):** రాష్ట్రస్థాయిలో అండర్ 14 క్రికెట్ పోటీలకు ఆత్మకూరు మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా పాఠశాల నుండి 8వ తరగతి చదువుతున్న వేల్పుల లెనిన్ తేజ ఎంపికయ్యారని బుధవారం ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జాయిస్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రోస్ మేరీ ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయికి ఎంపికైన లెనిన్ తేజాను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సెయింట్ తెరిస్సా పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు ఆటలలో ప్రావీణ్యం పొందేందుకు నిష్ణాతులైన ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లను నియమించామని తద్వారా అన్ని విధములైన ఆటలలో ప్రతిభ కనబరిచే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయితీ ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




**నిర్మల్ బ్యూరో,డిసెంబర్03 (జనంసాక్షి) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లు కీలకపాత్ర పోషించాలని జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాల్సిందిగా సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల బాధ్యతలు అత్యంత ముఖ్యమని చెప్పారు. ఎన్నికకు ముందు, ఎన్నిక సమయంలో, ఓట్ల లెక్కింపు వరకు అన్ని దశల్లో కరదీపికలో ఉన్న మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అవసరమైతే పై అధికారులను సంప్రదించాలని, త్వరలో రెండో విడత శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, ఎల్డీఎం రామ్ గోపాల్, శిక్షకులు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

## ఆర్కేపీ ఓపెన్ కాస్ట్ ఫేజ్-2 ప్రజాభిప్రాయ సేకరణ

- పాల్గొన్న అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ లక్ష్మణ్ ప్రసాద్.
- పునరావాసం కల్పిస్తేనే ఓసికి సహకరిస్తం
- హెచ్చరించిన ప్రభావిత ప్రాంత కాలనీ వాసులు





**రామకృష్ణాపూర్, డిసెంబర్ 03(జనంసాక్షి):** మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ ఉపరితల గని ఫేజ్-2 ఏర్పాటుకు బుధవారం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఎన్విరాన్మెంటల్ఇంజనీర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఏరియా జిఎం రాధాకృష్ణ ఓసీ ఏర్పాటు అవశ్యకతను తెలుపుతూ పట్టణంలో చేసిన, చేయబోయే అభివృద్ధి పనులను వివరించారు. ప్రస్తుతం సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారిన తరుణంలో మందమర్రి ఏరియాలో నిర్దేశించి లక్ష్యాలను సాధించాలంటే ఓసీ ఏర్పాటు అనేది తప్పనిసరిగా ప్రతిపాదన చేయడం జరిగిందన్నారు. యాంత్రీకరణ పద్ధతిలోనే బొగ్గు, ఓబీ మట్టి వేలీతిత పనులు జరుగుతాయని, పర్యావరణ రక్షణకు పెద్ద పీట వేయడం జరుగుతుందన్నారు. కాలుష్య నివారణ కొరకు పట్టణంలో లక్షల్లో మొక్కలు నాటిన విషయాన్ని గుర్తు చేస్తూ ఓసీ ప్రారంభ దశలోనే మరిన్ని మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. మహిళలు ఆర్థిక ఎదగడానికి, విద్యా, వైద్య, క్రీడారంగంలో రాణించడానికి సింగరేణి నుండి ప్రోత్సాహకం కల్పిస్తున్నామని తెలిపారు. నీటి బిందు, జల బిందు పథకం ద్వారా సమీప ప్రాంతంలోని చెరువుల పూడికతీత, కొత్త చెరువుల నిర్మాణం వంటి పనులను చేపడతామన్నారు. స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, భవిష్యత్తు తరాలకు ఉపరితల గని ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రాజెక్ట్ ముందుకు సాగడానికి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్లు, డ్రైయినేజీ, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించామని పేర్కొన్నారు.

### పునరావాసం కల్పిస్తేనే ఓసికి సహకరిస్తం

ఇదిలా ఉండగా ఉపరితల గని ఫేజ్ 1 లో పట్టణంలో చేస్తామన్న అభివృద్ధి పనుల హామీలు యాజమాన్యం నెరవేర్చలేదని, పలు యూనియన్ సంఘాల నాయకులు, ప్రభావిత కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. 12 సంవత్సరాల క్రితం తలపెట్టిన ఓపెన్ కాస్ట్ తో చెలరేగిన దుమ్ముకు శ్వాస కోశ వ్యాధులతో బాధపడుతున్నామని, కొందరు మృత్యువాత పడ్డ సందర్భాలు ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. బాంబ్ బ్లాస్టింగ్ లతో ఇంటి పైకప్పు రేకులు పగలడం, గోడలు బీటలు పడటం, కొన్ని ఇళ్లు పూర్తిగా ధ్వంసం అయిన అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. ప్రస్తుతం ప్రారంభమయ్యే ఉపరితల గనితో ఆర్కే-4 గడ్డ ప్రాంత వాసులకు ఎలాంటి నష్టం వాటిల్లదని గాలి మాటలు చెబుతున్న అధికారులను వారు హెచ్చరించారు. ఓసి ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, పట్టణ అభివృద్ధిలో తాము బాగాస్వాములవుతామని చెబుతూనే పునరావాసం కింద రెండు వందల గజాల స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## మేడారం జాతరకు విద్యుత్ సరఫరా ఏర్పాట్లు వేగవంతం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్
- జంపన్న వాగు వద్ద మొదటిసారిగా 6 టవర్‌ల నిర్మాణం
- కొత్త 33/11 కెవి నార్లాపూర్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి..
- సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద కవర్డ్ కండక్టర్ ఏర్పాటు
- మేడారం జాతర విద్యుత్ పనుల పురోగతిపై సమగ్ర సమీక్ష



**ములుగు ప్రతినిధి, డిసెంబర్ 03(జనంసాక్షి) :** ప్రతి రెండు సంవత్సరాలకు లక్షలాది భక్తులు తరలివచ్చే మేడారం కుంభమేళా జాతరకు యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఐఏఎస్ తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం ములుగు సర్కిల్ పరిధిలోని మేడారం 33/11 కెవి సబ్‌స్టేషన్ వద్ద అధికారులు, కాంట్రాక్ట్ ఏజెన్సీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశం లో సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి సీఎండీ మాట్లాడుతూ, ఇప్పటివరకు 8 కిలోమీటర్ల మేర కవర్డ్ కండక్టర్ పనులు పూర్తి కాగా, భక్తుల రద్దీ పెరిగే సందర్భంలో విద్యుత్ లోపాలు లేకుండా ఉండేందుకు 70 కొత్త ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 25 కిలోమీటర్ల మేర లైన్ పనులు పూర్తి అయినట్టు వెల్లడించారు. మిగిలిన పనులను ఈ నెల 20వ తేదీలోపు అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాణ్యతలో ఎలాంటి రాజీపడవద్దని, భక్తులకు సమస్యలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. అదనంగాసమ్మక్క సబ్‌స్టేషన్‌లో 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు జరుగుతోందని,విద్యుత్ అంతరాయం లేకుండా ఉండటానికి జంపన్న వాగు వద్ద 6 టవర్ పోల్స్ నిర్మాణం చేపట్టగా, అందులో 4 టవర్లు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. కొత్తగా నిర్మాణంలో ఉన్న 33/11 కెవి నార్లాపూర్ సబ్‌స్టేషన్‌ను ప్రత్యక్షంగా పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఏజెన్సీలను ఆదేశించారు. పస్రా సెక్షన్ ఆఫీస్‌లో నిర్మిస్తున్న కంట్రోల్ రూం, డ్యూటీ రూం పనులను స్వయంగా పర్యవేక్షించారు. అలాగే గట్టమ్మ ఆలయం వద్ద నిర్మిస్తున్న 33/11 కెవి కొత్త సబ్‌స్టేషన్ కూడా జాతర సమయానికి తప్పకుండా ప్రారంభం కావాలని సూచించారు. 'లక్షలాది భక్తులు వచ్చే ఈ జాతరలో ఎటువంటి విద్యుత్ సమస్యలు రాకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని, జాతర విజయవంతం కావడానికి విద్యుత్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. అందువల్ల ప్రతి పని నాణ్యతతో, సమయానికి పూర్తి కావాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు ఎస్ఈ ఆనందం, డిఈ లు సదానందం, పురుషోత్తం, ఏడీఈ లు రాజేష్, వేణుగోపాల్, సందీప్ పాటిల్ ఈఈ సివిల్ వెంకట్ రామ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
04 డిసెంబర్ 2025

# ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలి

- పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించాలి
- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** అభ్యర్థులను నామినేషన్ ఉపసంహరణలో ఎలాంటి ఒత్తిడికి, ప్రలోభాలకు గురి చేయరాదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత కింద నిర్వహించనున్న 8 మండలాల్లోని గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి బుధవారంతో నామినేషన్ల ఉపసంహరణ పూర్తయిందని తెలిపారు. పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించాలని సూచించారు. సర్వీస్ ఓటర్లకు, ఎన్నికల నిర్వహణలో పాల్గొనే అధికారులకు, సపోర్టింగ్ స్టాప్‌కు, ఎన్నికలలో ఉపయోగించే వాహన డ్రైవర్లకు ఫారం 14 ద్వారా పోస్టల్ బ్యాలెట్ జారీ చేయాలని అన్నారు. వారి ఓటు ఉన్న సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ నందు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పంపిణి ప్రక్రియ సాఫీగా, పారదర్శకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం స్ట్రాంగ్ రూమ్ నుండి పోస్టల్ బ్యాలెట్ బాక్సులను పోలీస్ స్ట్రాంగ్ రూమ్ నుండి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ కు పోలీస్ బందోబస్తుతో తీసుకెళ్లాలని అన్నారు. అక్కడ గ్రామపంచాయతీల వారీగా బ్యాలెట్ బాక్స్‌లను ఏర్పాటు చేసి అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మరలా సాయంత్రం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కి పోలీస్ ఎస్కార్ట్‌తో తరలించి భద్రపర్చాలని సూచించారు. ఈ ప్రక్రియను మొత్తం వీడియో రికార్డ్ చేయాలని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఎలా ఉపయోగించాలో ఎంపీడీవో కార్యాలయంలోని ఫెసిలిటేషన్ సెంటర్ నందు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని అన్నారు. మొదటి దశ లో జరిగే గ్రామ పంచాయతీ సర్పంచ్ లకు, వార్డు సభ్యులకు నామినేషన్ల ఉపసంహరణ పూర్తవ్వడంతో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించాలని అన్నారు. పోటీ చేసే అభ్యర్థులు ఆరుగురు కంటే ఎక్కువగా ఉంటే బ్యాలెట్ పేపర్లు ప్రింట్ చేయాల్సింది కాబట్టి తగిన ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. పోటీ చేసే అభ్యర్థుల జాబితా ఖరారు అయిన తర్వాత అభ్యర్థులతో ఆర్‌ఓలు సమావేశం ఏర్పాటు చేసి, ఎన్నికల ప్రవర్తన నియమావళి మార్గదర్శకాలు, ఎన్నికల ఖర్చుల నిర్వహణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మొదటి విడత, రెండో విడత నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగిందని ఇలాగే అధికారులు సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వీడియో కాన్ఫిరెన్స్ లో ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జడ్పీ సిఈఓ వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి శ్రీనివాస్, డిఎల్పీఓ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్



**కొండమల్లేపల్లి, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని బుధవారం వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గడువులోపే నామినేషన్లు స్వీకరించాలని, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహిస్తూ పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ పక్రియను సజావుగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్ కేంద్రాలకు వచ్చిన వారిని మాత్రమే అనుమతించాలని నామినేషన్ పత్రాలతో పాటు గెజిటెడ్ డిక్లరేషన్ సమర్పించినా అంగీకరించాలన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థులు సమన్వయంతో అధికారులకు సహకరించాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్ నరేందర్, ఎంపిడిఓ స్వర్ణలత, గ్రామపంచాయతీ సెక్రటరీ డాకు నాయక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దిర్శించర్ల గ్రామంలో ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ నర్సింహా



**నేరేడుచర్ల, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** మూడవ విడతలో నామినేషన్లు జరుగుతున్న నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ నర్సింహా ఐపీఎస్ , కోదాడ డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ చరమంద రాజు లతో కలిసి పరిశీలించారు. 100 మీటర్ల పరిధి ఆంక్షలు పటిష్టంగా అమలు చేయాలని అనుమతులేని వ్యక్తులు నామినేషన్ కేంద్రంలోకి రాకుండా జాగ్రత్త పడాలని ఎన్నికల అధికారి సూచించిన నియమ నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ. మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయడానికి జిల్లా పోలీస్ శాఖ పటిష్టంగా పనిచేస్తుందని, ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను 5 లక్షల వరకు ముందస్తు బైండోవర్ చేస్తున్నామని అన్నారు. మూడు విడతల్లో 1500 మంది సిబ్బంది కల్పిస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో 47 సమస్యాత్మక గ్రామాలను, రెండవ విడతలో 65 సమస్యాత్మక గ్రామాలను, మూడవ విడతలు 58 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని ప్రతి గ్రామంలో ప్రతిష్ట భద్రతను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల ఎస్సై రవీందర్ నాయక్, తహసిల్దార్ సైదులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## కాశివారి గూడెంలో బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి ఏకగ్రీవ ఎన్నిక



**అనుముల, డిసెంబర్ 3 (జనం సాక్షి) :** అనుముల మండలం కాశివారి గూడెం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిగా పేరును ఖరారు చేసిన షేక్ కరీం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను నాగార్జునసాగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్, రాష్ట్ర మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవెల్లి విజేందర్ రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ చెదురుబెల్లి రాములు, సురభి రాంబాబుతో పాటు కాశివారి గూడెం గ్రామస్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా పోలీసు సిబ్బంది పనిచేయాలి



**ఖమ్మం రూరల్, డిసెంబర్ 3 (జనం సాక్షి) :** జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంతో కూడిన నిష్పక్షపాత ఎన్నికలు జరిగేలా సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల బందోబస్తు విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న పోలీస్ సిబ్బంది ఎన్నికల విధులు, విధివిధానాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై ఖమ్మం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కిసాన్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి పనిచేయాలన్నారు. ఎన్నికల నియమావళిపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకుని, ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఘర్షణ వాతావరణం లేకుండా పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని, బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలను నియంత్రించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా అర్డర్ ప్రసాద్ రావు, ఏసీపీ తిరుపతి రెడ్డి, సిఐలు రాజు, మురళి, సంజీవ్, తిరుపతి, రూరల్ డివిజన్ ఎస్సైలు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటిన సామజిక కార్యకర్త మొయిన్ పాషా




**దేవరకొండ, డిసెంబర్ 3 (జనం సాక్షి) :** దేవరకొండ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త, సయ్యద్ మొయిన్ పాషా తన నిజాయితీని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే మొయిన్ పాషా కు చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు ఎకౌంట్లో ఒక వ్యక్తి ఫోన్ పే ద్వారా ఇరవై ఐదు వేల రూపాయలు జమ అయ్యాయి. ఇది గమనించి స్థానిక సిఐ వెంకట్ రెడ్డికు సమాచారం అందించారు. వెంటనే సిఐ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కి చెందిన మొహమ్మద్ పర్వేజ్ అహ్మద్ గా గుర్తించి అతని అకౌంట్ కు జమ చేశారు. అనంతరం సామాజిక కార్యకర్త సయ్యద్ మొయిన్ పాషా ను సిఐ, అభినందించారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు



**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 3 (జనం సాక్షి) :** మండలంలోని ధర్మారెడ్డిపల్లి బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాసుల సత్తయ్య గౌడ్ బుధవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి స్వయంగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సత్తయ్య గౌడ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుర్వి శ్రీనివాస్ గౌడ్, పల్చం సత్యం గౌడ్, పల్చం లింగం గౌడ్, పడమటి శ్రీధర్ గౌడ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## బోనకల్ కాంగ్రెస్‌లో భారీ చేరిక

- సొంతగూటికి "మాజీ సొసైటీ అధ్యక్షుడు"
- గతంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం



**బోనకల్, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** బోనకల్ మండల కేంద్రమైన బోనకల్ గ్రామానికి చెందిన యార్లగడ్డ చిన్న నరసింహ గౌడ్ కాంగ్రెస్ కండువాను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క సమక్షంలో బోనకల్ మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సొంతగూటికి చేరారు. గతంలో సుదీర్ఘకాలం కాంగ్రెస్ లో పనిచేసిన యార్లగడ్డ చిన్న నరసింహ పార్టీలో చురుకుగా పాల్గొంటూ భట్టి విక్రమార్కకు బోనకల్‌లో ప్రధాన అనుచరులుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, గాలి దుర్గారావు, పాసంగులపాటి కోటేశ్వరరావు, చావా వెంకటేశ్వరరావు, పోటు వెంకటేశ్వర్లు, యార్లగడ్డ కృష్ణయ్య, మోర్ల మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## కూలిన మందలపల్లి హైస్కూల్ వంట షెడ్డు

- ప్రాణాపాయం నుండి బయట పడ్డ విద్యార్థులు, వంట మనుషులు..
- చొరవ తీసుకొని స్థానిక ఎమ్మెల్యే, ఎండిఓ



**దమ్మపేట డిసెంబర్ 3 (జనం సాక్షి) :** దమ్మపేట మండలం మందలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ నందుగల వంటషెడ్ నిర్మాణం పూర్తి కానందున, తాత్కాలిక సైకిల్ షెడ్ నందు ఎన్నో సంవత్సరాల నుండి వంట షెడ్ గా వాడుతున్నారు. సరుకులు, వంట సామాన్లు తరగతి గదుల్లో భద్రపరుస్తున్నప్పటికీ వంట మాత్రం తాత్కాలిక షెడ్డులో నిర్వహిస్తున్నారు. వర్షం వచ్చినప్పుడు అనేక ఇబ్బందులు పడుతూ వంట వండి విద్యార్థులకు అందజేస్తున్నారు. ఇట్టి పరిస్థితులను స్థానిక ఎమ్మెల్యేకు, ఎండిఓ కు, ఎన్నోసార్లు విన్నవించుకున్న మా గోడు వినిపించుకున్న వారే లేరని, కాలం చెల్లిన సైకిల్ షెడ్ పై కోతుల దూకుతూ, వర్షాలకు తడవడం వలన వంట చేసే క్రమంలో అకస్మాత్తుగా కూలిపోవడం వల్ల ప్రాణాపాయ స్థితిలో నుండి తృటిలో వంట మనుషులు, విద్యార్థులు తప్పించుకున్నారు. ప్రాణం నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇకనైనా స్థానిక అధికారులు వెంటనే స్పందించి త్వరితగతిన వంట షెడ్డు నిర్మించవలసిందిగా కోరుతున్నారు.

## పరిపాలనలో పారదర్శకత అవసరం

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** లంచం అడగడం, తీసుకోవడం నేరమని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. ఈ నెల 3 నుండి 9 వరకు నిర్వహించనున్న తెలంగాణ ఏసీబీ వారోత్సవాలలో భాగంగా బుధవారం కలెక్టరేట్ లో లంచం నేరమని తెలిపేలా రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. పరిపాలనలో పారదర్శకత అవసరమని, ఎవరైనా ప్రభుత్వ అధికారి, ఉద్యోగి లంచం అడిగితే వెంటనే 1064 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి తెలుపాలన్నారు. కాల్ చేసిన వారి పేరును గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. అవినీతిని అరికట్టడంలో ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. అవినీతిని అరికట్టడంలో భాగంగా సోషల్ మీడియా ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. వాట్సాప్ నెంబర్ 9440 446106, ఫేస్ బుక్ ఏసీబీ తెలంగాణ, ఎక్స్ పాత ట్విట్టర్ ఏ తెలంగాణ ఏసీబీ ద్వారా, పోస్టర్ లో ముద్రించిన క్యూ ఆర్ కోడ్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జడ్పీ సిఈఓ వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎల్పిఓ నారాయణ రెడ్డి, ఏఓ సుదర్శన్ రెడ్డి, ఇన్స్పెక్టర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలగిరి సాగర్‌లో ఎలక్షన్ స్క్రూటినీ

- కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ



**తిరుమలగిరి (సాగర్), డిసెంబర్ 3 (జనంసాక్షి) :** నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ తో కలిసి తిరుమలగిరి సాగర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించి, ఎలక్షన్ స్క్రూటినీ ప్రక్రియను పరిశీలించారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాల పరిశీలన ప్రక్రియ ,ఎన్నికల సంబంధిత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను ఆమె ఎన్ని నామినేషన్లు వచ్చాయి , ఎన్ని నామినేషన్ పత్రాలు రిజెక్ట్ అయ్యాయి. పత్రాలలో సంతకాలు తో పాటు పూర్తి వివరాలు నింపారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు ముఖ్య సూచనలు చేశారు. ఎలక్షన్ స్క్రూటినీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని, రికార్డులు ఖచ్చితంగా ఉంచాలని ఆదేశించారు. మండల స్థాయిలో పనులు వేగవంతం చేసి, ఎన్నికల ప్రక్రియ సక్రమంగా జరగాలని స్పష్టం చేశారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, లోపాలు ఉంటే తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, పంచాయతీ అధికారి వెంకటయ్య , ఇన్చార్జి తహసిల్దార్ అనిల్ కుమార్, ఇన్చార్జి ఎంపీడీవో బిక్షం రాజు, మండల విద్యాధికారి కే శ్రీనివాస్ తదితరున్నారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి
- రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో హెల్త్ కార్డులు అమలయ్యా చర్యలు తీసుకోవాలి
- టీయూడబ్ల్యూజే యూనియన్ జిల్లా అధ్యక్షులు కోలనాగేశ్వరరావు



**హుజూర్‌నగర్, డిసెంబర్ 3 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇల్లు స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోల నాగేశ్వరరావు కోరారు. బుధవారం హుజూర్ నగర్ పట్టణంలో చలో హైదరాబాద్ కార్యక్రమం సందర్భంగా మాట్లాడారు. అనంతరం హైదరాబాదులోని తెలంగాణ సమాచార శాఖ భవన ఎదుట ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు కోల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ చరిత్రలో రాష్ట్ర ఏర్పాటులో తెలంగాణలోని జర్నలిస్టులందరూ ఎంతో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. గత బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో జర్నలిస్టులకు అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జర్నలిస్టులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. గత రెండేళ్లుగా జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇండ్ల స్థలాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరిలో జర్నలిస్టులకు ప్రత్యేక కేటాయింపులు చేయాలని సూచించిన నేటి వరకు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రైవేటు కార్పోరేట్ హాస్పిటల్లో హెల్త్ కార్డులు అమలు కావడం లేదన్నారు. అధికంగా వెనుకబడిన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ ద్వారా కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని 33 జిల్లాలలో అన్ని మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా హెల్త్ కార్డులు సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్ స్కూళ్లలో జర్నలిస్టుల కుటుంబాలకు 50% రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు పిల్లలమర్రి శ్రీనివాసరావు, జానీ పాషా, బసవోజు శ్రీనివాస చారి, దేవరం రామిరెడ్డి, ఆర్.పి గౌడు, శేషం రాజు, నాగుల్ మీరా, రామకృష్ణ, అంజయ్య, వెంకటరెడ్డి, ఇందిరాల రామకృష్ణ పాల్గొన్నారు.







# ప్రభుత్వ బ్యాంకులో వాటా విక్రయం

**న్యూఢిల్లీ:**పీఎస్‌యూ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం)లో ప్రభుత్వం 6 శాతం వాటా విక్రయించనుంది. మంగళవారం(2న) ప్రారంభమైన ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)కు భారీ డిమాండ్ కనిపించిన నేపథ్యంలో గ్రీన్ షూ ఆప్షన్‌కింద ప్రభుత్వం 6 శాతం వాటా విక్రయించాలని నిర్ణయించింది.ఇందుకు ఫ్లోర్ ధర షేరుకి రూ. 54కాగా.. సంస్థాగత ఇన్వెస్టర్లకు ప్రారంభమైన ఆఫర్ డిసెంబర్ 3న రిటైలర్లకు అందుబాటులోకి రానుంది.ఓఎఫ్ఎస్‌లో భాగంగా ప్రభుత్వం బ్యాంక్‌లో తొలుత 5 % వాటాకు సమానమైన 38,454,77,748 షేర్లను విక్రయానికి ఉంచింది. అయితే ఆఫర్ తొలి రోజునే 400 శాతం సబ్‌స్క్రిప్షన్‌ను సాధించింది. దీంతో మరో 7,69,15,549 షేర్లను(1 శాతం వాటా) సైతం అమ్మివేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎక్స్‌లో పోస్ట్ ద్వారా దీపమ్ కార్యదర్శి అరునిష్ చావ్లా వెల్లడించారు. వెరసి ప్రభుత్వం 6 శాతం వాటాకు సమానమైన 46.14 కోట్లకుపైగా షేర్లను విక్రయించనుంది.



రూ. 2,492 కోట్లు

ఫ్లోర్ ధర ప్రకారం బీవోఎంలో వాటా విక్రయం ద్వారా ప్రభుత్వానికి రూ. 2,492 కోట్లు అందనుంది. సోమవారం ముగింపు ధర రూ. 57.66తో పోలిస్తే 6.3% డిస్కౌంట్‌లో ఫ్లోర్ ధరను ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం బ్యాంక్‌లో ప్రభుత్వానికి 79.6% వాటా ఉంది. తాజా వాటా విక్రయం ద్వారా బ్యాంక్‌లో ప్రభుత్వ వాటా 75% దిగువకు దిగిరావడంతోపాటు.. పబ్లిక్‌కు కనీసం 25% వాటా నిబంధన అమలుకు వీలు చిక్కనుంది. కాగా.. మరో 4 పీఎస్‌యూ బ్యాంకులలో సైతం ప్రభుత్వం గడువులోగా మైనారిటీ వాటాను పబ్లిక్‌కు ఆఫర్ చేయవలసి ఉంది. ఈ జాబితాలో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్( ప్రభుత్వ వాటా 94.6 శాతం), పంజాబ్- సింద్ బ్యాంక్(93.9 శాతం), యుకో బ్యాంక్(91 శాతం), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(89.3 శాతం) చేరాయి.

# లిస్టెడ్ కంపెనీల్లో అంతా మిస్టర్‌లేనా!

## • మహిళలకు దక్కని ప్రాధాన్యం

**న్యూఢిల్లీ:**కంపెనీల సిబ్బందిలో మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా లిస్టెడ్ సంస్థల్లో వారి వాటా అంతంత మాత్రంగానే ఉంటోంది.ఎన్ఎస్ఈలో లిస్టయిన దాదాపు సగం కంపెనీల్లో (52 శాతం) ఉద్యోగినుల సంఖ్య 10 శాతం లోపే ఉంది. స్వచ్ఛంద సంస్థ ఉద్దైతీ విడుదల చేసిన 'సీజీజీ డ్యాష్‌బోర్డ్ 2024-25' నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి.ఎన్ఎస్ఈలో లిస్టయిన 1,386 కంపెనీల బాధ్యతాయుత వ్యాపారం, పర్యావరణహిత కార్యకలాపాల నివేదికలు (బీఆర్ఎస్ఆర్), సంస్థల వార్షిక నివేదికల ఆధారంగా ఈ రిపోర్ట్ రూపొందింది. వివిధ రంగాలవ్యాప్తంగా మహిళలు .. పురుషుల ప్రాతినిధ్యం, జీతాల్లో అంతరాలు, నాయకత్వ స్థానాల్లో సమ్మిళితత్వం, అట్రిషన్ (ఉద్యోగుల వలసలు) తదితర అంశాలను ఇందులో పరిశీలించారు.'సిబ్బందిలో మహిళల ప్రాతినిధ్యం గత అయిదేళ్లుగా స్థిరంగా పెరుగుతోంది. అయినప్పటికీ ఈ ఏడాది గణాంకాలు చూస్తుంటే అది అంత వేగంగా పెరగడం లేదని తెలుస్తుంది. ఎన్ఎస్ఈలో లిస్టయిన 2,615 సంస్థల్లో కేవలం సగం మాత్రమే లింగ ప్రాతినిధ్య డేటాను ఇస్తున్నాయి కాబట్టి మన ముందు ప్రస్తుతం ఉన్నది పాక్షిక ముఖ చిత్రమే' అని ఉద్దైతీ వ్యవస్థాపక సీఈవో పూజా శర్మ



గోయల్ తెలిపారు.

రిపోర్ట్‌లో మరిన్ని విశేషాలు..

మొత్తం ఉద్యోగుల సంఖ్య 6 శాతం పెరగ్గా, మహిళా ఉద్యోగుల సంఖ్య 7 శాతం పెరిగింది. మరింత మంది మహిళలు ఉద్యోగాల్లో చేరుతున్నప్పటికీ నిర్దేశిత లక్ష్యాల స్థాయిలో వారి వాటా పెరగడం లేదు.ఆసుపత్రులు, ప్రయోగశాలల్లో మహిళల ప్రాతినిధ్యం 45 శాతం నుంచి 48 శాతానికి, వినియోగదారుల సర్వీసుల్లో 30 % నుంచి 34 శాతానికి పెరగ్గా, ఐటీ (34 శాతం), బ్యాంకింగ్ (26 శాతం)లో పెద్దగా మార్పు నమోదు కాలేదు.మహిళలు, పురుషుల జీతాల మధ్య వ్యత్యాసం 2024, 2025 ఆర్థిక సంవత్సరాల్లో 6.7 శాతం నుంచి 3.3 శాతానికి తగ్గింది. అయితే, మహిళల ప్రాతినిధ్యం ఎక్కువే ఉన్నప్పటికీ టెక్స్‌టైల్స్ (30.4 శాతం), డైవర్సిఫైడ్ (28.5 శాతం), మెటల్స్ .. మైనింగ్ (17 శాతం)లో మాత్రం వ్యత్యాసరం ఎక్కువగానే ఉంటుంది. మరోవైపు పురుషాధిక్యం ఎక్కువగా ఉండే కొన్ని రంగాల్లో జీతాల మధ్య వ్యత్యాసం రివర్స్‌లో ఉంది. పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువగా ఆర్జిస్తున్న రంగాల్లో ఫార్మా (8 శాతం), కన్జూమర్ డ్యూరబుల్స్ (7 శాతం) ఉన్నాయి.లైంగిక వేధింపుల నివారణ నిబంధనలు (పీవోఎస్‌హెచ్) గురించి అవగాహన పెరుగుతోంది. పని ప్రదేశాల్లో సహోద్యోగుల తప్పుడు ప్రవర్తనపై ఫిర్యాదు చేసేందుకు మహిళలు ధైర్యంగా ముందుకొస్తున్నారు. లైంగిక వేధింపు ఫిర్యాదులు 16 శాతం పెరగడం ఇందుకు నిదర్శనం. అయితే, ఫిర్యాదుల స్థాయిలో పరిష్కారాల వేగం ఉండటం లేదు. పెండింగ్ కేసులు 28 శాతం దీన్ని సూచిస్తుంది.ఈ నేపథ్యంలో భద్రత, సమాన అవకాశాలు, వర్క్‌ప్లేస్ డిజైన్ విషయాల్లో వ్యవస్థాగతంగా ఉన్న అవరోధాలను అధిగమించే దిశగా ఇటీవలి లేబర్ కోడ్ ముందడుగులాంటిది. వీటిని మార్చుకోగలిగి, స్మార్ట్ విధానాలను అమలు చేస్తే, ప్రభుత్వం..కంపెనీలు చొరవ చూపితే మరింత మంది మహిళలు ఆర్థిక కార్యకలాపాల్లో పాలుపంచుకునే ప్రక్రియ వేగవంతం అవుతుంది.

# నష్టాల్లో సూచీలు..

**ముంబై:**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గడిచిన సెషన్‌తో పోలిస్తే బుధవారం నష్టాల్లో కదలాడుతున్నాయి. ఈరోజు ఉదయం 09:45 సమయానికి నిఫ్ 90.35 పాయింట్లు తగ్గి 25,941.85 కు చేరింది.సెన్సెక్స్ 241.18 పాయింట్లు నష్టపోయి 84,897.09 వద్ద ట్రేడవుతోంది. హెచ్‌యూఎల్, టైటాన్, టాటా మోటార్స్ పీవీ, ఎన్టీపీసీ, బీఈఎల్, ట్రెంట్, బజాజ్ ఫిన్సర్వ్, కోటక్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతి సుజుకీ, ఎల్ అండ్ టీ, పవర్ గ్రిడ్, ఐటీసీ నేతృత్వంలోని 30 సెన్సెక్స్ స్టాక్స్ ఈ రోజు నష్టాల్లో ఉన్నాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, ఎటర్నల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్సీఎల్ టెక్, యాక్సిస్ బ్యాంక్, టెక్ ఎం, అదానీ పోర్ట్స్ ఆదుకునే ప్రయత్నం చేస్తున్నాయి. రంగాలవారీగా నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.02 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.08 శాతం పెరిగాయి. నిఫ్టీ ఐటీ, నిఫ్టీ ఫార్మా సూచీలు వరుసగా 0.7 శాతం, 0.3 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 0.6 శాతం క్షీణించింది.



# రూపాయి ఎందుకింత పతనం?

## • తగ్గితే ఏర్పడే పరిణామాలు ఏంటి?

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత కరెన్సీ రూపాయి విలువ అమెరికా డాలర్‌తో పోలిస్తే చరిత్రలో ఎప్పుడూ లేనంతగా పడిపోయి రూ.90 మార్క్‌ను దాటి 90.02 వద్ద ముగిసింది. బ్యాంకులు అధిక స్థాయిలో యూఎస్ డాలర్లను కొనుగోలు చేయడం, విదేశీ సంస్థాగత పెట్టుబడుల అవుట్ ఫ్లోలు కొనసా గుతుండటం వంటివి రూపాయి పతనానికి కారణాలుగా నిలుస్తున్నప్పటికీ రూపాయి విలువ తగ్గడం వల్ల ఎలాంటి పరిణామాలు ఉంటాయన్నది ఈ కథనంలో చూద్దాం..



**దిగుమతులు ఖరీదవుతాయి:**క్రూడ్ ఆయిల్, బంగారం, ఎలక్ట్రానిక్స్, మెడికల్ పరికరాలు వంటి దిగుమతి వస్తువుల ధరలు పెరుగుతాయి. దీని ఫలితంగా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరుగుతాయి. ఇతర ఉత్పత్తుల రవాణా ఖర్చులు కూడా పెరుగుతాయి.

ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం

దిగుమతులు ఖరీదవడం వల్ల, ఆ ఖర్చులు వినియోగదారులపై పడతాయి. దీని కారణంగా సాధారణ ప్రజలు కొనుగోలు చేసే వస్తువుల ధరలు పెరుగుతాయి.

**ప్రయాణ ఖర్చులు పెరుగుతాయి:**విదేశాలకు వెళ్ళేవారికి ఖర్చులు అధికమవుతాయి. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజులు, జీవన వ్యయం ఇంకా ఖరీదవుతుంది.

ఇంధనం ధరలు పెరిగి, ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి

భారత్ మొత్తం క్రూడ్ ఆయిల్‌లో ఎక్కువ భాగం దిగుమతి చేసుకుంటుంది. ఆయిల్ ధర పెరగడంతో రవాణా, తయారీ, వ్యవసాయ ఖర్చులు కూడా పెరుగుతాయి.

విదేశీ రుణాల వ్యయం పెరుగుతుంది

సంస్థలు లేదా ప్రభుత్వం విదేశాల్లో తీసుకున్న రుణాలు రూపాయి బలహీనత వల్ల ఖరీదవుతాయి. వడ్డీ చెల్లింపులు పెరిగి, ఆర్థిక భారంగా మారుతాయి.

విదేశీ పెట్టుబడులపై ప్రభావం

రూపాయి పడిపోతే కొందరు విదేశీ పెట్టుబడిదారులు పెట్టుబడులు ఉపసంహరించుకునే అవకాశం ఉంది. స్టాక్ మార్కెట్లు కూడా కొంత ఒడిదుడుకులకు గురవుతాయి.

పెట్టుబడిదారుల విశ్వాసంపై ప్రభావం

ఒక దేశ కరెన్సీ చాలా బలహీనపడితే, గ్లోబల్ మార్కెట్లలో దేశ ఆర్థిక స్థిరత్వంపై సందేహాలు వచ్చి పెట్టుబడులు తగ్గవచ్చు.

ఎగుమతిదారులకు కొంత లాభం

రూపాయి బలహీనపడితే, భారతదేశం నుండి వస్తువులు కొనుగోలు చేసే విదేశీ క్లయింట్లకు అవి తక్కువ ఖర్చుతో అందుతాయి.టెక్స్‌టైల్, ఐటీ సేవలు, ఔషధాలు వంటి రంగాలకు కొంత ప్రయోజనం.

## గుడ్ల ధరలు

హైదరాబాద్ ₹ 6.45

వరంగల్ ₹ 6.47

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 1,19,700 (22 క్యారెట్లు)

₹ 1,30,580 (24 క్యారెట్లు)

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,01,000

# ఐబొమ్మ రవిని సృష్టించింది మీరే..

## • అతడిని అరెస్ట్ చేసే నైతిక హక్కు లేదు
## • ఏపీలో సినిమా టికెట్ల పెంపుపై సీపీఐ నారాయణ ఫైర్

**అమరావతి:**నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'అఖండ 2:తాండవం'. అన్నీ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.ఈ నేపథ్యంలో సినిమా టికెట్ల రేట్లను భారీగా పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మల్టీప్లెక్స్‌లో రూ. 100, సింగిల్ స్క్రీన్లలో రూ. 75 పెంచుకునేందుకు వెలుసుబాటు కల్పిస్తూ ఉత్తర్వ్యులు జారీ చేసింది. దీంతో పాటు ఈ నెల 4న రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్యలో ప్రీమియర్స్‌కి కూడా అనుమతి ఇస్తూ.. టికెట్ ధరను రూ. 600గా నిర్ణయించింది.పెంచిన ధరలు పది రోజుల పాటు అమల్లో ఉంటాయి.ఈ విధంగా టికెట్ల రేట్లను పెంచడం పట్ల పలువురు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు నచ్చినట్లుగా టికెట్ల రేట్లను పెంచి సామాన్యులపై భారం వేస్తున్నారని మండిపడ్డారు. తాజాగా సీపీఐ నారాయణ(%జూ× చ్శుతీశుఝుఅుు% ) కూడా అఖండ 2 టికెట్ల రేట్ల పెంపుపై స్పందించారు. వందల కోట్లలో సినిమాలు తీసి.. ఆ భారం సామాన్య ప్రజలపై వేయడం కరెక్ట్ కాదన్నారు. ఈ మేరకు ఆయన ఓ వీడియోని విడుదల చేశారు. అఖండ 2( %ూాెప్తుఅుు% 2 ) చిత్రానికి టికెట్ల రేట్లను పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇలాంటి ప్రకటన వల్లే కదా ఐబొమ్మ రవిలాంటి వాళ్లు పుట్టుకొచ్చేంది. కోట్ల కోట్ల రూపాయలను ఖర్చు చేసి సినిమా తీసి.. ఆ భారమంతా ప్రజలపై వేస్తాననడం ఎంత వరకు న్యాయం? ఇలాంటి విలువలైన సినిమాలను చూడడానికి ఇష్టపడని ప్రజానీకం.. ఐబొమ్మ రవిలాంటి వాళ్లు చేసిన పైరసీని ఎంకరేజ్ చేనస్తున్నారు. మీరే కదా రవిని సృష్టిస్తున్నారు. ఈ రాష్ట్రానికి ఐబొమ్మ రవిని అరెస్ట్ చేసే నైతిక హక్కులేదు.

# బహుజనులకు బహిరంగంగానే మోదీ ద్రోహం

ప్రశ్న అడిగితే వారి ఇచ్చిన సమాధానం షాకింగ్‌గా ఉంది. దీనిపై ఒక నిర్దిష్ట ఫ్రేమ్‌వర్క్, ఒక నిర్దిష్ట కాలపరిమితి ప్రణాళిక, ఒక పార్లమెంట్‌లో చర్చ, ప్రజల అభిప్రాయం సేకరించలేదు. కనీసం కులగణనను విజయవంతంగా నిర్వహించిన రాష్ట్రాల నుంచి వివరాలు అడిగి తెలుసుకందామన్న ఆలోచన లేదు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశంలోని బహుజనులకు బహిరంగంగానే ద్రోహం చేస్తున్నారు." అని రాహుల్ గాంధీ అన్నారు.అంతకుముందు జనగణన వివరాలు, కాల వ్యవధి, ప్రశావళి సహా నిబంధనలు చెప్పాలంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్?సభలో కేంద్రాన్ని ప్రశ్నించారు. ముసాయిదా ప్రశ్నలు ప్రచురించి వీటిపై ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి సలహాలు అడిగే ప్రతిపాదన ప్రభుత్వానికి ఉందా అని అడిగారు. దీంతోపాటు వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన కులగణన సర్వేల నుంచి సూచనలు తీసుకుంటారా అని చెప్పాలని కోరారు.

# పాలస్తీనాలో బహిరంగ మరణశిక్ష

## వేలమంది సమక్షంలో, 13 ఏళ్ల బాలుడితో బహిరంగ మరణశిక్ష



కాబూల్:ఆఫ్ఘనిస్థాన్‌లో బహిరంగ మరణ శిక్షలు, కొరడా దెబ్బలు లాంటి అనాగరిక శిక్షలు సర్వ సాధారణంగా. తాజాగా ఆటవిక న్యాయానికి సంబంధించిన మరో అరాచక సంఘటన ఒకటి ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది.ఖోస్ట్ ప్రావిన్స్‌లో మంగళవారం తాలిబన్లు తొమ్మిది మంది పిల్లలతో సహా ఒకే కుటుంబంలోని 13 మంది సభ్యులను హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నవ్యక్తికి తాలిబన్లు బహిరంగంగా మరణశిక్షను అమలు చేశారు. కిక్కిరిసిన స్టేడియంలో ఈ శిక్ష అమలు చేయడం సంచలనం రేపింది.ఈ ఘటనలో తాలిబన్లు వీడియోలు, ఫోటోలను నిషేధించినప్పటికీ దీనికి సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్‌గా మారింది. వేలాదిమంది సమక్షంలో మతపరమైన నినాదాల మధ్య, కోస్ట్ ప్రావిన్స్‌లోని స్టేడియంలో 80 వేల మంది చూస్తుండగా శిక్ష అమలు చేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. అమానవీయం అంటూ తాలిబన్ల చర్యను ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండించింది. అలాగే అంతర్జాతీయంగా మానవ హక్కుల సంఘాలు తాలిబన్ల వైఖరిని తప్పుబట్టాయి.

**అసలు ఏం జరిగింది?**

తాలిబన్ అధికారులు ఉరితీసిన వ్యక్తిని మంగళ్‌గా గుర్తించారు. సుమారు పది నెలల క్రితం మంగళ్ స్థానిక నివాసి అబ్దుల్ రెహమాన్‌తోపాటు, 12 మంది కుటుంబ సభ్యులను చంపినందుకు దోషిగా నిర్ధారించబడ్డాడు. హతుల్లో తొమ్మిది మంది పిల్లలు కూడా ఉన్నారు. తాలిబన్ ప్రకారం, ఈ శిక్షను మొదటి దశ, అప్పీల్ కోర్టులు , సుప్రీంకోర్టు సమర్థించాయి. దీంతో మంగళ్‌కు తాలిబన్లు మరణశిక్షను అమలు చేశారు. ఆఫ్ఘన్ మీడియా నివేదిక ప్రకారం తాలిబన్ల క్విసాస్ (ప్రతీకారం) కింద, నేరస్థుడిని క్షమించే అవకాశాన్ని బాలుడు నిరాకరించాడంతో స్వయంగా బాధితురాలి కొడుకు, తన కుటుంబ సభ్యులను కోల్పోయిన 13 ఏళ్ల బాలుడు చేత ఈ ఉరిశిక్షను అమలు చేయించారు.ఈ అమానవీయ ఘనటపై ఐక్యరాజ్యసమితి తీవ్రంగా స్పందించింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని మానవ హక్కుల ప్రత్యేక ప్రతినిధి రిచర్డ్ బెన్నెట్ ఈ చర్యను క్రూరమైన శిక్షగా అభివర్ణించారు. ఇది అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, ఇలాంటి వాటిని తక్షణమే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు.

# దర్శకుడు దేవదాస్ కన్నుమూత

## భార్య, కూతురితో తెగదెంపులు. చివరిరోజుల్లో ఒంటరిగా..

**చెన్నై:**దివంగత నటి దేవిక మాజీ భర్త, దర్శకుడు దేవదాస్ (88) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆదివారం (నవంబర్ 30) రాత్రి చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు.సినిమా ఇండస్ట్రీలో ఓ వెలుగు వెలిగిన ఈయన తర్వాతి కాలంలో మాత్రం కనిపించకుండా పోయారు. చాలాకాలంగా ఒంటరిగానే బతుకీడుస్తూ వచ్చారు. ఆయన వ్యక్తిగత జీవితంపై ఈ ప్రత్యేక కథనం.. సినీ నిర్మాత ఎస్ఎంఎస్ సుందరరామన్ కుమారుల్లో దేవదాస్ ఒకరు. సినిమాలపై ఆసక్తితో దివంగత ప్రఖ్యాత దర్శకుడు భీంసింగ్ వద్ద పలు సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఆ తర్వాత తమిళంతో పాటు తెలుగు భాషల్లోనూ పలు చిత్రాలు నేరుగా డైరెక్ట్ చేశారు. దేవదాస్.. వేగుళి పెన్, మని కోయ కురుప్, రాఖీ వంటి సినిమాలు తెరకెక్కించారు. వేగుళి పెన్ మూవీ సమయంలో హీరోయిన్ దేవిక ఆయనతో ప్రేమలో పడింది. అయితే దేవికయే తన వెంటపడిందని, పెళ్లి చేసుకోమని కాళ్ల మీద పడి బతిమాలిందని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. మనిద్దరికీ సెట్టవదని దేవదాసు చెప్పినా ఆమె వినిపించుకోలేదట! పెళ్లికి ఒప్పుకోకపోతే చచ్చిపోతానని బెదిరించింది! దీంతో ఆమె మాటకు తలొగ్గాల్సి వచ్చింది. అలా ఇద్దరూ తిరుపతిలో పెళ్లి చేసుకున్నారు. వీరికి కనక అనే కూతురు జన్మించింది.



కనక.. తెలుగు చలనచిత్ర పితామహుడు రఘుపతి వెంకయ్యనాయుడుకు ముని మనవరాలవుతుంది. కానీ కేవలం డబ్బు కోసమే తనను పెళ్లి చేసుకుందని దేవదాస్‌కు నెమ్మదిగా అర్థమైంది. ఆయన్ను తన చెప్పుచేతల్లో పెట్టుకోవాలని చూసింది. అందుకు ఆయన ఒప్పుకోకపోయేసరికి ఒకరోజు తాళి బొట్టు ఆయన మొహాన విసిరికొట్టింది. అంతేకాదు, భర్తను చంపించాలని ప్రయత్నించిందట. ఈ విషయంపై దేవదాస్ పోలీసులను ఆశ్రయించగా దాదాపు 32 ఏళ్ల పాటు కోర్టుల చుట్టూ తిరిగారు. పెళ్లయిన మూడేళ్లకే దంపతులిద్దరూ విడిపోయారు. కోర్టు కూతురును తల్లికే అప్పగిస్తుంది. అలా కనక తండ్రికి దూరమైంది. కాదు, దేవికయే కూతుర్ని తనకు దూరం చేసిందంటారు దేవదాస్.. ఆమె వేసిన నిందలకు అందరూ తనను శత్రువులా చూశారని బాధపడ్డారు. కనక మానసిక స్థితి సరిగా ఉండదని, ఒకరోజు ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు వార్త వస్తే ఇంటికి వెళ్లి చూశారు. కనక బతికే ఉండటంతో అది తప్పుడు వార్త అని క్లారిటీ ఇచ్చారు. కనక ఇంటి బయట అంతా శుభ్రం చేశారు. అయినా తండ్రిని ఆమె లోనికి రానివ్వలేదు.అలా భార్య, కూతురి ప్రవర్తన వల్ల జీవితాంతం నరకం అనుభవించారు దేవదాసు. దేవికను పెళ్లి చేసుకోవడమే తాను జీవితంలో చేసిన పెద్ద తప్పు అని పశ్చాత్తాపపడ్డారు. తన గురించి పట్టించుకోనివారి కోసం ఆలోచించి సమయం వృథా చేయాలనుకోలేదు. అందుకే తన మరణానంతరం రూ.100 కోట్ల ఆస్తి ట్రస్టుకు చెందాలని వీలునామా రాశారు. ఇప్పుడిక సెలవంటూ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. దేవిక తెలుగులో పెండ్లి పిలుపు, అన్నా చెల్లెలు, గాలిమేడలు, రక్త సంబంధం, మంగళసూత్రం, నిండు మనసులు, గండికోట రహస్యం, పాపం పసివాడు, శ్రీకృష్ణాంజనేయ యుద్ధం, నిప్పులాంటి మనిషి, శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర వంటి పలు తెలుగు చిత్రాల్లో నటించింది.



# సిల్వర్ షాక్..


## బంగారం ధరలు ఒక్క రోజులోనే రివర్స్..

**న్యూఢిల్లీ:**దేశంలో బంగారం, వెండి ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. క్రితం రోజున కాస్త ఉపశమనం ఇచ్చిన పసిడి ధరలు ఒక్కసారిగా తారుమారయ్యాయి. ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట పైపు మదుపరులు మొగ్గు చూపుతున్నారు.అందులో భాగంగా బంగారం ధరలలో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. మంగళవారంతో పోలిస్తే బుధవారం బంగారం ధరలు ఎగిశాయి. వెండి ధరలు అమాంతం దూసుకెళ్లాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో కింద చూద్దాం..

# జపాన్ యువరాణి ఐకోకు పెరుగుతున్న ప్రజాదరణ

## దేశంలో వారసత్వ చట్టాన్ని మారుస్తుందా?

**టోక్యో:** జపాన్ యువరాణి ఐకోకు ప్రజాదరణ పెరుగుతోంది. ఆమె బయట కనిపిస్తే చాలు.. ప్రజలు ఓ పాప్‌స్టార్‌ను చూసినట్టు హర్షధ్వానాలు చేస్తున్నారు.చక్రవర్తి నరుహిటో, చక్రవర్తి మసాకోతో కలిసి ఈ ఏడాది ప్రారంభంలో ఆమె నాగసాకిని సందర్శించినప్పుడు, రోడ్ల వెంట జనం ఆమె పేరుతో నినాదాలు చే శారు. ఇది ఆమె తల్లిదండ్రులను సంతోషపరిచినా.. మహిళను చక్రవర్తిగా అంగీరించని జపాన్ సామ్రాజ్య చట్టంతో 2వేల ఏళ్ల



జపాన్ రాచరిక మనుగడ ప్రమాదంలో పడింది.రాజ కుటుంబంలో 16 మంది సభ్యులు ఉన్నారు. అందరూ పెద్దవాళ్ళు. నరుహిటోకు తరువాత ఇద్దరు వారసులున్నారు. నరుహిటో తమ్ముడు క్రౌన్ ప్రిన్స్ అకిషినో. అతనికి 60 ఏళ్లు. ఆయన కుమారుడు ప్రిన్స్ హిసాహిటోకు 16 ఏళ్లు. ఇప్పట్లో సింహాసనం చేపట్టే అవకాశాలు లేవు. పురుష వారసుల కొరత రాచరికానికి ఆందోళన కలిగిస్తోంది. జపాన్‌లో వృద్ధుల జనాభా పెరుగుతుండటం, యువత జనాభా తగ్గుతుండడానికి ఇది నిదర్శన.యువరాణి ఐకోకు సోమవారానికి 24 ఏళ్లు నిండాయి. అధికారం చేపట్టడానికి అనుమతించే వయసు. కానీ.. చక్రవర్తికి ఏకైక సంతానం అయిన ఐకో చక్రవర్తి కావాలంటే పురుషులు మాత్రమే వారసత్వాన్ని పొందే జపాన్ సామ్రాజ్య వారసత్వ చట్టాన్ని మార్చాలి. ప్రజలు కూడా ఇదే కోరుకుంటున్నారు. రాచరికం అంతరించి పోకుండా ఉండాలంటే మహిళలపై నిషేధం ఎత్తివేయాలని నిపుణులు చెబుతున్నారు. జపాన్ ప్రభుత్వం మహిళా చక్రవర్తిని అనుమతించాలని కోరుతూ గతేడాది ఐక్యరాజ్య సమితి మహిళా హక్కుల కమిటీ ఒక నివేదికను కూడా విడుదల చేసింది. కానీ ప్రధాన మంత్రి సనే తకైచితో సహా చట్టసభ్యులు అనేకమంది ఈ మార్పును వ్యతిరేకిస్తున్నారు.ఐకో 2001 డిసెంబర్ 1న జన్మించారు. తన తల్లిదండ్రులు చదివిన గకుషుయిన్ విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రురాలయ్యారు. యూకేలోనూ ఉన్నత విద్యను అభ్యసించారు.

# దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

- ఉన్నత చదువులకు సౌకర్యాలు
- ఇందిరమ్మ ఇళ్లలో 5% కేటాయింపు
- ఆర్టీసీ బస్ పాసుల సమస్య పరిష్కారం
- సంక్షేమానికి రూ.50 కోట్లు




కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 3(జనంసాక్షి): దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని, వారు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా సహాయ సహకారాలు అందిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం శాతవాహన యూనివర్సిటీ సమీపంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితా రామచంద్రన్, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించిందన్నారు. దివ్యాంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం చేయడం చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, నిపుణులైన అధ్యాపకులను నియమించి సైన్ లాంగ్వేజ్ ద్వారా బోధన జరిపిస్తామని చెప్పారు. దివ్యాంగులు తమలోని దివ్య దృష్టిని వృథా చేయకుండా ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో 5 శాతం దివ్యాంగులకు కేటాయించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఆర్టీసీ బస్ పాసుల సమస్యను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివ్య దృష్టి యూట్యూబ్ ఛానల్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో దివ్యాంగులు పాడిన పాటను సీఎం ఆవిష్కరించినట్లు అతిథులు వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితా రామచంద్రన్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న దివ్యాంగుల్లో అద్భుత ప్రతిభ దాగి ఉంటుందని, వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. సైన్ లాంగ్వేజ్ లో జనగణమన పాడిన కలెక్టర్ బృందాన్ని అభినందించారు. స్కిల్ ట్రైనింగ్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. యూపీఎస్సీ వంటి ఉన్నత ఉద్యోగాల్లో దివ్యాంగులు రాణిస్తున్నారని, చదువును నమ్ముకుని ముందుకు సాగాలని సూచించారు. వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యం పెంచుకోవాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కలెక్టర్ చేపట్టిన చర్యలను అభినందించారు. దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం దివ్యాంగులతో స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని, 40 శాతం వైకల్యం ఉన్నవారికి పరికరాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని వివరించారు. జిల్లాలో డిసిబిసి భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అతిథులను అధికారులు, సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. దివ్యాంగ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూపరాణి, అధికారులు, వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

# తొలి విడత పంచాయతీ ఎన్నికల బరిలో తుది అభ్యర్థులు

- డిసెంబర్ 11న పోలింగ్-ఫలితాలు
- 85 గ్రామాల్లో రసవత్తర పోరు.. ఏకగ్రీవాలు ఖరారు
- ప్రచారానికి కేవలం 7 రోజులే.. కఠిన నిబంధనలు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 3 (జనంసాక్షి): రాష్ట్రవ్యాప్త గ్రామ పంచాయతీ ఎన్నికల సమరంలో రాజన్న సిరిసిల్ల జిల్లా తొలి విడత పోరు రంగం సిద్ధమైంది. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో పోటీలో నిలిచిన తుది అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారులు అధికారికంగా ప్రకటించారు. జిల్లాలోని 5 మండలాల పరిధిలోని 85 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, 748 వార్డు సభ్యుల పోస్టులకు రసవత్తర పోటీ నెలకొంది. కొన్ని చోట్ల ఏకగ్రీవాలు ఖరారయ్యాయి. డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి పోలింగ్ కేంద్రాల వద్దే ఓట్ల లెక్కింపు పూర్తి చేసి ఫలితాలు ప్రకటిస్తారు. గెలుపొందిన సర్పంచ్, వార్డు సభ్యుల సమక్షంలో ఉప సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. నామినేషన్ల పరిశీలన, అప్పీళ్ల ప్రక్రియ అనంతరం ఉపసంహరణ గడువు ముగియడంతో ఎన్నికల బరిలో మిగిలిన అభ్యర్థులు తీవ్ర ప్రచారంలో దిగారు. పలు గ్రామాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్రులు కూడా బలమైన పోటీ ఇస్తున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీల వివరాలను అధికారులు వెల్లడించారు. పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ప్రచారానికి కేవలం వారం రోజుల సమయం మాత్రమే ఉండటంతో అభ్యర్థులు గడువు ముగియకముందే గెలుపు వ్యూహాలు రచిస్తున్నారు. పోలింగ్ ముగియడానికి 44 గంటల ముందు ప్రచారం పూర్తిగా నిషేధం కాగా, లౌడ్‌స్పీకర్లు, పోస్టర్లు, కరపత్రాలపై కఠిన ఆంక్షలు అమల్లో ఉన్నాయి. ముద్రణ సంస్థ వివరాలు తప్పనిసరిగా పోస్టర్లు, కరపత్రాలపై ముద్రించాలని ఎస్ఈసీ ఆదేశించింది. ఓటర్లను లంచాలతో ఆకర్షించడం, భయపెట్టడం, దొంగ ఓట్లు వేయించడం, మతం-కులం-జాతి-భాష పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టడం వంటి అక్రమాలకు పాల్పడితే ఎన్నికైనా సభ్యత్వం రద్దు చేస్తాక తప్పదని, మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా విధిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది. బ్యాలెట్ పేపర్ ద్వారా జరుగుతున్న ఈ ఎన్నికల్లో 'నోటా' గుర్తును కూడా చేర్చారు. ఏ అభ్యర్థిని ఇష్టపడని ఓటర్లు నోటాపై ముద్ర వేసే అవకాశం కల్పించారు.

# అంగవైకల్యం శారీరకమే కానీ మానసికం కాదు

- పట్టుదలతో అంగవైకల్యాన్ని జయించాలి : అదనపు కలెక్టర్ డి. వేణు
- అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొన్న అదనపు రెవిన్యూ కలెక్టర్



పెద్దపల్లి, డిసెంబర్ 03(జనంసాక్షి) : అంగవైకల్యం శారీరకమే కానీ మానసికం కాదు అని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు.బుధవారం జిల్లా సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం వేడుకలో అదనపు కలెక్టర్ డి. వేణు పాల్గొన్నారు.అదనపు రెవిన్యూ కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ దివ్యాంగులు మనోధైర్యంతో జీవితంలో ఉన్నత శిఖరాలు సాధించే దిశగా పనిచేయాలని, జీవితంలో ఎదిగేందుకు అంగవైకల్యం అడ్డం కావద్దని, పట్టుదలతో, ఆత్మ స్థైర్యంతో అంగవైకల్యాన్ని జయించాలని, దానికి అవసరమైన అన్ని రకాల సహాయ, సహకారాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని, అన్ని రంగాలలో రిజర్వేషన్లు, వసతులను ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, దివ్యాంగులకు న్యాయపరమైన సహాయం అందించేందుకు జిల్లా లీగల్ సెల్ అథారిటీని ఉపయోగించుకుని న్యాయ సహాయం పొందాలని, ప్రతి దివ్యాంగులు సదరం క్యాంప్ హాజరై క్యాంపు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.దివ్యాంగుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మానసికంగా దివ్యాంగులు అనే భావన నుంచి దూరంగా ఉండాలని, సామాన్యులతో పాటు అన్ని రంగాలలో విజయం సాధిస్తున్నారని, ప్రపంచ అందుల క్రికెట్ కప్ పోటీలలో విజయం సాధించి భారతదేశానికి ప్రపంచ క్రికెట్ కప్ అందించారని, పారాలింపిక్ ఒలంపిక్స్ క్రీడలలో కూడా రాణిస్తున్నారని అన్నారు.దివ్యాంగులు ఏకాగ్రతతో ఓపికతో పనులు సాధించే దిశగా కృషి చేయాలని విఫలం చెందితే నిరాశ చెందకుండా మళ్లీ కృషి చేయాలని తెలిపారు.లోపాన్ని మరిచి పట్టుదలతో దివ్యాంగులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని , పట్టుదలతో ఉండాలని ఎవరికి తీసుపోకుండా మంచి నైపుణ్యంతో దివ్యాంగులు ఉంటారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో చీఫ్ డిఫెన్స్ లీగల్ లీడ్, ఎన్. శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్, భాను ,జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్ ,డి.ఎం హెచ్. ఓ. డాక్టర్ వాణిశ్రీ, అడిషనల్ డిఆర్డిఏ శ్రీనివాస్, సూపరిండెంట్ రాజయ్య, ఎఫ్ ఆర్ ఓ స్వర్ణ లత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని
- పంచాయతీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఎన్నికల సంఘం కమిషనర్




పెద్దపల్లి,డిసెంబర్ 03(జనంసాక్షి) : పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని అన్నారు.పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఐ. రాణి కుముదిని జిల్లా కలెక్టర్ లతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి రాం రెడ్డి, ఎన్నికల సాధారణ పరిశీలకులు నరసింహారెడ్డి తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు అందేలా రిటర్నింగ్ అధికారి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న గ్రామీణ ప్రాంతాలలో ఎటువంటి ప్రలోభాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు. నామినేషన్ల గడువు ముగిసిన తర్వాత పోటీ చేసే అభ్యర్థుల గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్లపై ముద్రణ నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని అన్నారు. సింగిల్ నామినేషన్ వచ్చిన గ్రామాలు ఉంటే అండర్ టేకింగ్ తీసుకోవాలని, సర్పంచ్ పదవుల వేలం ప్రక్రియ ఎక్కడ జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.ఓటర్ స్లిప్పుల పంపిణీకి షెడ్యూలు తయారు చేయాలని, ఓటు ప్రాముఖ్యత పై అవగాహన కల్పించేందుకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పెద్దపల్లి ఎన్నికల సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో అవసరమైన వసతులు ఉన్నాయని, నామినేషన్లు ప్రక్రియ సజావుగా జరుగుతుందని నిబంధనల ప్రకారం స్క్రూటినీ ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో మొదటి రెండు విడుదలలో ఎక్కడ కూడా సింగిల్ నామినేషన్ మాత్రమే దాఖలైన స్థానాలు లేవని కలెక్టర్ తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు అవసరమైన మీద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిసెంబర్ 6న పోలింగ్ సిబ్బంది శిక్షణ, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. రామగుండం నుంచి పాల్గొన్న పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా మాట్లాడుతూ,లి క్రిటికల్ పోలింగ్ కేంద్రాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం జరిగిందని అన్నారు. జిల్లాలో 4 అంతర్ జిల్లాల చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ సమావేశంలోజెడ్పీ సిఈఓ నరేందర్, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వెల్మల్ విడిసి తీర్మానంపై సబ్ కలెక్టర్‌కి ఫిర్యాదు

ఆర్మూర్,డిసెంబర్ 3 (జనంసాక్షి): నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలో 16 కులాల వీడిసి సభ్యులు ఒక్కరే నామినేషన్ వేయాలని తీర్మానం చేసినందున చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాకు భోగ రాము ఫిర్యాదు చేశారు.ఆర్మూర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ తోపాటు నందిపేట్ లోని ఎంపీడీవో,ఎస్సై లకు బుధవారం ఫిర్యాదు చేశారు.వెల్మల్ గ్రామంలో సర్పంచ్ పదవి జనరల్ కేటగిరీలో వచ్చినందున ఒక్కరే నామినేషన్ వేయాలని 16 సంఘాల పెద్దలు నిర్ణయించినట్లు తెలిపారు. తమ తీర్మానానికి వ్యతిరేకంగా ఎవరైనా సర్పంచ్ పదవికి పోటీ చేయడానికి ముందుకు వస్తే ప్రతిపాదన చేసి బలపరచవద్దని చెప్పారు. ఒకవేళ తమ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరైనా నామినేషన్ పత్రాలపై ప్రతిపాదన, బలపరిచినట్లయితే వారికి రూ.5 లక్షలు జరిమానా విధిస్తామని హెచ్చరించినట్లు తెలిపారు.

ఈ హెచ్చరికలతో నామినేషన్ వేసే వారికి బలపరచడానికి ఎవరు ముందుకు రావడంలేదని వివరించారు. ఎన్నికలలో పోటీ చేసేవారు నలభై లక్షలు దగ్గర పెట్టుకొని, సంఘానికి 12 లక్షలు చెల్లించాలని చెప్పడం జరిగిందన్నారు. రాజ్యాంగబద్ధంగా జరుగుతున్న ఎన్నికలలో 16 కులాల సంఘాల వారు నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నందున చర్యలు తీసుకొని అందరూ పోటీ చేసే విధంగా చూడాలని ఆయన కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ ఎస్సైకు,ఎంపీడీవోకు ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**100 మందికి దుప్పట్ల పంపిణీ**

**మాజీ కేంద్రమంత్రి సర్వే సత్యనారాయణ**

మల్కాజిగిరి డిసెంబర్ 3 (జనంసాక్షి) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నేరేడ్‌మెట్‌లోని అంబేద్కర్ భవన్‌లో మానవతా ఆసరా ట్రస్ట్, వికలాంగుల హక్కుల పోరాట సమితి సహకారంతో దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై 100 మంది దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గతంలో లక్ష మందికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇప్పించానని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో కూడా దివ్యాంగులకు ఇళ్లు, పెన్షన్లు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మానవతా ఆసరా ట్రస్ట్ డైరెక్టర్ సిలుముల క్రిష్ణ మాట్లాడుతూ, తమ ట్రస్ట్ సేవలు పేదలు, దివ్యాంగులు, వృద్ధుల కోసం అండగా నిలుస్తుందని తెలిపారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు వినయ్ మాట్లాడుతూ, దివ్యాంగులకు సహాయ సహకారాలు అందించడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మానవతా ఆసరా ట్రస్ట్ కార్యదర్శి దుర్గేష్, సహాయక కార్యదర్శి విష్ణు, స్వామి, సూరంపల్లి అంజయ్య, శ్రీనివాస్, గౌతమ్ రాజ్, పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్తుకు భవిత కేంద్రాలే బలమైన బాట





- దివ్యాంగ విద్యార్థులకు రెగ్యులర్ హాజరు తప్పనిసరి
- వారంలో రెండుసార్లు ఉచిత ఫిజియోథెరపీ సేవలు
- ప్రతి అర్హుడికీ ఏటా రూ. 5 వేల స్కాలర్‌షిప్..
- పెద్దపల్లిలో నూతన భవిత కేంద్రం ప్రారంభం.. జిల్లా వ్యాప్తంగా సంఖ్య పెంపు లక్ష్యం : : కలెక్టర్

పెద్దపల్లి, డిసెంబరు 3 (జనంసాక్షి) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల ఆవరణలో నిర్మాణం పూర్తయిన నూతన భవిత కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి భవిత కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అందుకే ఈ కేంద్రాలకు రెగ్యులర్‌గా హాజరయ్యేలా తల్లిదండ్రులు, అధ్యాపకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ, భవిత కేంద్రాల్లో నమోదు చేసుకున్న ప్రతి విద్యార్థి సోమవారం నుంచి శుక్రవారం వరకు తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టం చేశారు. "వారంలో కనీసం రెండు సార్లు ఫిజియోథెరపీ సేవలు అందించడం జరుగుతుంది. ఇది విద్యార్థుల శారీరక సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. రెగ్యులర్ హాజరు లేకపోతే ఈ సేవలు సరిగా అందవు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

అలాగే ప్రస్తుతం జిల్లాలోని భవిత కేంద్రాల్లో నమోదైన విద్యార్థుల సంఖ్య సంతృప్తికరంగా లేదని, గ్రామీణ ప్రాంతాల్లోనూ దివ్యాంగ విద్యార్థులను గుర్తించి, వారిని ఈ కేంద్రాలకు తీసుకొచ్చేలా అధికార యంత్రాంగం చురుకుగా పనిచేయాలని ఆదేశించారు.

దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.5 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేస్తోందని గుర్తుచేసిన కలెక్టర్, ఈ మొత్తం ప్రతి అర్హుడికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. "ఒక్క దివ్యాంగ బిడ్డ కూడా ఈ సౌకర్యం నుంచి వంచితుడు కాకూడదు" అని ఆమె స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, జిల్లా విద్యాశాఖాధికారి శారద, మండల విద్యాశాఖాధికారి సురేందర్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ కవిత, ఇంక్లూసివ్ రిసోర్స్ పర్సన్లు సంధ్యారాణి, రజని, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. నూతనంగా ప్రారంభమైన ఈ భవిత కేంద్రం ద్వారా పెద్దపల్లి పట్టణంతోపాటు పరిసర గ్రామాల దివ్యాంగ విద్యార్థులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడనుంది. జిల్లా యంత్రాంగం ఈ కేంద్రాల సమర్థవంతమైన పనితీరుతో దివ్యాంగ బిడ్డల

# గ్రామపంచాయతీల్లో పటిష్టమైన చర్యలు

**నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య**



ఆర్మూర్,డిసెంబర్ 3(జనంసాక్షి): ఆర్మూర్ డివిజన్ పరిధిలో మూడో విడత డామినేషన్ స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావడంతో ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోవింద్ పెట్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక పాఠశాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య బుధవారం పర్యవేక్షించారు.ఎన్నికల సందర్భంగా తీసుకుంటున్న ఏర్పాట్లను సిపి క్షుణ్ణంగా పర్యవేక్షించారు.ఎన్నికల కమిషన్ నిబంధనలను అమలు చేస్తు,పోలింగ్ ను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని క్రింది స్థాయి అధికారులకు సూచించారు.పోలీస్ సిబ్బందికి నామినేషన్ సెంటర్ దగ్గరలో 100 మీ.ల లోపు నిషేధిత ఉత్తర్వులు అమలులో ఉంటాయన్నారు. సమస్యాత్మక,అతి సమస్యాత్మక పంచాయతీల ప్రకారం బందోబస్తు ఏర్పాట్లు,పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంద న్నారు. ఈ సందర్భంగా ఎన్నికలవేళ ప్రజలందరూ పోలీసు అధికారులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి,ఆర్మూర్ ఎస్హెచ్ఓ సత్యనారాయణ గౌడ్,ఆర్ఓ డి.నర్సయ్య,ఎఆర్ఓ శ్రీనివాస్ గౌడ్,సెక్రెటరీ సుఖన్య. ప్రిన్సిపాల్ ఇందిర,సిబ్బంది పాల్గొన్నారు.

## చిగురుమామిడిలో ఘనంగా

# కాసోజు శ్రీకాంతచారి 16వ వర్ధంతి

- శ్రీకాంత్ చారి జీవిత గాధను పాఠ్యపుస్తకాలలో చేర్చాలి..
- విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్



చిగురుమామిడి డిసెంబర్03 (జనంసాక్షి): విశ్వబ్రాహ్మణ మండల కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ మలిదశ తొలి అమరవీరుడు కాసోజు శ్రీకాంత్ చారి 16వ వర్ధంతి కార్యక్రమం చిగురుమామిడి లోని గాంధీ చౌరస్తా వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ చారి చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నీరుగారిపోతున్న సమయాన ఇక తెలంగాణ రాదేమో అన్న తీవ్ర ఆలోచనతోని 2009 నవంబర్ 27న పెట్రోలు పోసుకుని అగ్నికి ఆహుతై జై తెలంగాణ అంటూ నినాదించి తెలంగాణ ప్రజానీకాన్నంతటినీ మేల్కొల్పి ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేశాడు 90శాతం కాలిన గాయాలతో హాస్పిటల్లో ఆరు రోజులు మృత్యువుతో పోరాడి చివరకు 2009 డిసెంబర్ 3వ తేదీన ప్రాణాలు విడిచారు మనము తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకున్నాము అంటే దానికి పెద్ద కారణం శ్రీకాంత్ చారి అనేది ముమ్మాటికి నిజం అయినా వారి కుటుంబానికి ఏ ప్రభుత్వం కూడా సరియైన న్యాయం చేయలేదు వారి కుటుంబాన్ని అన్ని రకాల ఆదుకోవడమే కాకుండా అంతటి అమరవీరుని జీవిత గాదను తప్పకుండా పాఠ్యపుస్తకాలలో చేర్పించాలని ప్రతి మండల కేంద్రాలలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం తరఫున ప్రభుత్వాన్ని, రాజకీయ నాయకులను కోరారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్ విశ్వబ్రాహ్మణ సంఘం మండల కోశాధికారి గుగ్గిళ్ళ వేణుమాధవ్, విశ్వబ్రాహ్మణ మండల నాయకులు పోలోజు సదాచారి,అనువోజు రాములు,అనువోజు చిరంజీవి,చొప్పదండి సాయికుమార్,పోలోజు కుమారస్వామి, అనువోజు శ్రీనివాస్,వడ్లూరి నరేష్,చొప్పదండి అభినయ్ బిసి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్, నాయకులు చిట్టిమల్ల రవీందర్,పన్యాల ప్రభాకర్ రెడ్డి,నిలిగొండ కిషన్,వంగ కనుకయ్య, సతీష్,బెజ్జంకి వెంకటి,పొన్నం రాజు,కూతాడి కొమురయ్య,కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో పటిష్టంగా గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు

**కలెక్టర్ పమేలా సత్పతి , సీపీ గౌష్ ఆలం.**




కరీంనగర్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 3(జనంసాక్షి): రాష్ట్ర ఎన్నికల కమీషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం పాల్గొన్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు, నామినేషన్ల వివరాలు, భద్రతా ప్రణాళికపై వారు వివరించారు.

నామినేషన్ల వివరాలు వెల్లడించిన కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, రెండు విడతల నామినేషన్ల దాఖలు వివరాలను వెల్లడించారు. మొదటి విడత 92 సర్పంచ్ స్థానాలకు గాను 730 నామినేషన్లు దాఖలు, 866 వార్డు సభ్యుల స్థానాలకు గాను 2174 నామినేషన్లు దాఖలు చేశారు. రెండవ విడత 113 సర్పంచ్ స్థానాలకు గాను 888 నామినేషన్లు దాఖలు, 1046 వార్డు సభ్యుల స్థానాలకు గాను 3056 నామినేషన్లు దాఖలు చేశారు. సర్పంచ్ లేదా వార్డు మెంబర్ పదవికి నామినేషన్ వేయని గ్రామ పంచాయతీలు ఇప్పటివరకు నమోదు కాలేదు. సర్పంచ్ పదవికి సింగిల్ నామినేషన్ వేసిన గ్రామ పంచాయతీలు ఇప్పటివరకు నమోదు కాలేదు. మొత్తం 125 వార్డులకు గాను, సింగిల్ నామినేషన్లు దాఖలైనట్లు నమోదు అయింది. మొత్తం 2946 పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ అధికారులకు డిసెంబర్ 6, 9, 12 తేదీల్లో మూడు దశల్లో శిక్షణ అందించనున్న ట్లు వెల్లడించారు. ఎన్నికల పరిశీలకులు, పోలీస్ కమీషనర్ సమన్వయంతో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత సీపీ గౌష్ ఆలం..

కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, మూడు విడతలలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలకు పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉందని తెలిపారు. తుది డ్రాఫ్ట్ బందోబస్తు ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల వర్గీకరణ గతంలో జరిగిన ఘటనల ఆధారంగా మొత్తం పోలింగ్ కేంద్రాలను సాధారణ, సమస్యాత్మక కేంద్రాలుగా విభజించినట్లు తెలిపారు. మొత్తం కేంద్రాలలో 19% సమస్యాత్మకమైనవిగా గుర్తించి, వాటి వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. బైండోవర్ - శాంతిభద్రతలకు విఘాతం కలిగించే గత ఎన్నికల నేరస్థులు, రౌడీషీటర్లు, భౌతిక దాడులకు పాల్పడిన 635 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఆయుధాలు/కేసులు - ఇప్పటివరకు 70 అక్రమ మద్యం కేసులు 01 ఎన్.డి.పి.ఎస్. చట్టం కేసు నమోదు అయ్యాయి. 33 లైసెన్స్ గల తుపాకులను డిపాజిట్ చేసుకున్నామని, మిగిలిన వాటిని కూడా పూర్తి స్థాయిలో డిపాజిట్ చేసుకుంటామని వివరించారు.

నిరంతర నిఘా - ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీములు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయని, గ్రామాలను క్లస్టర్‌గా విభజించి నిరంతర గస్తీ నిర్వహిస్తున్నామని సీపీ పేర్కొన్నారు. గ్రామ పోలీసు అధికారులను కేటాయించి, క్షేత్ర స్థాయిలో పోలీసు బలోపేతం చేసి, ప్రజలకు ఎన్నికలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్టేషన్ హౌస్ అధికారులు గ్రామాల్లో తిరుగుతూ ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పిస్తున్నారని సీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడె, ఎన్నికల పరిశీలకులు వెంకటేశ్వర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భూక్రమబద్ధీకరణపై నిర్ణయం ఎప్పుడు?





- గ్రేటర్ సహా శివారుల్లో జీఓ 58,59, 118 కింద వచ్చిన దరఖాస్తులు 1.19 లక్షలు
- ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటేనే భూ క్రమబద్ధీకరణకు మోక్షం
- ఆదేశాల కోసం ఎదురు చూస్తున్న రెవెన్యూశాఖ అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 03 (జనం సాక్షి) :** గ్రేటర్ సహా శివారులో ప్రభుత్వ భూముల్లో ఏళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం గడుపుతున్న నిరుపేదలు 23 నెల లుగా భూ క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూ స్తున్నారు. రెండోవిడత భూ క్రమబద్ధీకరణలో భాగంగా ప్రభుత్వం ఆక్రమిత నివాస స్థలాల్లో నివాసం ఉంటున్న పేద ప్రజల నుంచి జీఓ 58,59 కింద అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించి, వాటి పరిశీలన కార్యక్రమాన్ని కూడా అప్పట్లోనే పూర్తి చేసింది. అర్హులను గుర్తించి జీఓ 58,59 కింద భూ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. జనరల్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో వాయిదా పడింది. జీఓ 118 కింద స్వీకరించిన దరఖాస్తుల పురోగతి కూడా నిలిచిపోయింది.

**కొత్త ప్రభుత్వం ఏర్పడి దాదాపు 23 నెలలు..**

కొత్త ప్రభుత్వం ఏర్పడి 23 నెలలు కావస్తున్నా.. దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. పేద ప్రజలకు మాత్రం ఎదురుచూపులు తప్పడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా ఆరు గ్యారంటీలు, భూభారతి వంటి అంశాలతో పాటు రెవెన్యూ శాఖపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం జీఓ 58,59 దరఖాస్తుల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా జాప్యం చేస్తోందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ శాఖ అధికారులు కూడా జీవో 58,59 పై ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. త్వరలో జీఓ 58,59 కింద భూ క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం సాను కూల నిర్ణయం తీసుకోగలదన్న ఆశాభావాన్ని గ్రేటర్తో సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలోని దరఖాస్తుదారులు ఆశా భావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నగర శివారులోని 44 కాలనీల్లో నివాస స్థలాల్లో భూ క్రమబద్ధీకరణకు సంబంధించిన అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 118 పై కూడా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుం దని స్థానికులు ఆశిస్తున్నారు. వీటికి సంబంధిం చిన గ్రేటర్తో సహా శివారుల్లో సుమారు 1.19 లక్షల పైగా దరఖాస్తులు ఉంటాయని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

**మేడ్చల్ జిల్లాలోనే అత్యధికం..**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జీఓ 58 కింద 28,082 దరఖాస్తులు రాగా 18 మందీరాజ ఎండింగ్లో ఫీజు చెల్లించి, క్రమబద్ధీకరణకోసం 41 బృందాలు క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించారు. జిల్లాలో జీఓ 59 కింద వచ్చిన 15,200 దరఖాస్తులను కూడా క్షేత్ర స్థాయిలో 41 బృందాలు పూర్తి స్థాయిలో విచారణ జరిపారు.

రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాల్లో జీఓ 58,59 కింద అత్యధికంగా 41,292 దరఖాస్తులు వచ్చాయి. దరఖా స్తుల విచారణలో భాగంగా ఇళ్ల పరిసరాల బృందాల్లో డిప్యూటీ తహశీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, సర్వేయర్ బందాల కలయికతో బృందాలు నియమించారు. ప్రతి ఫైల్ పోస్టు బృందం ఇంటి ఫైల్ అందజేసి రేయింబవళ్లు పాటు కష్ట పడి విచాణ ప్రచారం జరిపాయి..? లేదా భూ దానపత్రంకాదు, సేవలందించే ఆరాటాను ప్రభుత్వంకి యాచించిన ముల్కీ యాక్ట్ తో భూమిదు కానీ, వాటిని పట్టాలి లాగిరి నిస్వార్థం చేయించడమేనా రెవెన్యూ బృందాల నిస్వార్థ సేవలు.. ఈ దరఖాస్తులను మాత్రం లబ్ధిదారులకు ఉపయోగప గ సానుకూలత చేకూర్చేవిధంగా విచారణ జరిపారు. లేదా తిరస్కరించే అవకాశం ఉంటుంది.

# మొబైల్ టాయిలెట్లు స్క్రాప్‌గా అమ్మకాలు

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాప్రా సర్కిల్ ప్రజలు
- దోపిడీకి గురవుతున్న ప్రభుత్వ సొత్తు
- పారిశుద్ధ్య అధికారిపై తీవ్ర విమర్శలు

**ఖైరతాబాద్, డిసెంబర్ 03 (జనం సాక్షి) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కాప్రా సర్కిల్ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మొబైల్ టాయిలెట్లు స్క్రాప్ పేరుతో అక్రమంగా అమ్మేస్తున్నారన్న ఆరో పణలు కాప్రా సర్కిల్ పారిశుద్ధ్య శాఖపై వెల్లువెత్తు తున్నాయి. గత ఐదు సంవత్సరాలుగా ప్రజలకు ఉపయోగపడుతూ ఉన్న ఈ మొబైల్ టాయిలెట్లు ఇప్పుడు ఎక్కడికో మాయమవడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా కాప్రా సర్కిల్ పరిధిలో అరవై నుండి డెబ్బై మొబైల్ టాయిలెట్లు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం వాటిలో పది కూడా మిగిలి ఉన్నాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కొకటిగా ఈ కంటైనర్లు స్క్రాప్ పేరుతో బయటకు తరలిపోతుండటం ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకతను రేపుతోంది. ఇటీవ ల బదిలీపై వచ్చిన పారిశుద్ధ్య అధికారి సుదర్శన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాతే ఈ అక్రమాలు పెరిగాయన్న ఆరోపణలు స్థానికుల నుండి వినిపి స్తున్నాయి. ప్రజల సదుపాయాల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆస్తులను అధికారులు తమ ఇష్టా నుసారం అమ్ముకోవడం ఏ విధమైన నిర్వాహకప ద్ధతని ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ మొబైల్ టాయిలెట్లను రద్దు చేయాల్సి వచ్చినా, అధికారికంగా టెం డర్ పిలిచి పారదర్శకంగా విక్రయం జరగాలి. అ యితే ఇక్కడ మాత్రం ఎలాంటి ప్రక్రియలు పాటించకుండా విచ్చలవిడిగా స్క్రాప్ పేరుతో అమ్మకాలు జరుగుతున్నాయన్న తీవ్రమైన విమర్శలు వెల్లువె త్తుతున్నాయి. గతంలో కూడా ఈ అధికారి అవినీ తి ఆరోపణల్లో ఇరుక్కున్నాడని, మూడు సార్లు బదిలీపై వెళ్లి మళ్లీ కాప్రా సర్కిల్‌కే రావడంపై స్థాని కులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని మొబైల్ టాయిలెట్లు ఉన్నాయి? ఎన్ని అక్రమంగా అమ్మేశారు? ఎవరి ఆదేశాలతో ఈ అమ్మకాలు జరిగాయి? అన్న విషయాలపై నిష్పక్షపాత విచారణ జరిపి నిజాలు బయటపెట్టాలని ప్రజలు డిమాం డ్ చేస్తున్నారు. విచారణ జరగకపోతే ఈ వ్యవహా రంలో ఉన్నతాధికారులకే భాగస్వామ్యం ఉన్నట్టే అన్న అనుమానాలు ప్రజల్లో పెరుగుతున్నాయి. వెంటనే విచారణ కమిటీని ఏర్పాటు చేసి, ఇందు లో ప్రమేయం ఉన్న వారందరిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కాప్రా సర్కిల్ ప్రజలు ఘా టుగా కోరుతున్నారు. ఈ మొబైల్ టాయిలెట్లను అక్రమంగా అమ్మిన వారిపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ ఆస్తులను దోపిడీ చేసిన ప్రతి ఒక్కరిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు స్పష్టంగా డిమాండ్ చేస్తున్నారు.

# గోట్లపల్లి క్లస్టర్‌లో నామినేషన్ పత్రాలు చోరీ






- పథకం ప్రకారమే దొంగతనం
- దొంగతనం వెనుక రాజకీయ హస్తం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పెద్దేముల్ పోలీసులు

**వికారాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 3 (జనం సాక్షి):** గ్రామపంచాయతీ ఎన్నికల నిలుపుదల కోసమా.. లేక ఇరువురి మధ్య ఉన్న తగాదాల తెలియ దు కానీ నామినేషన్ల పత్రాలను మాత్రం చోరీ చేశారు. దీని వెనక రాజకీయ నాయకుల హస్తం ఉండవచ్చునని అనుమానా లు వ్యక్తమవుతున్నాయి. సంఘటన వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజక వర్గంలో పెద్దేముల్ మండలం గొట్లపల్లి క్లస్టర్‌లో బుధవారం జరిగింది. వరాలకు వెళ్తే గో ట్లపల్లి క్లస్టర్ గ్రామపంచాయతీ తాళాలు పగలగొట్టి నామినేషన్ క్లస్టర్‌లో ఉన్న నామినేషన్ పత్రాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బుధవారం ఉదయం విధులకు హాజరైన అధికారులు చూసి కంగుతిన్నారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ క్లస్టర్ పోలింగ్ స్టేషన్ ను సందర్శించారు. నామినేషన్ పత్రాలు డేటా స్కాన్ చేసి ఉండడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గొట్లపల్లి క్లస్టర్‌లో గొట్లపల్లి, హన్మాపూర్, గిర్మాపూర్, జయరాం తండా (ఐ) ఇందూర్ గ్రామాలకు సర్పంచ్ వార్డు మెంబర్లు వేసిన నామినేషన్లు ఉన్నాయి. ఆన్లైన్ డాటా ఉందని ఎన్నికలకు ఎలాంటి ఆటంకాలు ఉండవని అధికారులు చెప్తున్నారు. మరోవైపు ఒరిజినల్ నామినేషన్ పత్రాలు లేకపోవడం పై పలువురు రాజకీయ నాయకులు విమర్శలు చేస్తున్నారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు పటిష్ట బందోబస్త్

## ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్.



**మల్కాజిగిరి డిసెంబర్ 3(జనంసాక్షి) :** అధికారులు సమన్వయంతో పనిచేసి గ్లోబల్ సమ్మిట్ ను విజయవంతం చేయాలని అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ సూచించారు. రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, బందోబస్త్ పై వివిధ శాఖల అధికారులతో అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ ఫ్యూచర్ సిటీలో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. రాచకొండ సిపి సుధీర్ బాబు, ఐజిపి రమేష్ రెడ్డి తో కలిసి బందోబస్త్ ఏర్పాటును, గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి సమావేశ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మహేష్ భగవత్ మాట్లాడుతూ, బందోబస్త్ విషయంలో ఏ మాత్రం పొరపాటు చేయవద్దని, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఈ సమ్మిట్ నిర్వహిస్తునందున లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులతో పాటు స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, ఆక్టోపస్, గ్రేహౌండ్స్, డాగ్, బాంబ్ స్క్వాడ్స్ తో కలిసి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమ్మిట్ కి కావాల్సిన సదుపాయాలపై, బేరక్స్, మెస్, కిచెన్, మరుగుదొడ్లవంటి మౌలిక సదుపాయల గురించి అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ పెట్టుబడి సంస్థల ప్రతినిధులు, బహుళ సంస్థల అధినేతలు, దేశీయ సంస్థల ప్రముఖులు, పారిశ్రామిక దిగ్గజాలతో కలిపి సుమారు 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు అధికారులు వెల్లడించారు. వీఐపీ ప్రతినిధుల చుట్టూ మూడంచెల భద్రత ఉంటుంది. గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతంలో అడుగడుగునా నిఘా పెట్టేందుకు సుమారు వెయ్యికిపైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ సెంట్రల్ పోలీసు కంట్రోల్ రూమ్ కు అనుసంధానమై ఉంటాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులను నియమించనున్నారు. రహదారుల మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ నిర్వహణ వంటి వాటి కోసం ట్రాఫిక్ మార్షల్స్ నియమించుకోనున్నారు. ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం, ఇబ్బందులు జరగకుండా ఆయా మార్గాలను పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుంది. సాధారణ ప్రజలు, వాహనదారులకు రెండు రోజుల పాటు ఆయా మార్గాలలో రహదారుల మళ్లింపులు ఉంటాయని తెలిపారు.

# ఘనంగా వరల్డ్ మూవ్‌మెంట్ డిజార్డర్స్ డే

## నిమ్స్‌లో పేషెంట్ అవగాహన కార్యక్రమం

**ఖైరతాబాద్, డిసెంబర్ 03 (జనం సాక్షి) :** వరల్డ్ మూవ్‌మెంట్ డిజార్డర్స్ డే సందర్భంగా నిజాం ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లోని న్యూరా లజీ, న్యూరోసర్జరీ విభాగాలు సంయుక్తంగా పేషెంట్ అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. ఈ కార్య క్రమం బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిమ్స్ ప్రాంగణంలో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం మూవ్‌మెంట్ డిజార్డర్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచడం, సామాజిక మచ్చ(సోషల్ స్టిగ్మా) తగ్గించడం, రోగులు ఎదుర్కొంటున్న సవా ళ్లను తెలియజేయడం, మంచి చికిత్సల కోసం పరిశోధనను ప్రోత్సహించడం, అలాగే రోగుల కోసం సపోర్ట్ గ్రూపులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా.భీరప్ప నగరి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య పథకం కింద డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్(డిబిఎస్) శస్త్రచి కిత్సలు జరుగుతున్న దేశంలోని ఏకైక సంస్థ నిమ్స్ అని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో సుమా రు 140 డిబిఎస్ ప్రొసీజర్లు విజయవంతంగా పూర్త య్యాయని చెప్పారు. ఈ సందర్భంగా డా.నిరజ్ కుమార్, డా.సిరీష యరీద, డా.వంశీ కృష్ణ వై, డా. వసుందరా రంగన్, డా.నవీన్ కుమార్ ప్రసంగించి, మూవ్‌మెంట్ డిజార్డర్స్ ఉన్న రోగులు, వారి సంర క్షకులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా రోగులు నిపుణ వైద్యులతో నేరుగా మాట్లాడి, తమ సమస్యలపై స్పష్టత పొందారు. ఇలాంటి కార్యక్రమాలు రోగుల లో ఆత్మవిశ్వాసం పెంచడంలో, సమాజంలో అవగాహన పెంపొందించడంలో, జీవిత నాణ్యతను మెరుగు పరచడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో డా. రేష్మ, డా.రింద, డా.సబీహా, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# కాలనీ మధ్యలో తాగుబోతుల అడ్డా ఏంటి?

## రాజరాజేశ్వరి నగర్ వాసుల ఆగ్రహావేశం

- రాత్రికి రాత్రి అక్రమ నిర్మాణం.. బగ్గా వైన్స్ దుందుడుకు ప్రయత్నం
- పాఠశాలలు, ఇళ్ల సముదాయాల మధ్యలో తాగుబోతులకు ఆహ్వానమా?
- జోనింగ్ నియమాలు, భద్రతా ప్రమాణాలు తుంగలో తొక్కి లంచాల లావా
- జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం.. "అక్రమ నిర్మాణం తొలగించాల్సిందే"



**శేరిలింగంపల్లి, డిసెంబర్ 03 (జనంసాక్షి) :** ప్రభుత్వ పెద్దలు, అధికారులు, పోలీసులు ప్రశాంతంగా ఉంటే రాష్ట్రమంతా ప్రశాంతంగా ఉన్నట్టేనా...? ప్రజా సంక్షేమం, ప్రజల భద్రత ఎవరికి పట్టదా అని కొండాపూర్ డివిజన్ పరిధి రాజరాజేశ్వరి నగర్ కాలనీ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానా కోసం అడ్డగోలుగా అనుమతులు నిచ్చి శాంతిభద్రతలు, మహిళా సంరక్షణపై కనీస ధ్యాస లేకుండా ఎక్కడపడితే అక్కడ, ఎలా పడితే అలా తాగుబోతుల కోసం వైన్ షాపులకు అనుమతులు నిచ్చి జనావాసాల మీదికి వదిలేయడం ప్రభుత్వం దుందుడుకు చర్య కాదా అని వారు దుమ్మెత్తిపోస్తున్నారు. కొండాపూర్ డివిజన్ రాజరాజేశ్వరి నగర్‌లో అడ్డదారిలో డబ్బులు వెదజల్లి అక్రమంగా అనుమతులను తెచ్చుకొని రాత్రికి రాత్రే దుర్మార్గంగా వైన్‌షాప్ కోసం నిర్మాణాన్ని కొనసాగించడంపై కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో బగ్గ వైన్స్ యాజమాన్యం ఎలాంటి అనుమతులు లేకుండా తాత్కాలిక పద్ధతిలో ఓ అక్రమ నిర్మాణాన్ని చేపట్టి అందులో వైన్సు నెలకొల్పడానికి ముమ్మర ప్రయత్నం చేస్తున్నారని, జోనింగ్ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించడమేనని రాజరాజేశ్వరి నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు స్పష్టం చేస్తున్నారు. ఇదే విషయమై జోనల్ కమిషనర్ హేమంత్ బోరడేకు బుధవారం వినతిపత్రం అందజేస్తూ జనసంచారం అధికంగా ఉండడంతోపాటు మహిళలు, పిల్లలు, పెద్దలు ఎప్పటికప్పుడు తిరిగే ఈ ప్రాంతంలో వైన్‌షాప్ కోసం నిర్మాణాన్ని కొనసాగించడం పూర్తిగా తప్పని స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. బగ్గా వైన్స్ కోసం నిర్మాణం జరుగుతున్న చోట పాఠశాలలు, ఇళ్ల సముదాయాలు ఉండటంతో ప్రజల భద్రతకు నేరుగా ముప్పు ఏర్పడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ ప్రమాణాలు భద్రతా నిబంధనలు జోనింగ్ నియమాలు ఏవీ పాటించకుండా పనులు కొనసాగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బగ్గ వైన్స్‌కు ఈ ప్రాంతంలో ఏర్పాటుకు అనుమతులున్నాయా లేదో అధికారులు వెంటనే పరిశీలించాలని కోరారు. అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి ఇప్పటివరకు చేసిన నిర్మాణాన్ని పూర్తిగా తొలగించాలని కాలనీవాసులు మూకుమ్మడిగా డిమాండ్ చేస్తున్నారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన శాఖలే స్పందించకపోవడం సిగ్గుచేటని, లంచాలకు మరిగిన అధికారులు ఎవరి జీవితాలను వంచన చేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

# ఇంటికో కేజీ చికెన్.. వ్యక్తికో బీర్ బాటిల్ పల్లెల్లో ప్రచార జోరు

## సాయంత్రం 5గంటల నుండే చికెను.. మందు పంపిణీ...



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** గ్రామపంచాయతీ ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో పల్లెల్లో ప్రచార జోరు మొదలైంది సాయంత్రం 5 గంటల నుండే ఇంటికో కేజీ చికెన్ వ్యక్తికో బీర్ బాటిల్ పంపిణీ జోరుగా కొనసాగుతుంది రంగారెడ్డి జిల్లాలో మొత్తం 21 మండలాలకు ఇప్పటికే షాద్ నగర్ డివిజన్‌లో ఫరూక్‌నగర్, నందిగామ, చౌదర్‌గూడా, కొందుర్గ, కేశంపేట, కొత్తూరు, రాజేంద్రనగర్ శంషాబాద్ డివిజన్ మండలాలలో మొదటి విడతలో 7 మండలాల్లో 174 పంచాయతీ లకు గాను ఐదు పంచాయతీలు కన్నశాంతివనం దేవునిబండ తండా చెరుకుపల్లి పాత ఆగిర్యాల లక్ష్మీదేవిపల్లి పంచాయతీ సర్పంచ్‌లు వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యాయి మిగిలిన 169 పంచాయతీలో సర్పంచ్ వార్డు స్థానాలకు నామినేషన్లపై పరిశీలనతో అభ్యర్థుల జాబితాను అధికారులు ప్రకటించారు రెండో విడతలో మరో ఏడు మండలాల్లో చేవెళ్ల డివిజన్ లోని శంకర్ పల్లి మొయినాబాద్ చేవెళ్ల షాబాద్ కందుకూరు రెవెన్యూ డివిజన్ పరిధి ఆమనగల్ కడ్తల్ తలకొండపల్లి మండలంలోని 174 పంచాయితీలో నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుండగా నాయకులు బుజ్జగింపులు చేసి కొన్నిటిలో విత్ డ్రా సైతం చేయించిన పరిస్థితి ఉంది పంచాయతీ ఎన్నికలకు ప్రచార సమయం కూడా తక్కువగా ఉన్నందున ఆయా పార్టీల మద్దతుదారులు రాత్రి పగలు తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందు కు నానా అవస్థలు పడుతున్నారు ఓప్రాంతాన్ని ఎంచుకొని అక్కడే బీరు బిర్యానితో దావతులు చేస్తూ సాయంత్రం ఐదు గంటలు అయిందంటే చాలు ఇంటికో కేజీ చికెన్ వ్యక్తికో బీర్ బాటిల్ పంపిణీ చేస్తున్నారు దీంతో గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది...

# ఎమ్మెల్యే చాకచక్యంతో 25 గ్రామాలు ఏకగ్రీవం

- ఏకగ్రీవ సర్పంచ్‌లకు శాలువాతో ఘన సన్మానం చేసిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి
- "కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి.. పార్టీ బలోపేతం కోసం కలిసికట్టుగా కృషి చేయాలి"
- పోటీ ఉన్న చోట కూడా కాంగ్రెస్ అభ్యర్థులదే విజయమని ఎమ్మెల్యే ధీమా



**తాండూరు, డిసెంబరు 3 (జనంసాక్షి):** తాండూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి చొరవ, చాకచక్యంతో 25 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. కరణ్‌కోట్, రాంపూర్ తండా, వీరారెడ్డిపల్లి, బిజ్వార్, చిట్టిఘనాపూర్, లక్ష్మీనారాయణపూర్, గంగాసాగర్, దేవులతాండ, సంగెంఖుర్ద్, కిస్తాపూర్, జెక్కేపల్లి, సంగాయిగుట్ట తండా, పెర్కంపల్లి తండా, బండమీదిపల్లి, సంగాయిపల్లి తండా, రుద్రారం, చైతన్యనగర్, దుగ్గాపూర్, సిద్దన్నమడుగు తండా, మంథంగౌడ్, బాబునాయక్ తండా, హంక్యానాయక్ తండా, బద్లాపూర్, లింగంపల్లి, బుగ్గాపూర్ గ్రామాలు పోటీ లేకుండా ఏకగ్రీవమయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం తాండూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఏకగ్రీవ సర్పంచ్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కరణ్‌కోట్ సర్పంచ్ రాజ్‌కుమార్, చైతన్యనగర్ సర్పంచ్ గౌరమ్మ శ్రీనివాస్, రుద్రారం సర్పంచ్ ఉప్పరి పద్మమ్మ, బద్లాపూర్ సర్పంచ్ నవనీత చంద్రశేఖర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. వారితోపాటు వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "ప్రజాప్రతినిధులందరూ కలిసికట్టు గా పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యం. కాంగ్రెస్ పార్టీతోనే అది సాధ్యమ వుతుంది. మెజారిటీ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కావడం పార్టీ బలాన్ని, ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని తెలుపుతోంది. పోటీ ఉన్న చోట కూడా కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులే భారీ మెజారిటీతో గెలుస్తారు. ప్రత్యర్థులకు డిపాజిట్ కూడా రాదు" అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పటిష్ఠత కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## దేవరయాంజాల్‌లో మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**శామీర్‌పేట్ (జనం సాక్షి) :** తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవర యాంజాల్ బస్తీ దవాఖాన వద్ద మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలను సులభంగా అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఆరోగ్య శిబిరంలో జనరల్ హెల్త్ చెకప్, బీపీ, షుగర్, కంటి పరీక్షలు వంటి పలు సేవలను నిపుణుల బృందం ఉచితంగా అందించింది. అవసరమైన మందులను కూడా శిబిరంలోనే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ హాస్పిటల్ కు చెందిన డాక్టర్లు మేఘన, సాహితి, ప్రియ, మార్కెటింగ్ విభాగం నుంచి ఆర్.సంజయ్ బాబు, పి.చేరాలు, జి.రాఘవేంద్ర రెడ్డి, సిబ్బంది టి.కావ్య, సిహెచ్.కవిత పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజి గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యులు, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, శ్రీ సీతారామ స్వామి దేవస్థానం ఛైర్మన్ పేండం లక్ష్మీనారా యణ, జాతీయ కళా మండలి అధ్యక్షులు ఎన్.వై.అశోక్, పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు దురదృష్టకరం

- క్షమాపణలు చెప్పాలన్న మంత్రి అడ్లూరి
- కొండగట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు



**జగిత్యాల, డిసెంబర్3 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రజలను కించపరుస్తూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పవన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో బుధవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అదేవిధంగా బేతాళస్వామిని కూడా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొండగట్టులో ఇటీవల జరిగిన ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్య ద్వారానే వారు ఉన్నత స్థానానికి చేరుతారన్నారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ డ్వాక్రా మహిళలను మోసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలను ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో రూ.590 కోట్లు వెచ్చించి నిరుపేదలకు రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యాన్ని అందించిన ఘనత తమ ప్రభుత్వానిదే అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించింది తామే అన్నారు. ఈ ప్రభుత్వం రైతులకు అంకితమని.. దోపిడీదారులకు, దొంగలకు కాదన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిచే విధంగా సిఎం రేవంత్ తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు.

# జర్నలిస్టుల జంగ్ సైరన్

- నినాదాలతో దద్దరిల్లిన మహానగరం
- జర్నలిస్టుల మహా ధర్నా గ్రాండ్ సక్సెస్
- నలుదిశలా కదిలివచ్చిన కలం కార్మికులు





**హైదరాబాద్ (జనంసాక్షి) :** పన్నెండేండ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మాసాబ్ ట్యాంక్ లోని సమాచార కమిషనర్ కార్యాలయం ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో బుధవారం నాడు జరిగిన మహా ధర్నా అనూహ్యరీతిలో విజయవంతం అయ్యింది. టీయూడబ్ల్యూజే పిలుపుపై స్పందించి, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర నలుమూలల నుండి ఏంతో ఉత్సాహంగా, భారీగా జర్నలిస్టులు తరలి రావడం విశేషం. జర్నలిస్టుల నినాదాలతో మహానగరం రోడ్లన్నీ దద్దరిల్లాయి. సమాచార శాఖ చరిత్రలో, ఆ కార్యాలయం వద్ద ఇంత పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు ధర్నా చేయడం ప్రప్రథమని పోలీసు అధికారులతో సహా పలువురు సీనియర్ పాత్రికేయులు చర్చించుకోవడం విశేషం. ఈ మహా ధర్నాకు టీయూడబ్ల్యూజే యూనియన్ అనుబంధ సంస్థలైన తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం, మహిళా జర్నలిస్టుల విభాగం, తెలంగాణ ఉర్దూ జర్నలిస్టుల సమాఖ్య, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్, జూబ్లీహిల్స్ హౌజింగ్ సొసైటీ, జవహర్ లాల్ హౌసింగ్ సొసైటీ, వయోదిక జర్నలిస్టుల సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతును ప్రకటించి మహా ధర్నాలో భాగస్వామ్యమయ్యాయి. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన ఈ మహా ధర్నాలో, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎంఏ మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, నగునూరి శేఖర్, చిన్న పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్ రెడ్డి, రమేష్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కె.ఎన్.హరి, వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, హరీష్, జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోపరాజు, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఏ. రాజేష్, వయోదిక జర్నలిస్టుల సంక్షేమ సంఘం నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, ఉర్దూ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్, సీనియర్ మహిళా జర్నలిస్టులు విమల, అత్తలూరి అరుణ, వాకటి మంజుల, కళ్యాణం రాజేశ్వరీ తదితరులు మాట్లాడారు.

## అమెరికాలో తల్లీబిడ్డల హత్య కేసులో హంతకుడు నజీర్ హమీద్‌పై రివార్డు ప్రకటన

**న్యూయార్క్, డిసెంబరు3 (జనంసాక్షి) :** అమెరికాలో ఎనిమిదేళ్ల క్రితం కుమారుడితో సహా దారుణ హత్యకు గురైన శశికళా నర్రా మర్డర్ కేసు నిందితుడిపై రివార్డ్ ప్రకటిస్తూ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును ఛేదించే క్రమంలో గత నెలలో నజీర్ హమీద్‌ను నిందితు నిగా తేల్చిన దర్యాప్తు బృందం.. ప్రస్తుతం అతను పరారీలో ఉండ టంతో అతడి ఆచూకీ తెలిపిన వారికి యాభై వేల అమెరికన్ డాలర్ల ప్రోత్సాహకం ఇస్తామని పేర్కొంది. అమెరికా న్యూజెర్సీలోని మాపుల్‌షేడ్ లో 2017 మార్చి 23న.. ఆంధ్రప్రదేశ్ కు చెందిన 40ఏళ్ల శశికళా నర్రా, ఆమె ఏడేళ్ల కుమారుడు అనీశ్ సాయిలు ఇంట్లో దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసులో తొలుత భర్త హనుమంత రావు నర్రాపై అనుమానం వ్యక్తం చేసిన అధికారులు.. ఆ తర్వాత గత నవంబ ర్‌లో ల్యాప్‌టాప్ ఆధారంగా అసలు నిందితుడిగా నజీర్ హమీద్‌ను తేల్చారు. అయితే.. అతను హత్య జరిగిన ఆరు నెలలకే భారత్‌కు తరలిపోయి.. ప్రస్తుతం అక్కడే తలదాచుకుంటున్నట్టు అమె రికా అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే హమీద్‌పై అరెస్ట్ వారెంట్ జారీచేసినట్టు ఎఫ్బీఐ తెలిపింది. అతడిని మోస్ట్ వాంటెడ్ నిందితుల జాబితా లో చేర్చి, ఆచూకీ తెలిపిన వారికి 50వేల డాలర్లు ఇస్తామని వెల్లడించింది. ఇంకా దర్యాప్తు కొనసాగుతుం డటంతో మృతురాలి భర్త హను మంతరావు కార్యకలాపాలపై నిఘా ఉంచినట్లు బర్లింగ్టన్ కౌంటీ ప్రాసిక్యూటర్ కార్యాలయ అధికారులు స్పష్టం చేశారు.

## పవన్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకం

- తెలంగాణకు ఏనాడూ మద్దతు ఇవ్వని పవన్
- మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, డిసెంబర్3 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తీవ్రంగా స్పందించారు. ఎల్బీనగర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ఆమె, పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తమ బిడ్డలు ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేసిన కవిత, పవన్ కళ్యాణ్ మాత్రం ఆనాటి నుంచి ఇనాటి వరకు తెలంగాణకు వ్యతిరేకంగానే ఉన్నారని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ నాయకుల దిష్టి కళ్లతో కోనసీమ పాడైందని అనడంపై కవిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు ఏనాడూ దిష్టి పెట్టలేదు. కోనసీమ మాదిరిగా తెలంగాణ కావాలనుకున్నాం. తెలంగాణ బిడ్డల మనసు చాలా గొప్పది, మేము పెద్దగా ఆలోచిస్తాం అని ఆమె అన్నారు. తమ రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు అవుతున్నా, ఎప్పుడు కూడా జై తెలంగాణ, జై ఆంధ్రా అనే తాము కోరుకున్నామని, తెలంగాణ ఎంత బాగుందో ఆంధ్రా కూడా అంతే బాగుండాలని ఆకాంక్షించామని ఆమె స్పష్టం చేశారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వాలని నేను పార్లమెంట్‌లో కూడా మాట్లాడాను. పక్కోడు బాగుంటే మా కళ్లు మండవు. పక్కోనిది గుంజుకోవాలనుకునే వాళ్లం కాదు. మేము బాగుండాలని కోరుకుంటాం కానీ, పక్కోడు చెడిపోవాలని అనుకోం. అలా అనుకొని ఉంటే తెలంగాణ ఉద్యమ స్వరూపం వేరేలా ఉండేది. మా బిడ్డలు ప్రాణాలు త్యాగం చేశారే తప్ప, ఒక్క పరాయి రాష్ట్రం వారి మీద కూడా చేయి ఎత్తలేదని కవిత వివరించారు. ఆనాడు సినిమా నటుడిగా మాట్లాడారు కానీ, ఇప్పుడు పవన్ కళ్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎం అని, ఆయన మాటలు ఆంధ్రా ప్రజలకు ఆపాదిస్తారని కవిత హెచ్చరించారు. కనుక పవన్ కళ్యాణ్ జాగ్రత్తగా ఆలోచన చేసి మాట్లాడాలని ఆమె సూచించారు.




## రాహుల్‌ను విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

- మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్3 (జనంసాక్షి) :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి బిఆర్ఎస్ నేత కేటీఆర్‌కు లేదని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కుటుంబం రాజకీయం చేసిందని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రశ్నించే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. విలువలు లేని రాజకీయాలు మంచిది కాదు. కేటీఆర్‌కు నైతిక విలువలు ఉంటే రాహుల్ గాంధీ గురించి ఇంకోసారి మాట్లాడొద్దు. కాంగ్రెస్ జాతీయ పార్టీ.. భారత రాష్ట్ర సమితి ప్రాంతీయ పార్టీ. కేటీఆర్.. ఇక్కడ రాజకీయం చేయి.. సీఎం, పీసీసీ చీఫ్, మేమంతా సిద్ధం. రాహుల్ గాంధీని విమర్శిస్తే విడిచిపెట్టనని జగ్గారెడ్డి అన్నారు.

## గాంధీభవన్ ముట్టడికి బిజెపి యత్నం

### అడ్డుకున్న పోలీసులు..స్వల్ప ఉద్రిక్తత



**హైదరాబాద్, డిసెంబర్3 (జనంసాక్షి) :** నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. నాంపల్లిలోని గాంధీభవన్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు గాంధీ భవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ నేతలు బుధవారం స్పందిస్తూ..నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పే వరకు తాము పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. గాంధీ భవన్‌ను ముట్టడించేందుకు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ శ్రేణులు సైతం సమాయత్తమవుతున్నట్లు సమాచారం. గాంధీ భవన్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల్లో ఎటువంటి తప్పు లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. నేతల మధ్య ఏమైనా మనస్పర్థలు ఉంటే వాటిని అధిగమించి.. అందరిని కలుపుకుని పోవాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను ఉదాహరించారని చెప్పారు. అంతేకాని హిందూ దేవుళ్లను కించపరిచే ఉద్దేశ్యం సీఎం రేవంత్ రెడ్డికి ఎట్టి పరిస్థితుల్లో లేదని పార్టీ సీనియర్ నేతలు స్పష్టం చేస్తున్నారు. అదీకాక రేవంత్ రెడ్డి పాలనపై విమర్శించేందుకు బీజేపీ నేతలకు ఏ అంశం దొరకలేదని చెప్పారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వారు ఆక్షేపిస్తున్నారని చెప్పారు.

## ప్రతి ఒక్క లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇల్లు

- ఐదేండ్లలో 17లక్షల ఇందిరమ్మ ఇండ్లు
- హుస్నాబాద్‌లో బహిరంగ సభలో మంత్రి వివేక్



**హుస్నాబాద్, డిసెంబర్3 (జనంసాక్షి) :** ఐదేళ్లలో ప్రతి ఒక్క లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్న భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఐదేండ్లలో 17లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లబ్దిదారులకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పారు. పేదల కోసం రేషన్ కార్డుపై సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఫైర్ అయ్యారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లుఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ సర్కార్లో కేసీఆర్ కుటుంబ సభ్యులు తమ ఆస్తులు పెంచుకుని రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు మంత్రి వివేక్. బీఆర్ఎస్ అప్పులకు నెలకు రూ. 5 వేల కోట్ల మిత్తీలు కడుతున్నామని చెప్పారు. యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యారంగంపై భారం తగ్గుతుందన్నారు. హుస్నాబాద్ లో అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సర్కార్ చేసిన అభివృద్ధితోనే జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ గెలిచిందన్నారు వివేక్. కేటీఆర్ ఒక ఫెయిల్యూర్ లీడర్ అని..ఆయన నాయకత్వంలో పనిచేయాలో లేదో ఆ పార్టీ కార్యకర్తలు తెలుసుకోవాలన్నారు.

## ఆటోలో అనుమానాస్పదంగా రెండు మృతదేహాలు

### దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**హైదరాబాద్, డిసెంబర్3 (జనంసాక్షి) :** నగరంలోని చాంద్రాయణగుట్టలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం కలకలం రేపింది. రోమన్ హోటల్ ఎదురుగా ఉన్న ఓ ఆటోలో ఇద్దరి మృతదేహాలను స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతులను జహంగీర్ (24), ఇర్ఫాన్ (25)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అధిక మోతాదులో డ్రగ్స్ తీసుకోవడంతోనే వారు మృతిచెందినట్లు భావిస్తున్నారు. ఘటనాస్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది. అక్కడ మూడు సిరంజీలు లభ్యమయ్యాయి. మరో వ్యక్తి పరారైనట్లు సమాచారం. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ సాయం తో ఆధారాలు సేకరించారు. అక్కడ మూడు సిరంజీలు లభించాయి. దీంతో అధిక మోతాదులోడ్రగ్స్ తీసుకోవడంతోనే వారు చనిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.


## స్క్రబ్ టైఫస్ కలకలం

### పల్నాడు జిల్లాలో ఇప్పటికే ఇద్దరు మృతి.. కొందరికి లక్షణాలు

**పల్నాడు, డిసెంబర్3 (జనంసాక్షి) :** పల్నాడు జిల్లాలో స్క్రబ్ టైఫస్ కలకలం సృష్టిస్తుంది. ఈ లక్షణాలతో ఇద్దరు మహిళలు మృతి చెందారు. అలానే మరొకరు చికిత్స పొందుతున్నారు. ముప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని జ్యోతి జ్వరం, ఒంటినొప్పులతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 20 రోజుల క్రితం మరణించింది. రాజుపాలెంకు చెందిన వృద్ధురాలు నాగమ్మ కూడా జ్వరంతో చికిత్స పొందుతూ 20 రోజుల క్రితం మృతి చెందింది. అలానే రాజుపాలెం మండలం కొత్తూరుకు చెందిన మరో వృద్ధురాలు సాలమ్మ కూడా స్క్రబ్ టైఫస్ లక్షణాలతో ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చనిపోయిన జ్యోతి, నాగమ్మల శాంపిల్స్ ను టెస్టుల కోసం ముంబై పంపించారు. పరీక్షల్లో స్క్రబ్ టైఫస్‌తో మృతిచెందినట్లు రిపోర్టుల్లో తేలినట్లు ప్రచారం జరుగుతుంది. దీని గురించి స్పష్టత రావాల్సి ఉంది. స్క్రబ్ టైఫస్ వ్యాధి గురించి వైద్యులు పలు వివరాలు తెలిపారు. నల్లిని పోలిన చిన్న కీటకం స్క్రబ్ టైఫస్. గత కొన్నేళ్లుగా జిల్లాలో తన ఉనికిని చాటుకుంటూనే ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దీని బారినపడి ఇబ్బంది పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. స్క్రబ్ టైఫస్ కాటుతో సోకే బ్యాక్టీరియా ప్రభావాన్ని గుర్తించేందుకు గుంటూరు సమగ్రాసుపత్రిలో ప్రయోగశాల ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి తెలిపారు. అనుమానిత లక్షణాలున్న వారి రక్త నమునాలు పంపితే నిర్ధారణ పరీక్షలు చేస్తామని వైద్యులు తెలిపారు. పాజిటివ్‌గా గుర్తిస్తే చికిత్స అందిస్తారని వైద్యాధికారి డాక్టర్ రవి తెలిపారు. ఇది మనుషుల నుంచి మనుషులకు వ్యాపించదని వివరించారు. తగిన జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

## ఢిల్లీ వెళ్లిన డిప్యూటీ సీఎం డీకే

### నాయకత్వ మార్పుపై మళ్లీ ఊహాగానాలు



**బెంగళూరు, డిసెంబరు3 (జనంసాక్షి) :** కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బుధవారంనాడు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు వ్యవహారంపై ముందుగా కలిసి చర్చించుకోండంటూ కాంగ్రెస్ అధిష్ఠానం సూచించడంతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇటీవల పరస్పరం బ్రేక్‌ఫాస్ట్ ఆతిథ్యం ఇచ్చిపుచ్చుకోవడం జరిగాయి. ఇరువురు నేతలూ మీడియా ముందుకు వచ్చి తమ ఐక్యతను చాటుకున్నారు. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటనకు బయలుదేరడం ఆసక్తికరమైంది. అయితే ఇదెలాంటి రాజకీయ పర్యటన కాదని బెంగళూరులో మీడియాకు డీకే తెలిపారు. ఢిల్లీలో ఒక వివాహ కార్యక్రమానికి హాజరవుతున్నాననీ, రెండు మీటింగ్‌లు కూడా ఉంటాయని డిప్యూటీ సీఎం తెలిపారు. 'ఓట్ చోరీ'పై ఈనెల 14న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించనున్న ర్యాలీ ఏర్పాట్లను కూడా తాను చూసుకోవాల్సి ఉందని చెప్పారు. కాగా సీఎం సిద్ధారామయ్యతో పాల్గొనాల్సిన ఒక కార్యక్రమం కోసం ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ఉదయం మంగళూరు వచ్చారు. కేపీసీసీ అధ్యక్షుడు డీకే మద్దతుదారులు ఈ సందర్భంగా 'డీకే-డీకే' అంటూ నినాదాలు చేశారు. దీనిపై డీకేను మీడియా ప్రశ్నించినప్పుడు, కొందరు మోదీ-మోదీ అంటూ నినాదాలు చేస్తారని, మరికొందరు డీకే-డీకే అని, ఇంకొందరు రాహుల్-రాహుల్ అని, సిద్ధు-సిద్ధు అని నినాదాలు చేస్తుంటారని, అందులో తప్పేమీ లేదని అన్నారు. జనం తమ ప్రేమాభిమానాలను చాటుకోవడం సహజమేనని తెలిపారు. మంగళూరులో కేసీ వేణుగోపాల్‌తో కలిసి ఒక కార్యక్రమంలో పాల్గొన్న సిద్ధరామయ్య సైతం.. అధిష్ఠానం పిలిస్తే ఢిల్లీకి వెళ్తానని చెప్పారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370